


సత్యమేవ జయతే

సాక్షి

'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50



టమాటా సెంచరీ దాటి పోయింది.. చిక్కుడు అయితే డబుల్ సెంచరీ దిశగా పరుగులు పెడుతోంది.. ఐదు రూపాయలకు దొరికే కొత్తిమీర, పుదీనా కట్ట ఇప్పుడు పది, పదిహేను రూపాయలు పెట్టినా రావడం లేదు.. అదీ, ఇదీ అని ఏదీ లేదు. అన్ని కూరగాయల ధరలూ అడ్డగోలుగా పెరిగిపోయాయి. 'జేబులో డబ్బులు తీసుకెళ్లి సంచీలో కూరగాయలు తేవడం కాదు.. సంచీలో డబ్బులు తీసుకెళ్లి జేబులో కూరగాయలు పెట్టుకోవాల్సి వచ్చేట్టుంది' అని సామాన్యుడు నిట్టూరుస్తున్న పరిస్థితి. సుమారు కోటిన్నరకుపైగా జనాభా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ నగరం సమీపంలో కూరగాయల సాగు పెద్దగా లేకపోవడమే దీనికి కారణమని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. చాలా వరకు కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో.. ఏమాత్రం కొరత వచ్చినా, రేట్లు చుక్కలను తాకుతున్నాయని అంటున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

లోకల్	నాన్ లోకల్
15%	85%

పంట లేకే.. ధరల మంట

సాగు లేకపోవడంతో చుక్కలు తాకుతున్న కూరగాయల ధరలు

- సిటీ 85 శాతానికిపైగా దిగుమతులపైనే ఆధారపడిన స్థితి
- ఇతర రాష్ట్రాల్లోనూ కూరగాయల సాగుపై ఎండల ఎఫెక్ట్
- దీనితో అడ్డగోలుగా పెరిగిపోయిన ధరలు
- రాష్ట్రంలో పండించే కూరగాయల దిగుబడి వచ్చేదాకా ఇంతే!
- ఆగస్టు వరకు రేట్లు తగ్గే అవకాశం లేదంటున్న వ్యాపారులు
- క్రాప్ మ్యాపింగ్, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమని వెల్లడి

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తగ్గిన దిగుబడి

ఒక్కసారిగా రేట్ల పరుగులు

ఇటీవలి వరకు కూరగాయల ధరలు కాస్త అటూఇటూగా అయినా అందుబాటులోనే ఉన్నాయి. కానీ వారం, పది రోజుల కింద ఒక్కసారిగా ధరలు పెరగడం మొదలైంది. ఇప్పుడు ఏకంగా కిలో రూ.100 దాటిపోయాయి. ఏటా ఎండాకాలం సీజన్‌లో కూరగాయల సాగుపై ప్రభావం ఉంటుందని, కానీ ఈసారి ఉష్ణోగ్రతలు మరీ అధికంగా నమోదవడం, వానలు జాడ లేకపోవడంతో పరిస్థితి తీవ్రంగా మారిందని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండించే ప్రాంతాల్లో

మిగతా II వ పేజీలో ▶

వానలు జాడ లేక, అధిక ఉష్ణోగ్రతలతో దెబ్బ

క్రాప్ మ్యాపింగ్ అంటే..

కూరగాయలకు సంబంధించి క్రాప్ మ్యాపింగ్ చేస్తే అనేక లాభాలు ఉంటాయని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. సాధారణంగా ఎంచుకున్న ప్రాంతాల్లో పెరిగే కూరగాయల రకాలు, సాగు చేసే భూపరిమాణం, ఏ సమయంలో ఏ పంట వేయాలని నిర్దేశించడమే క్రాప్ మ్యాపింగ్. రైతులకు దీనిపై అవగాహన కల్పించి, అవే పంటలు వేసేలా చూస్తే లాభసాటిగా ఉండటమే కాకుండా కూరగాయల కొరతను అధిగమించ వచ్చని వివరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూరగాయలకు సంబంధించి ఎలాంటి క్రాప్ మ్యాపింగ్ జరగడం లేదని పేర్కొంటున్నారు.



నట్టింట్లో.. నచ్చేట్టు

ఇంటీరియర్ ప్లాంటేషన్.. ఇప్పుడిదే ట్రెండ్
అటు అందం.. ఇటు ఆరోగ్యం
సింబయాటిక్స్‌తో కాలుష్య నివారణ
టేబుల్ ప్లాంట్స్‌తో ఒత్తిడికి చెక్
ఆక్సిజన్ బాంబ్స్‌కు ఆదరణ

- వివరాలు 11లో

రౌడీలపై డేగ కన్ను!



- వివరాలు 10లో

పంట లేకే ధరల మంట

▶ మొదటి పేజీ తరువాయి

సాగు సరిగా జరగలేదని, దిగుబడులు కూడా తగ్గిపోయాయని అంటున్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈసారి ఎండల ఎఫెక్ట్ ఎక్కువగా ఉండటంతో ధరలు అడ్డగోలుగా పెరిగాయని పేర్కొంటున్నారు. ఇక ఎక్కువశాతం వేరే రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుండటం.. మన దగ్గర మిగతా సీజన్లలో పండిన కూరగాయలను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీలు లేకపోవడం సమస్యగా మారిందని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తే.. అటు రైతులకు ప్రయోజనం కలగడంతోపాటు ధరల నియంత్రణతో వినియోగదారులకూ లాభం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కానీ ఈ దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు.



బోయిన్‌పల్లి మార్కెట్‌కు ప్రతిరోజూ 25 వేల క్వింటాళ్లు

హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్‌కు ప్రతిరోజూ 25 వేల క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అవుతాయి. అందులో 15 శాతం వరకే తెలంగాణ జిల్లాల నుంచి వస్తున్నాయి. మిగతా కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నవే. ఎక్కువగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి వస్తున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న చేవెళ్ల, వికారాబాద్, మేడ్చల్, శామీర్‌పేట, ములుగు, గజ్వేల్, భువనగిరి, జహీరాబాద్, సిద్దిపేట, నిజామాబాద్ ప్రాంతాల్లో కూరగాయలు పండిస్తారు. ఎండల ఎఫెక్ట్‌తో ఏటా ఏప్రిల్, మే నెలల్లో కూరగాయల ధరలు అధికంగా ఉంటాయి. తర్వాత తగ్గుతాయి. కానీ ఈసారి ధరలు తగ్గే పరిస్థితులు లేవని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం సాగు దశలో ఉన్న కూరగాయలు ఆగస్టు నాటికి చేతికి అందుతాయని, ధరలు నియంత్రణలోకి వస్తాయని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. అప్పటివరకు దిగుమతులు తప్పని పరిస్థితిలో ధరలు ఎక్కువగానే ఉంటాయని అంటున్నారు.



- ఎం.వెంకన్న, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ, బోయిన్‌పల్లి

దిగుమతులపైనే ఆధారం..

ఏటా ఏప్రిల్, మే, జూన్‌లో కూరగాయల కోసం ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. రాష్ట్రంలోని జిల్లాల నుంచి చాలా తక్కువగా కూరగాయలు వస్తున్నాయి. అందుకే ఎక్కువ ధరలు ఉన్నాయి. ఆగస్టు నాటికి ధరలు తగ్గుముఖం పడతాయి.



ఆకుకూరలు కూడా దొరకట్లేదు

ఇప్పుడు ఆకుకూరలు కూడా దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండలు ఎక్కువగా ఉండటంతో పంటల దిగుబడి తగ్గింది. అందుకే వేరే రాష్ట్రాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. హోల్‌సేల్‌లో కొత్తిమీర పెద్దకట్ట రూ.30, పుదీనా రూ.15కుపైగా పలుకుతున్నాయి.

- ఆనంద్‌కుమార్, ఆకుకూరల వ్యాపారి, గుడిమల్కాపూర్

గతేడాది, ఈసారి కూరగాయల దిగుమతులు, హోల్‌సేల్ ధరల తీరు ఇదీ..

ఏప్రిల్– 2023			ఏప్రిల్– 2024		
కూరగాయలు	దిగుమతి (క్వింటాళ్లలో)	కేజీ ధర (రూ.లలో)	కూరగాయలు	దిగుమతి (క్వింటాళ్లలో)	కేజీ ధర (రూ.లలో)
వంకాయ	9,490	16	వంకాయ	10,825	18
క్యాప్సికం	25,365	39	క్యాప్సికం	15,425	55
క్యారట్	55,565	17	క్యారట్	38,967	20
బీన్స్	11,592	56	బీన్స్	12,909	53
ఆలుగడ్డ	99,307	17	ఆలుగడ్డ	1,08,375	27
టమాటా	58,457	9	టమాటా	47,584	13

గతేడాది, ఈసారి కూరగాయల దిగుమతులు, హోల్‌సేల్ ధరల తీరు ఇదీ..

మే–2023			మే–2024		
కూరగాయలు	దిగుమతి (క్వింటాళ్లలో)	కేజీ ధర (రూ.లలో)	కూరగాయలు	దిగుమతి (క్వింటాళ్లలో)	కేజీ ధర (రూ.లలో)
వంకాయ	7,339	21	వంకాయ	13,200	20
క్యాప్సికం	19,860	42	క్యాప్సికం	18,715	44
క్యారట్	7,826	21	క్యారట్	16,126	26
బీన్స్	2,839	95	బీన్స్	6,232	101
ఆలుగడ్డ	1,19,877	17	ఆలుగడ్డ	1,15,723	26
టమాటా	45,168	13	టమాటా	68,913	20

గతేడాది, ఈసారి కూరగాయల దిగుమతులు, హోల్‌సేల్ ధరల తీరు ఇదీ..

జూన్–2023		
కూరగాయలు	దిగుమతి (క్వింటాళ్లలో)	కేజీ ధర (రూ.లలో)
వంకాయ	7,205	28
క్యాప్సికం	16,637	57
బీన్స్	2,625	99
ఆలుగడ్డ	1,15,997	18
టమాటా	55,466	40

జూన్–2024 (18వ తేదీ వరకు)		
కూరగాయలు	దిగుమతి (క్వింటాళ్లలో)	కేజీ ధర (రూ.లలో)
వంకాయ	7,730	21
క్యాప్సికం	11,133	57
బీన్స్	1,799	108
ఆలుగడ్డ	69,525	28
టమాటా	46,197	75

కార్ పూలింగ్.. వేర్వేరు పనివేళలు

సైబరాబాద్‌లోని ఐటీ కంపెనీలకు ట్రాఫిక్ పోలీసుల సూచన

ట్రాఫిక్ రద్దీ నియంత్రణపై వివిధ సంస్థలతో సమావేశం


సాక్షి, హైదరాబాద్: ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు.. ఇలా ఎన్ని నిర్మించినా హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గడం లేదు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటోంది. చినుకు పడితే చాలు కిలోమీటర్ల కొద్దీ వాహనాల రద్దీతో వాహనదారులకు నరకం కనిపిస్తోంది. దీంతో సైబరాబాద్ పోలీసులు ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ ఐటీ కంపెనీలు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌తో కలిసి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు గచ్చిబౌలిలోని ఫీనిక్స్ ఇన్ఫోసిటీలో సమావేశమయ్యారు. ఐటీ కారిడార్‌లో రద్దీని తగ్గించడంతోపాటు నిర్వహణ వ్యూహాలపై సమగ్రంగా చర్చించారు. ఢిల్లీలో అమలవుతున్న కార్ పూలింగ్ విధానాన్ని ఐటీ కారిడార్ పరిధిలోనూ అమలు చేయడాన్ని ఐటీ సంస్థలు పరిశీలించాలని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ సూచించారు. ఈ విధానంతో వాహనాల రద్దీ, కాలుష్యం తగ్గడంతోపాటు ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు. అలాగే ఉద్యోగులందరికీ ఒకే పనివేళలు కాకుండా వేర్వేరు సమయాలను కేటాయించాలన్నారు. దీనివల్ల కూడా వాహనాల రద్దీ గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సీఎస్సీ జనరల్ సెక్రటరీ రమేష్ కాజా తదితరులు పాల్గొన్నారు.



ఐటీ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు

కార్ పూలింగ్ అంటే?

ఒకే ఆఫీసులో పనిచేసే ఉద్యోగులు ఒక్కో వాహనంలో వచ్చే బదులు నలుగురు చొప్పున కలిసి ఒకే కారులో ఆఫీసుకు రావడాన్ని కార్ పూలింగ్ అంటారు. ఈ విధానంలో ఒకరోజు ఒక ఉద్యోగి కారు తీసుకొస్తే ఆ మరుసటి రోజు మరో ఉద్యోగి కారులో ప్రయాణిస్తారు. దీంతో ప్రతిరోజూ ఒకే సమయంలో, ఒకే రహదారిలో నాలుగు కార్లు రోడ్లపైకి రాకుండా ఒకే కారులో నలుగురు ఉద్యోగులు ఆఫీసుకు చేరుకుంటారు.



సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 91

శనివారం 22-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ప్రపంచ శ్రేయస్సుకు యోగా

జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థను యోగా మార్చగలదన్న ప్రధాని మోదీ

-6లో



జైల్లోనే అరవింద్ కేజ్రీవాల్

రెగ్యులర్ బెయిల్ ఉత్తర్వులపై మధ్యంతర స్టే ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు

-6లో

ఒకే దఫా రుణమాఫీ

ఇందు కోసం రూ.31 వేల కోట్లు అవసరం..

మొత్తం 47 లక్షల మంది రైతులకు లబ్ధి..

కేబినెట్ భేటీ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

మంత్రివర్గ సమావేశంలో మాఫీ విధివిధానాలపై చర్చ

సోనియా పుట్టిన రోజైన డిసెంబర్ 9 కటాఫ్ తేదీ

మంత్రివర్గం ఏకతాటిమీద నిలిచి, ఏక గొంతుకతో ఈ నిర్ణయం తీసుకుంది

- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ మధ్య రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ
- గడువులోగానే రుణమాఫీ చేస్తాం.. విధివిధానాలపై త్వరలో జీవో
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు ఇచ్చే సమాచారమే అధికారికం



కేబినెట్ భేటీ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి, శ్రీధర్‌బాబు, రాజనర్సింహ, భట్టి, తుమ్మల, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: రుణమాఫీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకే దఫాలో రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని తెలిపింది. ఇందుకు రూ. 31 వేల కోట్లు అవసరమని పేర్కొంది. సోనియాగాంధీ పుట్టిన రోజైన డిసెంబర్ 9వ తేదీని రుణమాఫీకి కటాఫ్‌గా ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే రైతు రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రుణమాఫీపై రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమై చర్చించింది. అనంతరం సహచర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఖర్గే మడమ తిప్పని నాయకులు

'2022 మే 6వ తేదీన వరంగల్‌లో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్‌లో రూ.2 లక్షల వరకు రుణ మాఫీ ప్రకటించారు. అందుకు సంబంధించి మంత్రివర్గంలో విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్నాం. వ్యవసాయం దండగ కాదు..

మిగతా 5వ పేజీలో ▶

నా జీవితంలో ఈరోజు చరిత్రాత్మకం: సీఎం రేవంత్‌రెడ్డి 5లో

మాఫీ లెక్క తేలిందా?

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రూ. 31 వేల కోట్ల రుణమాఫీ ప్రకటించింది. ఐదేళ్ల కాలంలో రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. అయితే ఒక్క 2023- 24లోనే తెలంగాణలో రైతులు ఏకంగా రూ. 64,940 కోట్ల స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని 2022 మే నెలలోనే ప్రకటించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది రుణాలు తీసుకున్న చాలామంది రైతులు తిరిగి చెల్లించలేదని బ్యాంక్ వర్గాలు అంటున్నాయి. కాగా ఒక్క ఏడాదిలో రూ. 64 వేల కోట్ల రుణాలుంటే రూ. 31 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేస్తామని చెప్పడమేమిటని విశ్లేషకులు అంటున్నారు. ఒక్క ఏడాదికే ఇంత తేడా ఉంటే.. ఐదేళ్లకు ఎంత ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది. అయితే ఈ లెక్కలపై స్పష్టత రావాల్సి ఉంది.



సింగరేణి గనులపై కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భట్టి విక్రమార్క

సింగరేణిపై ప్రధానితో చర్చిస్తా

- డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తులను మోదీ దృష్టికి తీసుకెళతా..
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- 10వ దఫా బొగ్గు గనుల వేలం ప్రక్రియ ప్రారంభం

2లో

'ప్రైవేటు'తో కుదేలు

- గనుల మూతతో 15 ఏళ్లలో సింగరేణి మూతబడే ప్రమాదం
- ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిన రెండు గనులను తిరిగి సింగరేణికి ఇవ్వాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2లో

సింగరేణి గొంతు కోస్తున్నా

వారికి బాధ, రంది లేవు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టిపై కేటీఆర్ ధ్వజం

2లో

కాంగ్రెస్‌లోకి పోచారం



తన నివాసంలో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక.. పోచారం కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా..

3లో

అమల్లోకి పేపర్ లీక్ నిషేధ చట్టం

నోటిఫై చేసిన కేంద్రం

వివరాలు 6లో

క్లుప్తంగా...

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ స్కాన్డ్‌ ఓఎంఆర్‌ షీట్లు సిద్ధం

సాక్షి, హైదరాబాద్‌: గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్ష రాసిన అభ్యర్థుల ఓఎంఆర్‌ పత్రాల స్కానింగ్‌ ప్రక్రియ పూర్తయింది. వీటిని ఈనెల 24వ తేదీ నుంచి అభ్యర్థి టీజీపీఎస్సీ ఐడీలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల స్కాన్డ్‌ ఓఎంఆర్‌ పత్రాలను పొందాలంటే కమిషన్‌ వెబ్‌సైట్‌ తెరిచి అభ్యర్థి ఐడీ ద్వారా లాగిన్‌ అవ్వాల్సి ఉంటుంది.

డీఎస్సీకి 2.79 లక్షల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రవ్యాప్తంగా జూలై 17 నుంచి 31 వరకు జరిగే ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీజీ డీఎస్సీ)కి మొత్తం 2,79,956 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా టెట్‌ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి డీఎస్సీ ఆన్‌లైన్‌ విధానంలో జరగనుంది. పలు సబ్జెక్టులు, ఎస్జీటీ, స్కూల్‌ అసిస్టెంట్ల పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. సబ్జెక్టుల వారీగా పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ ప్రకటించాల్సి ఉంది.

ఎమ్మెల్సీ కవిత కస్టడీ పొడిగింపు



సాక్షి, న్యూఢిల్లీ: సీబీఐ నమోదు చేసిన ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్‌ కస్టడీని రౌజ్‌ అవెన్యూ కోర్టు పొడిగించింది. శుక్రవారంతో జ్యుడీషియల్‌ కస్టడీ ముగియడంతో కవితను వర్చ్యువల్‌గా అధికారులు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బిందు ముందు హాజరు పరిచారు. సీబీఐ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి కవిత కస్టడీని జూలై 7 వరకూ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళల అక్రమ రవాణాపై స్పందించండి

కేంద్ర, రాష్ట్రాలకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్‌: మహిళల అక్రమ రవాణా, లైంగిక వ్యాపారంపై దాఖలైన రిట్‌ పిటిషన్‌లో స్పందనను తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 10కి వాయిదా వేసింది. చట్టం ప్రకారం బాధితులను వారి ఇళ్లకు పంపడానికి సరైన మార్గదర్శకాలు లేవంటూ అనైతిక ట్రాఫిక్‌ నిరోధక చట్టం –1956 చట్ట ప్రకారం వేశ్యలు, బాధితుల పునరావాసం కోసం పనిచేస్తున్న సంస్థ ప్రజ్వల ప్రధాన కార్యదర్శి సునీతా కృష్ణన్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్‌ సూరేపల్లి నందా శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్‌ తరపున సీనియర్‌ న్యాయవాది ఎల్‌.రవిచందర్‌ వాదనలు వినిపిస్తూ.. మహిళల అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం నుంచి రక్షించేందుకు సంస్థలు, రక్షిత గృహాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఒకవేళ కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చినా సరైన సహకారం కూడా అందించడం లేదని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి పిటిషనర్‌ సంస్థకు పోలీస్‌ రక్షణ కల్పించాలని ఆదేశించారు. అవసరమైన సమయంలో సత్వర చర్యలు తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

'రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం రాజ్యాంగ సవరణ చేయాలి'



సాక్షి, హైదరాబాద్‌: ప్రస్తుతం 50% రిజర్వేషన్ల సీలింగ్‌ను పెంచాలని ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ రిజర్వేషన్ల పెంపుపై పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వంలో నితీశ్‌కుమార్‌ భాగస్వామ్యం కావడంతో బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం మోదీపై ఒత్తిడి చేయాలని, రిజర్వేషన్ల పెంపు బిల్లు ప్రవేశపెట్టకుంటే ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని కోరారు.

ఇదండీ సంగతి



తెలంగాణలోకి మావోయిస్టులు?

దండకారణ్యంలో తీవ్రంగా పెరిగిన నిర్బంధం

- ఆత్మరక్షణ కోసం వ్యూహం మార్చిన నేతలు
- దళాలుగా సంచరించడం వల్ల దాడుల్లో నష్టపోతున్నామనే అభిప్రాయం
- రాష్ట్రం వైపు దృష్టి.. రెక్కీ టీమ్‌లుగా ఎంట్రీ!



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దండకారణ్యంలో పోలీసు నిర్బంధం పెరిగిపోవడంతో మావోయిస్టులు షెల్టర్‌ జోన్‌గా తిరిగి తెలంగాణ బాట పడుతున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్‌ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై భద్రతా దళాలు దాడులను తీవ్రం చేశాయి. జనవరిలో ఆకురాలే కాలంలో మొదలైన ముప్పేట దాడులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దీంతో ఆత్మరక్షణ కోసం మావోయిస్టు పార్టీలో కీలక నేతలు తమ వ్యూహాలను మార్చినట్లు సమాచారం. దళాలుగా సంచరించడం వల్ల పోలీసులు, కేంద్ర బలగాల దాడుల్లో తీవ్రంగా నష్టపోతున్నామనే అభిప్రాయం ఆ పార్టీ నాయకత్వంలో ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో కీలక నాయకులను కాపాడుకోవడంతో పాటు పార్టీ ఉనికిని చాటుకునేందుకు వీలుగా తెలంగాణ వైపు ఫోకస్‌ పెట్టినట్లు సమాచారం. ఇదే సమయంలో ఇక్కడి నుంచి కొత్త రిక్రూట్‌మెంట్లపైనా దృష్టి సారించినట్లు తెలిసింది.

గోదావరి తీరం వెంట కదలికలు

గోదావరి తీరం వెంబడి ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మంచిర్యాల, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలతో పాటు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో వివిధ కమిటీల పేర్లతో మావోయిస్టులు తమ ఉనికి చాటేందుకు గత నాలుగైదేళ్లుగా ప్రయత్నించారు. అయితే వీరి ప్రయత్నాలు ఎక్కువగా లేఖలు, పోస్టర్లు, బ్యానర్ల వంటి అంశానికే పరిమితమయ్యాయి. దీంతో పార్టీ విస్తరణ విషయంలో సానుకూల ఫలితాలు పొందలేక వెనకడుగు వేశారు. ఇప్పుడు మావోయిస్టులు రూటు మార్చారు. దళాల పేరుతో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడానికి బదులు ఇద్దరు ముగ్గురు సభ్యులతో టీమ్‌లుగా ఏర్పడి తెలంగాణలో పార్టీ విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. రెండు వారాలుగా గోదావరి తీరం వెంట ఉన్న గ్రామాల్లో మావోయిస్టుల కదలికలు కన్పించడం ఇందుకు బలం చేకూరుస్తోంది.

మద్దతుపై రెక్కీ టీమ్‌ల ఆరా

మావోయిస్టు పార్టీలో తలపండిన నాయకులు, ఉద్యమ వ్యూహాలు తెలిసిన వారు చిన్న టీమ్‌లుగా విడిపోయారు. ఈ బృందాలు ఇటీవల భద్రాద్రి – ములుగు జిల్లా సరిహద్దులో ఉన్న అటవీ గ్రామాల దగ్గర నుంచి గోదావరి తీరం దాటి రెక్కీ టీమ్‌లుగా వ్యవహరిస్తున్నాయని సమాచారం. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో తునికాకు కాంట్రాక్టర్లకు మావోల నుంచి హుకుం జారీ అయినట్టు తెలుస్తోంది. తెలంగాణలోకి వచ్చిన రెక్కీ టీమ్‌ సభ్యులు తమకు అనుకూలంగా ఉన్న గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంది? సానుభూతిపరుల నుంచి మద్దతు లభిస్తుందా, లేదా? అనే అంశాలను బేరీజు వేయడంపై దృష్టి సారిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక బీజేపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకుల కదలికలపైనా దృష్టి సారించారని సమాచారం. చర్ల మండల కేంద్రంలో ఐదుగురిని గురువారం ఛత్తీస్‌గఢ్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఏ కారణాలతో అదుపులోకి తీసుకున్నారనేది స్పష్టత రాకపోయినా ఈ అంశం ఇప్పుడు ఏజెన్సీలో చర్చనీయాంశంగా మారింది.

సింగరేణిపై ప్రధానితో చర్చిస్తా

డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తులను ఆయన దృష్టికి తీసుకెళతా: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

- బొగ్గు గనుల వేలంతో సింగరేణి సంస్థకు నష్టం చేయాలనే ఆలోచన కేంద్రానికి లేదని స్పష్టీకరణ
- వేలంతోనే ఇతర ప్రభుత్వ బొగ్గు గనుల సంస్థలకు అధిక లాభాలని వ్యాఖ్య
- 10వ దఫా బొగ్గు గనుల వేలం ప్రక్రియ ప్రారంభం



బొగ్గు గనుల వేలం కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: బొగ్గు గనుల వేలం ద్వారా సింగరేణి సంస్థకి నష్టం చేయాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఎంతమాత్రమూ లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి సంస్థకు లాభం చేయాలన్న ఉద్దేశమే కేంద్రానికి ఉంటుందని అన్నారు. సింగరేణి ప్రాంతంలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన విజ్ఞప్తితో పాటు ఆయన లేవనెత్తిన ఇతర అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ సీనియర్‌ అధికారులతో పాటు సింగరేణి సంస్థ అధికారులతో ఈ అంశాలపై చర్చిస్తానన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ ఆధ్వర్యంలో బొగ్గు గనుల 10వ దఫా వేలం ప్రక్రియను శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో కిషన్‌రెడ్డి ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 67 బొగ్గు గనుల వేలం ప్రక్రియను ఈ కార్యక్రమంలో ప్రారంభించగా, ఇందులో సింగరేణి ప్రాంతం పరిధిలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకు కూడా ఉంది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడారు.

సుప్రీం తీర్పు మేరకే వేలం

'తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో సింగరేణి సంస్థకు ఉన్న ప్రాముఖ్యత ఈ ప్రాంత వాసిగా నాకు బాగా తెలుసు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల వేలం నిర్వహిస్తున్నాం. బహిరంగ వేలంలో గనులు పొందిన ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు.. కేటాయింపుల ద్వారా గనులు పొందడం కంటే ఎక్కువ లాభాన్ని పొందు తున్నాయి. దేశాభివృద్ధికి అవసరమైన బొగ్గు ఉత్పత్తిని పెంచడం, పారదర్శకతను తీసుకురావడం, రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి దోహదపడడమే వేలం లక్ష్యం. కేంద్రానికి ఆదాయం కోసం కాదు. ఓపెన్‌ రెవెన్యూ షేరింగ్‌ పద్ధతిలో గనులను కేటాయిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వాలే లబ్ధి పొందుతున్నాయి. 10 ఏళ్ల రాష్ట్రంలో తీవ్ర విద్యుత్‌ కొరత ఉండేది. విద్యుత్‌ కోసం పారిశ్రామికవేత్తలు కూడా ధర్నాలు చేశారు. కానీ కేంద్రం అవలంభిస్తున్న విధానాలతోనే నేడు విద్యుత్‌ కొరత లేదు..'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

నైనీలో బొగ్గు ఉత్పత్తికి చర్యలు

'సింగరేణి సంస్థకు 2015లో ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు గని కేటాయించగా, అనేక సమస్యలతో ఇంకా ఉత్పత్తి ప్రారంభం కాలేదు. ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అక్కడి సీఎంతో స్వయంగా మాట్లాడి నైనీ బొగ్గు బ్లాకులో సత్వరం ఉత్పత్తి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటా. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేసే బొగ్గులో 15 శాతం నైనీలోనే ఉత్పత్తి కానుంది..'అని కేంద్రమంత్రి తెలిపారు.

'సింగరేణి' సమస్యల పరిష్కారానికి కృషి

భట్టి విక్రమార్క చేసిన విజ్ఞప్తులకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో మరిన్ని విషయాలు చెబుతానని అన్నారు. ఢిల్లీకి వెళ్లిన తర్వాత తమ శాఖ అధికారులతో చర్చించి సింగరేణి సంస్థకు సంబంధించిన ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో తెల్లకాగితాలపై రాసిస్తే బొగ్గు బ్లాకులు కేటాయించారని విమర్శించారు. తాము అత్యంత పారదర్శకంగా వేలం నిర్వహిస్తున్నామని చెప్పారు.

గుదిబండగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ నిర్ణయాలు

'గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సింగరేణికి గుదిబండగా మారాయి. సింగరేణి సంస్థను నష్టాల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఇతర ప్రభుత్వ రంగ బొగ్గు గనుల సంస్థలతో పోలిస్తే సింగరేణి సంస్థ ఉత్పత్తి తగ్గింది. సింగరేణి బొగ్గు గనుల సంస్థకు ఎలాంటి నష్టం జరగకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి కార్మికులకు మేలు చేకూరేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది. సింగరేణి కార్మికులతో కూడా మాట్లాడతాం. సింగరేణి సంస్థలో కేంద్రానికి 49 శాతం వాటా ఉంది. సంస్థ విషయంలో మాకూ బాధ్యత ఉంది..'అని కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్‌ చంద్రదూబే, కార్యదర్శి అమ్రీత్‌లాల్‌ మీనా, సహాయ కార్యదర్శి ఎన్‌.నాగరాజు, సింగరేణి సంస్థ ఇన్‌చార్జి సీఎండీ ఎన్‌.బలరామ్‌, ఇంధన శాఖ కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శించడమే కాంగ్రెస్, బీజేపీ పని

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

- బీఆర్‌ఎస్‌ ఒత్తిడి తర్వాతే సింగరేణి బ్లాకులపై వెనక్కి



సాక్షి, హైదరాబాద్‌: బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌పై విమర్శలతో ఎదురుదాడి చేయడం మినహా కాంగ్రెస్, బీజేపీకి తెలంగాణ సోయి లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలంపై బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ప్రశ్నించిన తర్వాతే కాంగ్రెస్‌ తన వైఖరి మార్చుకుందన్నారు. దీంతో తెలంగాణ రక్షణ కవచం బీఆర్‌ఎస్‌ పార్టీయేనని మరోమారు నిరూపితమైందన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కేఆర్‌ఎంబీకి కృష్ణా జలాల అప్పగింత, గోదావరి, కావేరి అనుసంధానం సహా కాంగ్రెస్‌ ప్రభుత్వం తెలంగాణ హక్కులను ఇతరులకు ధారాదత్తం చేస్తున్న ప్రతీ సందర్భంలో బీఆర్‌ఎస్‌ పోరాటం చేస్తోందన్నారు. సింగరేణి బ్లాకుల కేటాయింపు విషయంలో కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కుని డ్రామాలు ఆడుతున్నాయన్నారు. శ్రావణి బ్లాక్‌ వేలంపై డిప్యూటీ సీఎం భట్టి అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసం వద్ద నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ సహా ఇతర బీఆర్‌ఎస్‌ నేతలను పోలీసులు విడుదల చేయాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కేసీఆర్‌ అనేక అవకాశాలు ఇచ్చారన్నారు. కేసీఆర్‌కు దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు, మీడియాలో కొందరు వ్యతిరేకంగా ఉన్నారని, తెలంగాణ ముఖచిత్రం నుంచి ఆయనను అదృశ్యం చేయాలనుకోవడం కుదిరేపని కాదని అన్నారు.

సింగరేణిని బతికించాలి

మాజీ ఎంపీ వినోద్‌ కుమార్‌



సాక్షి, హైదరాబాద్‌: సింగరేణి సంస్థను బతికించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌ రెడ్డి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలవాలని బీఆర్‌ఎస్‌ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. సింగరేణిలో వందేళ్ల అవసరాలకు సరిపడా బొగ్గు నిల్వలున్నాయని, వాటిని తెలంగాణ అభివృద్ధి కోసం ఉపయోగించాలని కోరారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...సింగరేణి బొగ్గు బ్లాకు వేలాన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. గనులు, ఖనిజాలు–2015 బిల్లుకు బీఆర్‌ఎస్‌ మద్దతు ఇచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను వినోద్‌ కుమార్‌ ఖండించారు. సింగరేణి గొంతు నులిమేందుకే రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలుగా గెలిచారా అని ప్రశ్నించారు.

'ప్రైవేటు'తో సింగరేణి కుదేలు

గనుల మూతతో 15 ఏళ్లలో సంస్థ మూతబడే స్థాయికి పడిపోతుంది

- ఇప్పటికే ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిన రెండు గనులను తిరిగి సింగరేణికి ఇవ్వాలి
- సింగరేణి ప్రాంతంలోని అన్ని గనులను సంస్థకే కేటాయించేందుకు ప్రధానిని ఒప్పించండి
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్‌: భూగర్భ గనులు, ఖనిజాల చట్టం (ఎంఎండీఏ)లోని సెక్షన్‌ 17ఏ(2) కింద సింగరేణి బొగ్గు గనుల సంస్థకు బొగ్గు గనులను రిజర్వేషన్‌ పద్ధతిలో కేటాయించేందుకు అవకాశం ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం వేలంలో ప్రైవేటు కంపెనీలకు గనులను కేటాయించడం సింగరేణిని కుదేలు చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని 2015లో కేంద్రం సవరించడంతో సింగరేణి ప్రాంతంలోని బొగ్గు నిల్వలపై అంతకుముందున్న లీజు హక్కులు, అధికారాలను సంస్థ కోల్పోయిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 67 బొగ్గు గనుల వేలం ప్రక్రియను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ప్రారంభించగా.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భట్టి ఆయనతో మాట్లాడారు.

ప్రధాని అపాయింట్‌మెంట్‌ తీసుకోండి...

సింగరేణి ప్రాంతంలోని గనులను సంస్థకే కేటాయించేలా ప్రధాని మోదీతో మాట్లాడి ఒప్పించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో చొరవ చూపి ప్రధాని అపాయింట్‌మెంట్‌ తీసుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి, తాను, ఇతర పార్టీల నేతలతో కలిసి అఖిలపక్షంగా ఆయన్ను కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు.

గత సర్కారు వేలంలో పాల్గొననివ్వలేదు

చట్టంలోని సెక్షన్‌ 17ఏ(2) కింద తమకు అతిముఖ్యమైన సత్తుపల్లి–3, శ్రావణపల్లి, పీకే ఓసీ డీప్‌సైడ్, కోయగూడెం బ్లాక్‌–3 బొగ్గు బ్లాకులను కేటాయించాలని గతంలో సింగరేణి కోరగా వాటిని కూడా కేంద్రం వేలం వేయాలని నిర్ణయించడం బాధాకరమని భట్టి అన్నారు. ప్రభుత్వ సంస్థకు ప్రభుత్వాలు సహకరించకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. వేలంలో పాల్గొనైనా ఈ గనులను దక్కించుకోవాల్సిన అవసరముండగా గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అనాలోచితంగా సింగరేణి వేలంలో పాల్గొనకుండా చేసిందని విమర్శించారు. దీంతో సత్తుపల్లి–3 బ్లాక్‌ అవంతిక మైనింగ్‌ పరమైందని.. కోయగూడెం బ్లాక్‌–3 ఆరో మైనింగ్‌ అనే సంస్థ చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. సింగరేణి ప్రాంతంలోని ఇతర బ్లాకులను వేలంలో కేటాయించాలని కేంద్ర బొగ్గు శాఖ నిర్ణయించడం దురదృష్టకరమన్నారు. సత్తుపల్లి–3, కోయగూడెం–3 బ్లాకుల్లో ఇంకా ప్రైవేటు కంపెనీలు తవ్వకాలు ప్రారంభించలేదని, చట్టప్రకారం ఆ కేటాయింపులను రద్దు చేసి వాటిని తిరిగి సింగరేణికి కేటాయించాలని భట్టి కోరారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ ఆదాయంలో వాటా కింద 0.5 శాతాన్ని అదనంగా ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సింగరేణిని కాపాడేందుకు అవసరమైతే చట్టంలో సవరణలు చేపట్టాలని కోరారు.

సింగరేణి మూతబడే ప్రమాదం


సింగరేణికి ప్రస్తుతం 39 గనులు, 42 వేల మంది కార్మికులు ఉన్నారని భట్టి చెప్పారు. రానున్న ఐదేళ్లలో 8 భూగర్భ గనులు, 3 ఓపెన్‌కాస్ట్‌ గనులు, ఆ తర్వాత 5 ఏళ్లలో మరో 5 భూ గర్భ గనులు, 6 ఓపెన్‌కాస్ట్‌ గనులు మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2037–38 నాటికి మరో 5 గనులు మూతబడతాయన్నారు. మరో 15 ఏళ్లలో 8 గనులు, 8 వేల మంది కార్మికుల స్థాయికి సంస్థ పడిపోయి చివరకు మూతబడే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందన్నారు. తెలంగాణ ప్రాంత మంత్రులుగా, నాయకులుగా ఈ పరిణామాలను ఊహించలేమన్నారు.

మిగిలిన గనులను సింగరేణికే ఇవ్వాలి..

సింగరేణి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం గోదావరి–ప్రాణహిత లోయ ప్రాంతంలో సింగరేణికి 600 చ.కి.మీ.ల విస్తీర్ణంలో 44 మైనింగ్‌ లీజులు ఉన్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. వాటిలో 388 చ.కి.మీ.ల విస్తీర్ణంలో ఉన్న 3,008 మిలియన్‌ టన్నుల బొగ్గును వెలికితీసే అవకాశం ఇవ్వగా సింగరేణి 1,585 మిలియన్‌ టన్నుల బొగ్గునే వెలికితీసిందన్నారు. ఇంకా 1,422 మిలియన్‌ టన్నుల బొగ్గు తీయడానికి అవకాశం ఉందన్నారు. మిగిలిన 1,400 మిలియన్‌ టన్నుల బొగ్గు నిక్షేపాలున్న గనులను చట్టప్రకారం రిజర్వేషన్‌ కోటాలో సింగరేణికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఓ వినతిపత్రాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి భట్టి అందజేశారు.

సీబీఐ విచారణ కోరే దమ్ముందా?

సింగరేణి అక్రమాలపై కాంగ్రెస్‌కు కేంద్రమంత్రి సంజయ్‌ సవాల్‌



యోగా చేస్తున్న బండి సంజయ్‌

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌: సింగరేణిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం కరీంనగర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్‌ మీడియాతో మాట్లాడారు. సీబీఐ విచారణ జరిపితే గత ప్రభుత్వ నిర్వాకంతో పాటు సింగరేణి దుస్థితికి కారకులెవరో తేలిపోతుందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, ప్రధాని మోదీ ప్రకటించిన తర్వాత కూడా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ మళ్లీ తప్పుడు ప్రచా రం చేస్తూ ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించడం అసాధ్యమని స్పష్టం చేశారు. మోదీ రామగుండం వచ్చినప్పుడు సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారని, సింగరేణిలో కేంద్రానిది 49% వాటా, రాష్ట్రానిది 51% ఉందన్నారు. అట్లాంటప్పుడు సింగరేణి ప్రైవేటీకరించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సింగరేణి ఈ దుస్థితికి రావడానికి ప్రధాన కారణం నాటి సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే అన్నారు. తాడిచర్లలో ఏపీ జెన్‌కోకు ఇస్తే కేసీఆర్‌ ప్రభుత్వం ప్రైవేట్‌ వారికి అప్పగించింది నిజం కాదా? సింగరేణిని ప్రైవేటీకరించిందే కేసీఆర్‌ అని ఆరోపించా రు.

నాగర్‌కర్నూల్‌ ఘటన దారుణం

ఇల్లందకుంట: నాగర్‌కర్నూల్‌ జిల్లాలో చెంచు మహిళపై జరిగిన దారుణం సభ్యసమాజం సిగ్గుపడేలా ఉందని బండి సంజయ్‌ వ్యాఖ్యానించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరుతూ దందాలు చేస్తున్న క్రిమినల్స్‌పై చర్యలు తీసుకోకుండా వత్తాసు పలుకుతున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.

అడ్వొకేట్‌ కమిషనర్‌ ముందు హాజరవ్వండి

కేంద్రమంత్రి బండికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్‌: మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ ఎన్నిక చెల్లదంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై అడ్వొకేట్‌ కమిషనర్‌ కె.శైలజ (రిటైర్డ్‌ జడ్జి) ముందు హాజరుకావాలని కేంద్రమంత్రి బండి సంజయ్‌ను హైకోర్టు ఆదేశించింది. కమిషనర్‌ ముందు సాక్ష్యం చెప్పకుంటే పిటిషన్‌పై విచారణను ముగిస్తామని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. 2018 డిసెంబర్లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్‌ నియోజకవర్గం నుంచి గంగుల కమలాకర్‌ బీఆర్‌ఎస్‌ తరపున పోటీ చేసి విజయం సాధించారు. అఫిడవిట్లో గంగుల తప్పుడు వివరాలిచ్చారని, నిర్ణీత ఖర్చుకు మించి ఎక్కువ ఖర్చు చేశారని, ఆయన ఎన్నికల చెల్లదంటూ తీర్పు ఇవ్వాలని పేర్కొంటూ బండి సంజయ్‌ హైకోర్టులో 2019, జనవరిలో ఎన్నికల పిటిషన్‌ దాఖలు చేశారు. పార్లమెంట్‌ సమావేశాల నేపథ్యంలో సంజయ్‌ క్రాస్‌ ఎగ్జామినేషన్‌ కు పలుమార్లు గైర్హాజరయ్యారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించినా.. సంజయ్‌ న్యాయవాది విజ్ఞప్తి మేరకు తిరిగి వాదనలు ప్రారంభించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్‌ జి.రాధారాణి శుక్రవారం మరోసారి విచా రణ చేపట్టారు. ఈ వారమే బండి సంజయ్‌ కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారని, బిజీ షెడ్యూల్‌ కారణంగా సాక్ష్యం ఇచ్చేందుకు హాజరుకాలేకపోయారని విచారణ వాయిదా వేయాలని ఆయన తరపు న్యాయవాది కోరారు.

సింగరేణి గొంతు కోస్తున్నా వారికి బాధ, రంది లేవు



- డిప్యూటీ సీఎం భట్టి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కేటీఆర్‌ ధ్వజం
- సిరుల గనికి మరణ శాసనం రాస్తూ ఫొటోలకు పోజులిస్తారా? అంటూ ఆగ్రహం
- తెలంగాణ సహజ సంపదను చెరబట్టిన కాంగ్రెస్, బీజేపీని చరిత్ర క్షమించదని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ నేలపై కేంద్రం సింగరేణి గొంతు కోస్తున్నా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బాధ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రంది లేకపోయిందని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె. తారక రామారావు మండిపడ్డారు. వారిద్దరికీ తెలంగాణ ప్రజలపై ప్రేమ, సింగరేణి కార్మికులపై అభిమానం లేదని విమర్శించారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలంపై కాంగ్రెస్, బీజేపీ అనుసరిస్తున్న వైఖరిని ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్‌'వేదికగా కేటీఆర్‌ మండిపడ్డారు. వేలాది మంది కార్మికుల పొట్టగొట్టి వందేళ్ల సింగరేణి భవిష్యత్తును చీకట్లోకి నెట్టి కిషన్‌రెడ్డి, భట్టి ఫొటోలకు పోజులివ్వడం బీజేపీ, కాంగ్రెస్‌ కుట్రలకు నిదర్శనమని దుయ్యబట్టారు. సిరుల గనికి మరణ శాసనం రాస్తూ వేలాది మంది కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలం అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేల ఇంటికి సీఎం వెళ్లి ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సహజ సంపదను చెరబట్టి కాంగ్రెస్, బీజేపీ ఆడుతున్న వికృత క్రీడను చరిత్ర క్షమించదని కేటీఆర్‌ వ్యాఖ్య.

రేవంత్‌ మౌనం వెనుక ప్రశ్నలు...

గతంలో సింగరేణి గనుల వేలాన్ని వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం మౌనం వహించడం కాంగ్రెస్‌ అవకాశవాదానికి అద్దం పడుతోందని కేటీఆర్‌ విమర్శించారు. ఈ విషయంలో వైఖరి మార్చుకోవడం వెనుక ఒత్తిళ్లను రేవంత్‌ రాష్ట్ర ప్రజలకు వివరించాలన్నారు. నీతిలేని బీజేపీ నిర్ణయాల్లో కాంగ్రెస్‌ కూడా భాగమైందని కేటీఆర్‌ దుయ్యబట్టారు.

అభివృద్ధి యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్లండి

తెలంగాణ ప్రగతిప్రస్థానంపై బురదచల్లడం మాని అభివృద్ధి యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్‌ ప్రభుత్వానికి కేటీఆర్‌ సూచించారు. పదేళ్లలో తెలంగాణ సాధించిన అభివృద్ధి నమూనా ఇతర రాష్ట్రాలకు అనుసరణీయమంటూ ప్రపంచ ప్రఖ్యాత ఆంగ్ల మ్యాగజైన్‌ 'ది ఎకానమిస్ట్‌' ప్రచురించిన కథనాన్ని ఆయన 'ఎక్స్‌'లో పోస్ట్‌ చేశారు. ఆ కథనంలో మ్యాగజైన్‌ పొందుపరిచిన గణాంకాలను కేటీఆర్‌ ప్రస్తావించారు.

అవంతిక, అరబిందో గురించి నోరుమెదపరేం?

- బొగ్గు గనుల వేలంపై 'ఎక్స్‌' వేదికగా కేటీఆర్‌కు సీఎం రేవంత్‌ కౌంటర్‌
- పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్‌ ప్రజల బాధలు, మాటలు పట్టించుకోలేదని విమర్శ



సాక్షి, హైదరాబాద్‌: గత పదేళ్లుగా కోట్లాది మంది తెలంగాణ ప్రజల మాటలను పట్టించుకోకుండా కనీసం వారి మాటలను వినడానికి కూడా ఇష్టపడని బీఆర్‌ఎస్‌ నేతలు... ఇప్పుడు వాస్తవాలను వింటారనే నమ్మకం కూడా లేదని సీఎం రేవంత్‌ రెడ్డి విమర్శించారు. అయినా వారిలో మార్పు రావాలని కోరుకుంటున్నానని అన్నారు. బొగ్గు గనుల వేలంపై కాంగ్రెస్‌ వైఖరిని తప్పుపడుతూ మాజీ మంత్రి కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలకు రేవంత్‌ శుక్రవారం రాత్రి 'ఎక్స్‌' వేదికగా కౌంటర్‌ ఇచ్చారు. 'కేటీఆర్‌ గారు... మన సంస్థల ప్రైవేటీకరణను, మన ప్రజల వాటాలను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం, గత కేసీఆర్‌ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను కాంగ్రెస్‌ నాయకులు, పార్టీ శ్రేణులు అడుగడుగునా వ్యతిరేకించారు. కేసీఆర్‌ సీఎంగా ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం సింగరేణి గనులను తొలిసారి వేలం వేసి రెండు ప్రైవేటు కంపెనీలకు అప్పగించింది. అరబిందో, అవంతిక అనే రెండు కంపెనీలకు కట్టబెట్టింది. అందుకు సహకరించింది మీ ప్రభుత్వమే. అప్పుడు మీరు, మీ పార్టీ నేతలు వాటి గురించి ఎందుకు మాట్లాడలేదు? ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా? మా ఉప ముఖ్యమంత్రి సింగరేణి గనులను ప్రైవేటీకరించడం, వేలం వేయడాన్ని వ్యతిరేకించారు. అవంతిక, అరబిందో కంపెనీలకు కేటాయించిన బొగ్గు బ్లాకులను రద్దు చేసి తిరిగి సింగరేణికి ఇవ్వాలని కూడా డిమాండ్‌ చేశారు. తెలంగాణ ప్రజలు, వారి ప్రయోజనాలు, ఆస్తులు, హక్కులను కాపాడేది కాంగ్రెస్‌ ఒక్కటే. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్‌తోనే సురక్షితం. మన బొగ్గు.. మన హక్కులను కాపాడి తీరుతాం. తెలంగాణ ప్రజల ప్రతి హక్కు కోసం పోరాడతాం. అటు సింగరేణిని, ఇటు ఓఆర్‌ఆర్‌ను టోకున ప్రైవేటుకు అమ్మేసిన వ్యక్తి ఇప్పుడు హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరం' అని సీఎం రేవంత్‌ 'ఎక్స్‌'లో చేసిన పోస్ట్‌లో విమర్శించారు.

క్లుప్తంగా...

యోగా సాధనతో ఆరోగ్యం
గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

నందిగామ: యోగా సాధన ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతి వనంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగా సాధకులు, అభ్యాసీలతో కలసి ఆయన ఆసనాలు వేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం ధ్యానం, యోగా ఎంతగానో ఉపయోగపడతాయని, వాటికి కులం, మతం అనేవి లేవని పేర్కొన్నారు. మనసు– శరీరం– ఆత్మల మధ్య ధ్యానం సమన్వయాన్ని పెంపొందింపజేస్తుందని స్పష్టంచేశారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. యోగాను దినచర్యలో ఒక భాగంగా చేసుకోవాలని, యువత, విద్యార్థులు, చిన్నారులు యోగాను చిన్నప్పటి నుంచే అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అనంతరం గవర్నర్ ధ్యాన కేంద్రంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అభ్యాసీలు, 2 వేల మందికి పైగా యోగా సాధకులు పాల్గొన్నారు.

'దానం'ది ముగిసిన అధ్యాయం: వివేకానంద



సాక్షి, హైదరాబాద్: రాజకీయాల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ది ముగిసిన అధ్యాయమని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. మంత్రి పదవిపై ఆశతోనే దానం నాగేందర్ పరిధి దాటి అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారని ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. పదవి కోసం పార్టీ మారిన దానం ఇతర ఎమ్మెల్యేలను బదనాం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డిని గెలిపించేందుకే దానం నాగేందర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఇచ్చారని స్పష్టం చేశారు. రాత్రికి రాత్రి పార్టీలు, కండువాలు మార్చి సంపాదనలో పడిన దానం తరహాలో తాము పార్టీలు మారేది లేదని వివేకానంద స్పష్టం చేశారు.

ఏ నైతికతతో పోచారం పార్టీ మారుతున్నారు
మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి వారు కూడా పార్టీ మారడం ఏ నైతిక విలువలకు సంకేతమని బీఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇలాంటి వారిని చూసి తెలంగాణ సమాజం గందరగోళంలో పడుతుందని శుక్రవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. 2012లో తెలంగాణ కోసం రాజీనామా చేసిన పోచారంను గెలిపించుకోవడం మొదలుకుని 2014లో వ్యవసాయ మంత్రిగా, 2018లో స్పీకర్‌గా కేసీఆర్ ఆయనకు అవకాశం ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏ ఇతర నియోజకవర్గానికి ఇవ్వనన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఆయన నియోజకవర్గం బాన్సువాడకు మంజూరు చేశారని తెలిపారు. ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డికి డీసీసీబీ అధ్యక్షుడిగానూ కేసీఆర్ అవకాశం ఇచ్చారని ఇంత చేసినా పోచారం ఇలా పార్టీ మారడం బాధాకరం అని అందులో పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో మిగిలేది కేసీఆర్, కేటీఆర్‌లే..
టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్, కేటీఆర్‌లు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. 6 గ్యారంటీల అమలుతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ విధానాలు నచ్చినందునే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తున్నారని స్పష్టం చేశారు. ఆయన గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ అవసరాలను బట్టి పార్టీలో చేరికలు ఉంటాయన్నారు. తాము కూడా సంఖ్యాబలం పెంచుకోవడానికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి రావడానికి ఇంకా చాలామంది సిద్ధంగా ఉన్నారని, సమయాన్ని బట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుంటామని చెప్పారు. కొత్తవారి రాకతో కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్న కార్యకర్తలకు అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు.



యోగాసనాలు వేస్తున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



హైకోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ సురేందర్, జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ లక్ష్మీనారాయణ



సికింద్రాబాద్ మనోవికాస్‌నగర్‌లో...



నిజాం కాలేజీలో యోగాసనాలు వేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి మాజీ స్పీకర్ పోచారం

- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక
- పోచారం కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా..
- రైతు సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని పోతామన్న ముఖ్యమంత్రి
- కాంగ్రెస్‌లో పుట్టి చివరకు అదే పార్టీలోకి వచ్చానన్న బాన్సువాడ ఎమ్మెల్యే
- రేవంత్‌కు 20 ఏళ్లు రాష్ట్రానికి నాయకత్వం వహించే సామర్థ్యం ఉందని వ్యాఖ్య
- నలుగురు తప్ప బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎవరూ ఆ పార్టీలో ఉండరన్న దానం



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పోచారం. చిత్రంలో మంత్రి పొంగులేటి, భాస్కర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మాజీ స్పీకర్, మాజీ మంత్రి, బాన్సువాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పోచారం నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు.. చర్చల అనంతరం ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పోచారంతో పాటు ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత అక్కడే సీఎం మీడియాతో మాట్లాడారు.

అండగా నిలవాలని కోరా

తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారంను కలిశామని, పెద్ద నాయకుడిగా తమకు అండగా నిలబడాలని కోరామని రేవంత్ చెప్పారు. తెలంగాణ రైతుల సంక్షేమం కోసం పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. రైతుల విషయంలో పోచారం సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళతామని, భవిష్యత్తులో ఆయనకు సముచిత గౌరవం ఇస్తామని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటామన్నారు. తమది రైతు రాజ్యమని, రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకొని వెళతామని రేవంత్ స్పష్టం చేశారు.

రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి: పోచారం

సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని పోచారం చెప్పారు. రైతు సంక్షేమంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజామోదయోగ్యమైనవని పేర్కొన్నారు. తాను స్వయంగా రైతునని, రైతుల కష్టసుఖాలు తనకు తెలుసునని అన్నారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర రైతాంగానికి జరుగుతున్న మంచి కార్యక్రమాలకు అండగా నిలవాలని కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. తన రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీలోనే ప్రారంభమైందని, ఆ తర్వాత టీడీపీ, టీఆర్ఎస్‌లలో పనిచేసినా చివరకు కాంగ్రెస్ పార్టీలోకే వచ్చానని చెప్పారు. రేవంత్‌రెడ్డికి ఇంకా ఇరవై ఏళ్లు రాష్ట్రానికి నాయకత్వం వహించే సామర్థ్యం ఉందని, అందుకే రేవంత్ నాయకత్వాన్ని బలపర్చాలని, ఆయన నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు.

త్వరలో మరిన్ని చేరికలు?

పోచారం చేరిక నేపథ్యంలో మరి కొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలోకి వస్తారనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లోకి వచ్చారని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి. దానం నాగేందర్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే ఎమ్మెల్యేలంటూ ఏకంగా ఓ జాబితానే ప్రకటించారు. బీఆర్ఎస్‌కు చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేల పేర్లను ఆయన వెల్లడించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, హరీశ్‌రావు, కేటీఆర్‌లు తప్ప మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎవరూ ఆ పార్టీలో ఉండరని ఆయన చెప్పడం గమనార్హం. కాగా దానం, తాజాగా పోచారంతో పాటు ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించారు. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం 64 నుంచి 69కి, మిత్రపక్షమైన సీపీఐతో కలిసి 70కి చే రడం గమనార్హం.

పోచారం ఇంట్లోకి వెళ్లేందుకు బాల్క సుమన్ యత్నం



బంజారాహిల్స్ పీఎస్‌లో బాల్క సుమన్

బంజారాహిల్స్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసం నుంచి తిరిగి వెళ్లిపోతున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నేతలు బాలరాజ్ యాదవ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు అక్కడకు వచ్చారు. పోచారం ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుగా నిలబడి నినాదాలు చేస్తూ బైఠాయించేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వావాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో బాల్క సుమన్‌ను బలవంతంగా బయటకు తీసుకువచ్చిన పోలీసులు జీపులో కూర్చోబెట్టి తరలించేందుకు ప్రయత్నించారు. ఇక్కడ కూడా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు లాఠీలు ఝళిపించి అందరినీ చెల్లాచెదురు చేసి. బాల్క సుమన్‌ను బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించారు. సీఎంఉండగానే పోచారం ఇంట్లోకి దూసుకెళ్లేందుకు యత్నించిన బాల్క సుమన్‌తో పాటు మరో 11 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా, అందరికీ బెయిల్ మంజూరైంది.

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి
కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): ప్రకృతితో మమేకమవ్వడమే యోగా అంతరార్థమని, యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నిజాం కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....యోగా అంటే శరీరాన్ని మనస్సుని కలిపే ప్రక్రియ అని ప్రాణులు ప్రకృతితో మమేకమవ్వడమే యోగా అంతరార్థమన్నారు. ఈ రోజు ప్రపంచమంతా యోగా వైపు చూస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగా నిర్ణయాన్ని ప్రపంచమంతా ఆచరిస్తుందని తెలియజేశారు. అనంతరం నిర్వాహకులతో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, సరస్వతి ఉపసాకులు దైవాజ్ఞశర్మలతో పాటు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

డీజీపీ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు వాణీబాల మాట్లాడుతూ యోగాభ్యాసం మానసిక ప్రశాంతత, భావోద్వేగ స్థిరత్వాన్ని సాధించేందుకు సంపూర్ణమైన విధానం అని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను బీజేపీ రద్దు చేసింది

- ఆ ప్రాజెక్టును మళ్లీ తెప్పించాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్) ప్రాజెక్టును మంజూరు చేస్తే, బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ యువతకు ఉద్యోగాలివ్వాలని అప్పట్లో తమ ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ప్రాజెక్టును ఇన్నాళ్లు అధికారంలో ఉన్న బీజేపీ మంత్రులు కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు మెట్టుసాయికుమార్, కోట్ల శ్రీనివాస్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతలకు దేవుడి పేరుతో రెచ్చగొట్టే ప్రసంగాలు ఇవ్వడం తప్ప బతుకుతెరువు కోసం ఉద్యోగాలు ఇప్పించడం తెలియదని అన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టుతో రాష్ట్ర యువతకు 15 లక్షల ఉద్యోగ అవకాశాలు దక్కేవని, కానీ ఆ ప్రాజెక్టును బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడంతో లక్షల కుటుంబాలు ఉద్యోగాలకు దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ గడ్డ సేఫ్టీకి అడ్డా అని, అందుకే ఐటీఐఆర్‌ను సోనియాగాంధీ మంజూరు చేశారని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు హైదరాబాద్ గడ్డపై ఐటీఐఆర్‌తో అడుగుపెట్టి ఉంటే ప్రజలు సంతోషించే వారన్నారు. ఇప్పుడు కూడా ఐటీఐఆర్ ప్రాజెక్టును మళ్లీ తీసుకురావాల్సిన బాధ్యత ఆ ఇద్దరిదేనని, వారికి ఎప్పటికప్పుడు ఐటీఐఆర్ గురించి గుర్తుచేస్తుంటామని చెప్పారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరే అంశం తన పరిధిలోనిది కాదని, శాసనసభ వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకోనన్నారు.

విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వం వేధిస్తోంది

- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ధ్వజం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో భేటీ.. ఈడీ సోదాలపై ఆరా



పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం విపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. 'మా పార్టీలో చేరండి.. లేకుంటే ఇబ్బందులు తప్పవన్న విధంగా వ్యవహరిస్తోంది' అని ఆయన మండిపడ్డారు. శుక్రవారం పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డిని హరీశ్‌రావు కలిశారు. గురువారం జరిగిన ఈడీ సోదాలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో హరీశ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేలను భయభ్రాంతులకు గురిచేయడమే పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. పదవికి రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయించే ఎమ్మెల్యేలపై తక్షణమే అనర్హత వర్తించేలా చట్ట సవరణ చేస్తామంటూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. కానీ టీ కాంగ్రెస్ నేతలు మాత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకొనేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మాట వినకపోతే ఆ ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురిచేస్తూ కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం వంటివి చేస్తున్నారన్నారు.

ఈడీ దాడుల్లో దొరికిందేమీ లేదు..

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంట్లో ఈడీ చేపట్టిన సోదాల్లో డబ్బు, బంగారం, ఎలాంటి వస్తువులు అక్రమంగా దొరకలేదని హరీశ్‌రావు చెప్పారు. ఆదాయపన్ను చెల్లిస్తున్న ఎమ్మెల్యే వద్ద ఆదాయ లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయని స్పష్టం చేశారు. లీకేజీకి కారణమైన అధికారులపై ఈడీ, ఐటీ ఎందుకు దాడులు చేయట్లేదని నిలదీశారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్యరావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జెడ్పీ వైస్ చైర్మన్ మంజుశ్రీ పాల్గొన్నారు.

అక్రమంగా రూ. 300 కోట్లు కూడబెట్టారు

- ప్రభుత్వానికి రూ.39.08 కోట్లు రాయల్టీ ఎగవేశారు
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంట్లో తనిఖీలపై ఈడీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి అక్రమ మైనింగ్ ద్వారా రూ. 300 కోట్లు కూడబెట్టారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. రాయల్టీ రూపంలో చెల్లించాల్సిన మరో రూ. 39.08 కోట్లను ప్రభుత్వానికి ఎగవేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఎమ్మెల్యే, ఆయన సోదరుడు ప్రొపరైటర్లుగా ఉన్న సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై సంస్థలో గురువారం చేపట్టిన సోదాలకు సంబంధించి ఈడీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఇతరుల ఇళ్లు, కార్యాలయాలు సహా మొత్తం 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు వివరించింది. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని మొత్తం రూ. 19 లక్షల నగదు లభించిందని.. దాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. ఇద్దరు సోదరుల బినామీలుగా అనుమానిస్తున్న వారి పేర్లతో ఉన్న ఆస్తి పత్రాలతోపాటు కొన్ని మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ పేర్కొంది. సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై కంపెనీ ప్రొప్రైటర్ గూడెం మధుసూదన్‌రెడ్డిపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. లీజు అనుమతి పొందిన స్థలంలో 11.98 లక్షల క్యూబిక్ మీటర్ల మేర బిల్డింగ్ స్టోన్, రోడ్ మెటీరియల్‌ను వెలికితీసి లెక్కల్లో చూపకుండా విక్రయించడంతోపాటు 4.37 హెక్టార్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి 10.11 లక్షల క్యూబిక్ మీటర్ల మెటీరియల్‌ను తవ్వి విక్రయించడం ద్వారా మొత్తంగా రూ. 300 కోట్లు సంపాదించినట్లు ఈడీ పేర్కొంది.

మనకు కనిపించే, వినిపించే, అర్థమయ్యే, అవకపోయే ఈ సమస్త చరాచర జగత్తంతా ఆ పరబ్రహ్మ పరమేశ్వరుని నుంచి వెలువడి వచ్చినదే! ఆ పరబ్రహ్మ ద్వారా ప్రాణం పోయబడినదే! అంటే ఈ విశ్వం యావత్తూ పరమేశ్వరుని లీలయే!

– కఠోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 22 జూన్ 2024

అగ్రరాజ్యాలు కళ్లు తెరుస్తాయా?

తెగేదాకా లాగితే ఏమవుతుందో అమెరికాతోపాటు యూరప్ దేశాలు తెలుసుకోవాల్సిన సందర్భమిది. బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తర కొరియాను సందర్శించి ఆ దేశంతో సైనిక ఒడంబడిక కుదుర్చుకున్నారు. ఆ మర్నాడు వియత్నాం వెళ్లి డజను ఒప్పందాలు చేసుకున్నారు. అందులో అణు పరిశోధనలకు సంబంధించిన అంశం కూడా ఉంది. వియత్నాంతో రక్షణ, భద్రత సహా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవటం తమ లక్ష్యమని కూడా పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధం ప్రారంభించిన నాటినుంచీ దాన్ని ఆంక్షల చట్రంలో బిగించి ఏకాకిని చేయాలని అమెరికా, యూరప్ దేశాలు తలపోశాయి. ఉత్తర కొరియా ఏనాటినుంచో అలాంటి ఆంక్షల మధ్యే మనుగడ సాగిస్తోంది. ఇరాన్ సరేసరి. ఇలా ఏకాకుల్ని చేయాలన్న దేశాలన్నీ ఏకమవుతున్నాయని, అది ప్రమాద సంకేతమని అమెరికా, పాశ్చాత్య దేశాలు గ్రహిస్తున్న దాఖలా లేదు. ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి సరికొత్త భద్రతా వ్యవస్థ ఏర్పడాలన్నదే తన ధ్యేయమని పుతిన్ అనటంలోని ఉద్దేశమేమిటో తెలుస్తూనే ఉంది. ఉత్తర కొరియా ఆవిర్భావానికీ, దాని మనుగడకూ నాటి సోవియెట్ యూనియనే కారణం. జపాన్ వలస పాలనతో సర్వస్వం కోల్పోయి శిథిలావస్థకు చేరుకున్న కొరియా భూభాగంలోకి రెండో ప్రపంచ యుద్ధం ముగింపు దశలో సోవియెట్ సైనిక దళాలు అడుగుపెట్టాయి. ఆ వెంటనే అమెరికా సైతం అప్పటికింకా సోవియెట్ సైన్యం అడుగుపెట్టని దక్షిణ ప్రాంతానికి తన సైన్యాన్ని తరలించింది. పర్యవసానంగా ఆ దేశం ఉత్తర, దక్షిణ కొరియాలుగా విడిపోయింది. సోవియెట్ స్ఫూర్తితో సోషలిస్టు వ్యవస్థ ఏర్పడిందని మొదట్లో ఉత్తర కొరియా ప్రకటించినా అక్కడ అనువంశిక పాలనే నడుస్తోంది. ఆ దేశం గురించి పాశ్చాత్య మీడియా ప్రచారం చేసే వదంతులే తప్ప అక్కడ ఎలాంటి వ్యవస్థలున్నాయో, అవి ఏం సాధించాయో తెలుసుకునే మార్గం లేదు. ఇటు పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లూనుకున్న దక్షిణ కొరియా, అమెరికా అండదండలతో బహుముఖ అభివృద్ధి సాధించింది. సోవియెట్ యూనియన్ కుప్పకూలి రష్యా ఏర్పడ్డాక ఉత్తర కొరియాతో ఆ దేశానికున్న సంబంధాలు క్రమేపీ కొడిగట్టాయి. ప్రచ్ఛన్న యుద్ధ దశ అంతమైందని, ఇక ప్రపంచం నిశ్చింతగా ఉండొచ్చని అందరూ అనుకున్నారు. అమెరికా, పాశ్చాత్య దేశాలు పేరాశకు పోనట్టయితే ఆ ఆశ సాకారమయ్యేది. అది లేకపోబట్టే ప్రపంచం మళ్లీ గతంలోకి తిరోగమిస్తున్న వైనం కనబడుతోంది. అనునిత్యం సమస్యలతో సతమతమయ్యే ఆ పరిస్థితులు తిరిగి తలెత్తటం ఖాయమన్న అంచనాలు వస్తున్నాయి.

కొన్నేళ్లక్రితం వరకూ ఉత్తర కొరియాపై కారాలు మిరియాలు నూరుతున్న పాశ్చాత్య దేశాలను రష్యా పెద్దగా పట్టించుకునేది కాదు. పొరుగునున్న చైనానుంచే ఆ దేశానికి సమస్త సహకారం లభించేది. 1994లో తనకున్న ఒక అణు రియాక్టర్‌నూ మూసేయడానికి ఉత్తర కొరియా అంగీకరించింది. అందుకు బదులుగా అమెరికా నుంచి రెండు విద్యుదుత్పాదన అణు రియాక్టర్లు స్వీకరించటానికి సిద్ధపడింది. కానీ 2002లో జార్జి డబ్ల్యూ బుష్ అధికారంలోకొచ్చాక ఆ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దుచేశారు. ఈ పరిణామాల సమయంలోకూడా రష్యా మౌనంగానే ఉంది. శత్రువు శత్రువు తన మిత్రుడని ఎంచి ఇప్పుడు అదే రష్యా తాజాగా ఉత్తర కొరియాతో సైనిక ఒప్పందం కుదుర్చుకుంది. తన నేతృత్వంలోని వార్సా కూటమిని రద్దుచేసుకుని, నాటోలో చేరడానికి రష్యా సిద్ధపడినప్పుడు తిరస్కరించింది నాటోయే. తూర్పు దిశగా విస్తరించే ఉద్దేశం తమకు లేదని, దాని సరిహద్దు దేశాలకు నాటో సభ్యత్వం ఇవ్వబోమని హామీ ఇచ్చిన ఆ సంస్థ అందుకు విరుద్ధంగా ప్రవర్తించింది. పొరుగునున్న చిన్న దేశాలపై పెత్తనం చలాయించాలన్న యావ రష్యాకుంటే దాన్ని ఎలా దారికి తేవాలో ఆ దేశాలు నిర్ణయించుకుంటాయి. కానీ వాటితో అంటకాగి రష్యాను చికాకు పర్చటమే ధ్యేయంగా గత రెండు దశాబ్దాలుగా అమెరికా, పాశ్చాత్య దేశాలు ప్రవర్తించాయి. ఈమధ్య ఇటలీలో జీ–7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శాంతియుతంగా, చర్చలద్వారా ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం అన్వేషించాలని సూచించారు. కానీ వినేదెవరు? విశ్వసనీయతగల అంతర్జాతీయ సంస్థల మధ్యవర్తిత్వంలో రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య చర్చలు జరిగితే, ఒప్పందం కుదిరితే అది ఆ రెండు దేశాలకూ మాత్రమే కాదు, ప్రపంచానికి కూడా మంచి కబురవుతుంది.

ప్రపంచం ఇప్పుడు మూడో ప్రపంచ యుద్ధం అంచుల్లో ఉంది. అమెరికా, దాని ప్రత్యర్థులు రష్యా, చైనాలు ప్రధాన అణ్వస్త్ర దేశాలు. అమెరికా వద్ద దాదాపు 1,700 అణ్వస్త్రాలున్నాయి. అందులో కనీసం సగం నిమిషాల్లో ప్రయోగించేందుకు వీలుగా నిరంతర సంసిద్ధతలో ఉంటాయంటారు. అమెరికాపై ఒక్క అణ్వస్త్రం ప్రయోగించినా క్షణాల్లో యూరప్, ఆసియా దేశాల్లోని దాని స్థావరాలనుంచి పెద్ద సంఖ్యలో అణ్వస్త్రాలు దూసుకెళ్లి శత్రు దేశాలను బూడిద చేస్తాయి. రష్యా, చైనాలపై దాడి జరిగినా ఇదే పరిస్థితి. చిత్రమేమంటే ఒకప్పుడు అణ్వాయుధాలపై బహిరంగ చర్చ జరిగేది. అది ఉద్రిక్తతల నివారణకు తోడ్పడేది. 80వ దశకంలో మధ్యతరహా అణ్వాయుధాల మోహరింపు యత్నాలు జరిగినప్పుడు అమెరికా, యూరప్ దేశాల్లో భారీయెత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఫలితంగా అప్పటి అమెరికా అధ్యక్షుడు రీగన్, నాటి సోవియెట్ అధ్యక్షుడు గోర్బచెవ్ వాటి నిషేధానికి సంసిద్ధులయ్యారు. కానీ సాధారణ ప్రజలకు సైతం యుద్ధోన్మాదం అంటించారు. ఈ పరిస్థితులు మారాలి. అగ్రరాజ్యాలు వివేకంతో మెలిగి శాంతి నెలకొనేందుకు చిత్తశుద్ధితో కృషిచేయాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం **తిథి:** పౌర్ణమి ఉ.6.29 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** మూల రా.6.38 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.00 నుండి 6.37 వరకు, తదుపరి తె.4.06 నుండి 5.43 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.5.37 నుండి 7.14 వరకు, **అమృతఘడియలు:** ప.12.06 నుండి 1.43 వరకు, ఏరువాక పౌర్ణమి.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఐరాసలో పెరగనున్న పాక్ ప్రభావం

విశ్లేషణ



కేపీ నాయర్

లోక్‌సభ ఎన్నికల హడావిడిలో ఈ వార్త అంతగా దృష్టిలో పడలేదుగానీ, భద్రతా మండలిలో రెండేళ్ల కాలానికి పాకిస్తాన్ ఎన్నిక కావడం భారత్ పట్టించుకోవాల్సిన అంశమే. ఇస్లామిక్ దేశాల సహకార సంస్థ 'ఓఐసీ'కి చెందిన ఐదు సభ్యదేశాలు భద్రతా మండలిలో ఉండటమూ పాక్‌కు కలిసొచ్చేదే. కశ్మీర్‌పై చర్చను తనకు అనుకూలంగా మార్చడానికి అది ప్రయత్నించవచ్చు. ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆహార భద్రత ఐరాస ఎజెండాలో కీలకమైంది. సింధు జలాల ఒప్పందానికి సంబంధించి దృఢమైన యంత్రాంగాలు ఉన్నప్పటికీ, పాక్ తన ఆహార భద్రతకు సంబంధించిన సమస్యగా ఈ అంశాన్ని చర్చలోకి తేగలదు. ఒక భారతీయుడిని ఐరాస నిర్వచించిన ఉగ్రవాది జాబితాలో చేర్చడానికి కూడా పాక్ ప్రయత్నించవచ్చు.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోకి పాకిస్తాన్ ఇటీవల ఎన్నికైన విషయాన్ని, భారత్‌లో విస్తృతంగా నివేదించి ఉంటే, అది భారతీయులను కలవరపరిచి ఉండేది. భారత్ లోక్‌సభ ఎన్నికల్లో కూరుకుపోవడంతో, ఐక్యరాజ్యసమితి అత్యున్నత కమిటీలో పాకిస్తాన్ స్థానం గురించిన వార్తలకు దేశంలో పెద్దగా స్పందన లభించలేదు. ఐరాసలోని 193 సభ్య దేశాలలో 182 పాకిస్తాన్‌కు అనుకూలంగా ఓటు వేసిన ఈ ఎన్నిక, మూడవ దఫా అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానానికి పెద్ద సవాలుగా మారనుంది.

2025 జనవరి 1న భద్రతామండలిలో రెండేళ్ల కాలానికి చేరనున్న పాకిస్తాన్, సోమాలియాల ఎంపికతో ఐక్యరాజ్యసమితి అత్యున్నత నిర్ణయాధికార సంస్థలో 'ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్'కు చెందిన ఐదు సభ్యదేశాలు ఉంటాయి. మొత్తం ప్రపంచం చట్టబద్ధంగా కట్టుబడి ఉండే నిర్ణయాలు చేసే ఏకైక ఐరాస సంస్థ అయిన భద్రతా మండలి ఎన్నుకున్న సభ్యుల సంఖ్యలో ఇది సగం. అటువంటి నిర్ణయాలను మండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వీటో ద్వారా తిరస్కరించవచ్చన్నది మరొక విషయం. ఈ సభ్యదేశాలనే పి–5 లేదా బిగ్ ఫైవ్ అంటారు.

ఇప్పుడు ఇస్లామాబాద్‌కు ఐరాస భద్రతామండలి తలుపులు తెరిచినంత మాత్రాన, భారత్ ఏదైనా దౌత్యపరమైన ముప్పును ఎదుర్కొంటుందని అర్థం కాదు. ప్రమాదం ఉండదు, కానీ సవాలు మాత్రం ఉంటుంది. అందువల్ల, భారత్ నిశ్చింతగా ఉండకూడదు. న్యూయార్క్‌లోని ఐరాస కార్యాలయంలో భారత శాశ్వత ప్రతినిధి పదవి ఖాళీగా ఉంది. పాకిస్తాన్ తరఫున గత ఐదేళ్లుగా ఈ పదవిని నిర్వహిస్తున్న మునీర్ అక్రమ్ ఒక ఘోరమైన రాయబారి. ఆయన అంతకుముందు కూడా 2002 నుండి ఆరేళ్ల పాటు అదే పదవిలో ఉన్నారు. 1994లో ఐరాస మానవ హక్కుల సంఘం ఎజెండాలో కశ్మీర్‌ను చేర్చడంలో అక్రమ్ రహస్య దౌత్యం దాదాపుగా విజయం సాధించింది. మరుసటి సంవత్సరం, ఆయన అధికారికంగా జెనీవాలో ఐరాస శాశ్వత ప్రతినిధిగా నియమితులవడమే కాకుండా ఏడేళ్ల ఈ పదవిలో కొనసాగారు. కాబట్టి, లోక్‌సభ ఎన్నికల ప్రచారం మధ్యలో పదవీ విరమణ చేసిన భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ స్థానాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన భారత ప్రభుత్వం వెంటనే భర్తీచేయాలి.

వచ్చే ఏడాది ద్వైవార్షిక సమీక్ష కోసం కౌంటర్ టెర్రరిజం డాక్యుమెంట్ ఐక్యరాజ్యసమితి వద్దకు తిరిగి వస్తుంది. ఈ సమీక్షలోని పాఠం సరిహద్దు ఉగ్రవాద బాధితురాలిగా భారత్‌కు ముఖ్యమైనది. అనేక దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని రాజ్య విధాన సాధనంగా ఉపయోగించిన పాకిస్తాన్ వంటి మొండి రాజ్యాల కారణంగా, ఉగ్రవాదానికి విశ్వవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన నిర్వచనాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో రూపొందించలేకపోయారు. అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకునే ఆ సమావేశంలో సోమాలియాది కూడా సందేహాస్పద వైఖరి కావడంతో, జనరల్ అసెంబ్లీపై ఈ రెండు దేశాల ప్రభావమూ పడుతుంది.



అదే సమయంలో భారత్ మరో ప్రమాదం నుంచి తనను కాపాడుకోవలసి ఉంది. ఇస్లామిక్ దేశాల సహకార సంస్థ 'ఓఐసీ'కి చెందిన ఐదుగురు భద్రతా మండలి సభ్యులు ఒక భారతీయుడిని ఐక్యరాజ్యసమితి నిర్వచించిన ఉగ్రవాది జాబితాలో చేర్చడానికి కలిసి పని చేసే అవకాశం ఉంది. వాళ్లు కచ్చితంగా భద్రతా మండలి ప్రసిద్ధ తీర్మానం 1267 ప్రకారం, ఒక హిందువును ఉగ్రవాది జాబితాలో చేర్చడాన్ని చూడాలనుకుంటారు. 1999లో ఆమోదం పొందిన ఈ తీర్మానం ప్రకారం, ఉగ్రవాది జాబితాలో చేరిన అపఖ్యాతి ఒసామా బిన్ లాడెన్‌ది. న్యూఢిల్లీలోని హిందూ జాతీయవాద ప్రభుత్వం ఈ విషయంలో ఓఐసీకి మేత అవగలదనే చెప్పాలి. అయితే 2024లోనూ, వచ్చే ఏడాదిలోనూ మోదీ నేతృత్వంలోని నూతన ప్రభుత్వం భారత్‌లో ఎలా వ్యవహరిస్తుందనే దానిపై ఇది చాలావరకు ఆధారపడి ఉంటుంది.

1267 తీర్మానంతో ఏర్పాటు చేసిన ఆంక్షల కమిటీ ద్వారా అబ్దుల్ రెహ్మాన్ మక్కిని 'గ్లోబల్ టెర్రరిస్ట్' జాబితాలో చేర్చడంలో అమెరికాతో కలిసి పనిచేసిన భారత్ సఫలీకృతమైంది. ఆ ఘటన పాక్ రాయబారి అక్రమ్‌ను ఇప్పటికీ గాయపరుస్తూనే ఉంది. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద చర్యలకు మక్కీయే కారణమని ఆ తీర్మానం ఇచ్చిన వివరణ పాక్ బాధను మరింత పెంచింది. ఈ మక్కీ లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు స్వయానా బావ.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని భారత్ రద్దు చేసిన తర్వాత, భద్రతా మండలిలో పాకిస్తాన్ 'సంప్రదింపులు' మాత్రమే చేయగలిగింది. ఇటువంటి ప్రక్రియ మండలి సభ్యుల మధ్య అంతర్గత చర్చలను సూచిస్తుంది. ఈ చర్చల గురించి బహిరంగంగా ఎటువంటి రికార్డూ ఉండదు. ఇప్పుడు పాక్ భద్రతా మండలిలోకి ప్రవేశించిన తర్వాత, మిగతా ఓఐసీ సభ్యదేశాల మద్దతుతో కశ్మీర్‌పై చర్చను తనకు అనుకూలంగా మార్చడానికి ప్రయత్నించవచ్చు. అవి 'బహిరంగ సంప్రదింపుల' ద్వారా జరిగే అవకాశం ఉంది. అంటే వాటి గురించి మీడియాకు, ప్రజలకు తెలియజేస్తారని అర్థం. సందర్భానుసారంగా ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్ కూడా ఆ చర్చల గురించి ప్రపంచానికి తెలియజేయవచ్చు. భారత్ దృక్కోణం నుండి ప్రమాదం ఏమిటంటే, ఇటువంటి జిత్తులు కొనసాగుతున్నప్పుడు కశ్మీర్ సమస్యపై ఐరాస పూర్తి దృష్టి పడుతుంది. అయినప్పటికీ భద్రతా మండలిలో వీటో కలిగివున్న పి–5 దేశాలపైనే ఏదైనా ఆధారపడి ఉంటుంది.

15 మంది సభ్యులతో కూడిన భద్రతామండలి పనికి ఆటంకం కలగకుండా గతంలో భారత్, పాక్ సహజీవనం చేశాయి. రెండు దేశాలూ చివరిసారిగా 2012లో కలిసి పనిచేశాయి. కానీ తర్వాత రెండు విషయాలు మారిపోయాయి. ఐరాసలో అప్పటి పాకిస్తాన్ మిషన్‌కు 'డాన్' మీడియా గ్రూప్‌ను కలిగి ఉన్న హరూన్ కుటుంబానికి చెందిన హుస్సేన్ హరూన్ నాయకత్వం వహించారు. ఆయన చాలామంది పాకిస్తాన్ కెరీర్ దౌత్యవేత్తల మాదిరిగా కాకుండా భారత్‌కు వ్యతిరేకంగా ఎప్పుడూ నోరు జారలేదు. రెండవ మార్పు ఏమిటంటే, అప్పట్లో 2012లో ప్రపంచం చాలా భిన్నమైనదిగానూ, తక్కువ సంక్లిష్టమైనదిగానూ ఉండేది.

ఇటీవలి సంవత్సరాలలో ఐరాసలో దురదృష్టవశాత్తు ప్రత్యర్థులు, శత్రువుల మధ్య రహస్య, బహిరంగ ఘర్షణకు అవకాశాలు పెరిగాయి. అందువల్ల, భారత్‌తో తన ద్వైపాక్షిక సమస్యలను అంతర్జాతీయీకరించడానికి పాకిస్తాన్‌కు మరిన్ని అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు, ముఖ్యంగా ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆహార భద్రత అనేది ఐరాస ఎజెండాలో కీలకంగా ఉంది. వివాదాలను పరిష్కరించడానికి సింధు జలాల ఒప్పందానికి సంబంధించి దృఢమైన యంత్రాంగాలు ఉన్నప్పటికీ, పాకిస్తాన్ తన ఆహార భద్రతకు సంబంధించిన సమస్యగా ఈ అంశాన్ని గట్టిగా చర్చలోకి తీసుకురాగలదు. వారు తమ కుతంత్రాలలో విజయం సాధించకపోవచ్చు కానీ ఇస్లామాబాద్ ప్రయత్నం చేయకుండా మాత్రం ఉండిపోదు. ఐరోపా పార్లమెంట్ ఎన్నికలలో యూరప్ మితవాదం వైపు దూసుకెళ్లిన తర్వాత, ఐరాస చర్చల్లో ఇస్లామోఫోబియా కూడా ఎక్కువగా ఉంటుంది. భద్రతా మండలిలో ఓఐసీ దౌత్యవేత్తల సంఖ్య పెరగడం వారికి దేవుడిచ్చిన వరం. ఐక్యరాజ్యసమితిలో తన ప్రయోజనాలను ముందుకు తీసుకురావడానికి పాకిస్తాన్ దీన్ని ఎక్కువగా ఉపయోగించుకుంటుంది.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆరోగ్య యోగం



ప్రతి ఒక్కరికీ, యోగా దినోత్సవ (జూన్ 21) శుభాకాంక్షలు. శ్వాసించండి, ప్రవహించండి, దృఢంగా, ఆరోగ్యంగా ఉండండి.

– మోహన్ లాల్, నటుడు

రద్దే సరి



ప్రస్తుత నీట్ స్కామ్‌కు న్యాయమైన పరిష్కారం ఏమిటంటే, పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడమే! ప్రతిసారీ సుప్రీం కోర్టు యథాతథ స్థితి కోసం చూడకూడదు; మోసగాళ్లు తప్పించుకొని, నిజమైన అర్హులు బాధపడాల్సి వచ్చినప్పుడు అది పరిష్కారం కాదు. ఈ దర్యాప్తులన్నీ బూటకం.

– కె.సుజాతా రావు, మాజీ ఉన్నతాధికారి

చక్కెర నీళ్లు ప్రమాదకరం



మొత్తానికి, ఉత్పత్తులను బలపరుస్తున్నప్పుడు అవి వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా, నష్టం కలిగించేలా ఉండకుండా చూసుకునే బాధ్యత సెలబ్రిటీల మీద ఉందని సుప్రీం కోర్టు పేర్కొంది. ముందు కోలాలు, చక్కెర ద్రావకాలతో మొదలెడదాం. ఒకవేళ 10 శాతం మంది భారతీయులకు మధుమేహం ఉంటే, అది ఉన్నట్టు తెలియని మరో 50 శాతం మందిని కలుపుకోవాలి. అందుకే వాటిని ప్రమోట్ చేసేవాళ్లు అవి ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదకరమని జతచేయాలి.

– శేఖర్ కపూర్, దర్శకుడు

ఇంత ఈజీనా?



తాను అమెరికా అధ్యక్షుడినైతే, అమెరికా కళాశాలల్లో తమ డిగ్రీ పూర్తవగానే విదేశీ విద్యార్థులకు గ్రీన్ కార్డ్(శాశ్వత నివాస కార్డు) అందుతుందని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. ఆశ్చర్యకరం!

– ఆర్తీ టిక్కూ సింగ్, జర్నలిస్ట్

మూక న్యాయం



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఈ వీడియోలో(షేర్ చేశారు), దైవదూషణ ఆరోపణలతో స్వాత్ లోయలో ఒక పాకిస్తానీ మనిషిని ఒక మూక సజీవంగా తగలబెట్టింది. బాడీని చుట్టుముట్టిన పెద్ద మూకలోని జనాలు ఆ దాడిని చిత్రించేందుకు ఫ్లాష్‌లైట్లు ఉన్న కెమెరాలు వాడుతున్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ పాకిస్తాన్‌కు స్వాగతం!

– తాహా సిద్దిఖీ, పాక్ కాలమిస్ట్

తోలుబొమ్మ రాకుండా...



తర్వాతి దలై లామాగా ఒక తోలుబొమ్మను ప్రతిష్ఠించాలన్న షీ జిన్‌పింగ్ పథకాన్ని భగ్నం చేయడానికి అమెరికా, ఇండియా కలిసి పనిచేయాలి. అందుకే, మైకేల్ మెక్‌కౌల్, నాన్సీ పెలోసీల నేతృత్వంలోని ఉభయపక్ష అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులు ధర్మశాలలోని దలై లామాతో చర్చలు జరిపిన అనంతరం, వారిని మోదీ కలిసి మంచిపని చేశారు.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల వ్యాఖ్యాత

నవీన రత్నం



నాటుదనపు ఒడిషాను ఆధునికత దిశగా మళ్లించే సుదీర్ఘ కవాతుకు నవీన్ పట్నాయక్ నేతృత్వం వహించి, తన శకాన్ని ఘనంగా ముగించారు. ఆడంబరాలు లేవు, మూలుగులు లేవు, గోల లేదు. దిగిపోతూ, ప్రజాస్వామ్యం నన్ను ఇక్కడికి తెచ్చింది, ప్రజాస్వామ్యం అధికారం తీసుకుని వెళ్లింది అన్న సందేశం ఇచ్చారు. నవీన్ పట్నాయక్ నిజమైన భారత రత్న!

– ఎం.జె.అక్బర్, సంపాదకుడు

ఇన్ బాక్స్

'నీట్'ను రద్దుచేయాలి!

ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ప్రవేశ నిమిత్తం నిర్వహించే 'నీట్' పరీక్ష విశ్వసనీయతపై అనుమానాలు, ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఏడాది ఈ పరీక్ష పేపర్ లీక్ అయ్యిందనే వార్త దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థులకు మనోవేదననే మిగిల్చింది. గ్రామాలూ, చిన్నా చితకా పట్టణాల నుంచి నగరాలకు పంపించి తమ పిల్లలకు కోచింగ్ ఇప్పించిన తల్లితండ్రుల బాధ వర్ణనాతీతం. 2017 నుంచి కేంద్ర విద్యాశాఖ పరిధిలోని ఎన్టీఏ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలు రోజు రోజుకూ విశ్వసనీయతను కోల్పోతున్నాయి. నీట్ పరీక్షలో బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలోనే ఎక్కువగా అవినీతి జరిగింది. ఇందుకు ఆ రాష్ట్రాల్లో రాసిన విద్యార్థులకు మాత్రమే మొదటి ర్యాంక్స్ రావడం సాక్ష్యం. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కేవలం రెండు చోట్ల మాత్రమే అక్రమాలు జరిగాయని ఒప్పుకోవడం ఈ సందర్భంగా గమనార్హం.

పేపర్ లీకేజీ జరిగినట్లు, నడిబజార్లో నీట్ పేపర్ చేతులు మారినట్లు, ఒక్కో పేపర్‌ను రూ. 30 లక్షలకు అమ్ముకున్నట్లు చెబుతున్నారు. ఒకపక్క నీట్ పేపర్ లీకేజీపై గొడ జరుగుతుండగానే యూజీసీ నిర్వహించే 'నెట్' (ఎన్ఈటీ) పరీక్షలో అవకతవకలు జరిగినట్లు బయటపడటంతో... ఒక్కరోజు వ్యవధిలోనే నెట్ పరీక్షను యూజీసీ రద్దు చేసింది. నీట్ విషయంలో ఇటువంటి నిర్ణయం ఎన్టీఏ ఎందుకు తీసుకోవడంలేదో మరి! ఈ పరీక్షను రద్దు చేసి మళ్లీ పకడ్బందీగా నిర్వహించాలని విద్యార్థులూ, తల్లితండ్రులూ కోరుతున్నారు.

– డాక్టర్ మండ్ల రవి, హైదరాబాద్

నిజాయితీ లేమిలో పోటాపోటీ



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'సిగ్గు లేని వాడు చిరకాల జీవిరా' అన్నాడు వేమన మహాకవి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో వాడిన 20 లక్షల 'ఈవీఎం'ల అతీగతీ ఏమైనట్టు? కనపడకుండా లెక్కకు రాకుండా ఎటుపోయినట్టు? ప్రజల నుంచీ, కమ్యూనిస్టుల నుంచి వస్తున్న ఈ విమర్శలపై తమ 'విజయా'నికి ఉబ్బితబ్బిబ్బైపోతున్న టీడీపీ నాయకుడు చంద్రబాబు నాయుడు స్పందించి తీరాలి. ఆ మాటే అన్నారు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్. ఆయన టీడీపీ అధినేత చూపే లెక్కల్ని గుచ్చి గుచ్చి అడగడంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎన్నికైన తీరును సర్వత్రా ప్రశ్నించడం మొదలైంది. ఎందుకంటే చంద్రబాబే చెప్పినట్టుగా ఈ ఎన్నికల నిమిత్తం 60 లక్షల ఈవీఎమ్‌లు ఎన్నికల కమిషన్ సిద్ధం చేసుకుంది. వీటిలో 40 లక్షల మెషీన్లనే వాడింది. మరి మిగతా 20 లక్షల మెషీన్లు ఎక్కడో ఉండాలి కదా? ఆ సంగతే సమాచార చట్టం ప్రకారం ఎన్నికల కమిషన్‌ను కోరితే ఆ విషయం తమకేమీ తెలీదని సమాధానం ఇచ్చిందట! ఇది సరికాదు. ప్రభుత్వం తమకిచ్చిన 'ఈవీఎమ్'లనే వాడామని కమిషన్ చెప్పడం కచ్చితంగా రెటమతమే. లోగడ ఈ విషయం గురించి చంద్రబాబే అనుమానాలను వ్యక్తం చేసి ఉన్నందున... ఇపుడు అదే గోల్‌మాల్ జరిగి ఉన్నందున, విచారణకు బాబు కోరడానికి నిరాకరిస్తున్నట్టున్నారని ఉండవల్లి అభిప్రాయం.

ఇదిలా ఉండగానే, క్షీణ దశలో ఉన్న బీజేపీ ప్రయోజనాల కోసం తంటాలు పడుతున్న మోదీ... అటు చంద్రబాబునీ, ఇటు బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌నూ ఎలా జాతీయ స్థాయిలో తన జేబులో బొమ్మల్లా వాడుకోబోతున్నారో 'హిందూ' దినపత్రిక తాను ముద్రించిన ఒక కార్టూన్‌లో ఉదాహరించింది! మోదీ మూడవసారి అధికారానికి రావాలంటే ఇద్దరు తైనాతీ ముఖ్యమంత్రులు– బాబు, నితీశ్‌లు అవసరం. కనుక ఈ ఇరువురి తల మీద పెట్టిన పీఠం మీద నుంచుని మోదీ 'ఎన్డీఏ' తరఫున 'ఘనంగా' ప్రకటన విడుదల చేస్తాడు! తాము రెండు రాష్ట్రాలకు గౌరవ ముఖ్యమంత్రులమన్న స్పృహ మాత్రం ఈ ముఖ్యమంత్రులకు ఏ కోశానా లేదనేది ఈ చిత్ర సారాంశం! ఇలాంటి వాళ్లు ఎన్డీఏకైనా జాతీయ స్థాయిలో ఎలా సేవ లందించగలరో బాబు– నితీశ్‌లే చెప్పాలి.




భారత రాజ్యాంగాన్ని ఈ పదేళ్ల పాలనా కాలంలో మోదీ తుంగలో తొక్కారు. ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద ప్రభుత్వంతో అంటకాగుతూ ... ఆ దేశం నుంచి కొన్న పెగాసెస్ సాఫ్ట్‌వేర్ ద్వారా భారతదేశ అభ్యుదయ వాదులూ, పౌరహక్కుల ఉద్యమకారులూ... ఒక్క మాటలో చెప్పాలంటే పాలక వర్గ ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ, ఆందోళన చేస్తున్న వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలూ, ప్రజా నాయకులపై నిఘా పెట్టి వేధింపులకు గురిచేసింది మోదీ సర్కార్. ఆ విధంగా రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో ఒకటైన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించింది. అలాగే సమాఖ్య తత్వాన్ని దెబ్బతీసే ప్రకటనలూ మోదీ ప్రభుత్వం చేసింది. మైనారిటీలను ఈ దేశ పౌరులే కాదన్నట్లు చొరబాటుదారులుగా చిత్రించారు మోదీ. బీజేపీ నాయకులు కొందరు బహిరంగంగా తమకు 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామని ప్రకటించారు. చివరికి ఎన్నికల్లో బీజేపీకి సొంత మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగినన్ని సీట్లు కూడా లభించకపోవడంతో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల వెన్నుదన్నుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది ఆ పార్టీ. ఈ నేపథ్యంలో మోదీ రాజ్యాంగాన్ని 'మార్చబోమ'ని చెప్పడం అనివార్యమయ్యింది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని సాధించడంలో కేంద్రం ఒత్తిళ్లకు లొంగిపోయి 'విఫల ముఖ్యమంత్రి'గా ప్రజల దృష్టిలో మిగిలిపోయారు చంద్రబాబు. చివరికి మోదీ పోలవరాన్ని ఏటీఎంగా చంద్రబాబు మలచుకున్నారని విమర్శించినా పట్టించుకోకుండా మళ్లీ ఆయన బీజేపీ పొత్తుపెట్టుకున్నారు. దీని వెనుక మతలబు... జనసేన నేత పవన్‌కల్యాణ్‌కు బాబును అదుపులో ఉంచేపనిని మోదీ అప్పగించడమే! పవన్ ఈ పదవీ కుమ్ములాటలో మోదీ చేతిలో ఓ 'సత్తరకాయ'; పవన్, చంద్రబాబు బీజేపీ నేత మోదీ చేతి పావులు. ఎన్డీఏ బతుకు జాతీయ స్థాయిలో 'కుక్కలు చింపిన విస్తరి' అయితే ఆశ్చర్యం లేదు!

abkprasad2006@yahoo.co.in

ధర్మకార్యాలకు వెచ్చించాలి!

దైవ సంకల్పితంగా అని భావించినా, లేక ప్రకృతి నిర్దేశించిన విధంగా అనుకున్నా 'శతవర్ష పర్యంతమైన జీవితాన్ని పొందిన మానవుడు, ఆ వందేళ్ళలో ఏం చేస్తూ గడిపితే జీవితం అర్థవంతమైనదిగా పరిగణించబడి అందరి మన్ననలను పొందుతుంది?' అనే ప్రశ్న మనిషిని మొదటినుంచి ఆలోచింపజేసింది. సూక్ష్మంగా చెప్పాలంటే, కష్టించి పని చేసి ధనాన్ని కూడబెట్టడం, అలా కూడబెట్టిన ధనంలోంచి కొంత భాగాన్ని శాస్త్రసమ్మతమైన సామాన్యమైనవో లేక తాహతుకొలదీ విశేషమైనవో అయిన క్రతువులకు ఖర్చుపెట్టడం జీవితానికి సంతృప్తిని ఇచ్చే ఒక సన్మార్గమని పై ప్రశ్నకు సమాధానంగా ఆంధ్ర మహాభారతంలోని శాంతిపర్వం చెప్పింది.



జ్యోతిర్మయం

కేవలం డబ్బు సంపాదించడం అనే ఒక్క కర్మతోనే జీవితం గడవకూడదనీ, దానికి తోడుగా క్రతువుల ద్వారా ఖర్చుపెట్టడం కూడా జరిగినప్పుడే దేవతలకూ, తద్వారా దేవతల వంటి మానవులకూ తృప్తి కలగడం జరుగుతుందనీ, అలా కాకుండా దానికి విరుద్ధంగా, కేవలం సంపాదించి కూడబెట్టడంతోనే జీవితాన్ని కొనసాగించాలనుకోవడం వివేకంతో కూడుకున్న పని కాబోదనీ, ధర్మవిరుద్ధంగా అలా చేస్తే అది మిక్కిలి పాపహేతువు అవుతుందనీ, అనుకోని కష్టాలను, ఊహించని అనర్థాలను కలిగించేదిగా పరిణమిస్తుందనీ వేదవిదులు అంటారని శాంతిపర్వంలోని ఈ కందపద్యం స్పష్టం చేసింది.

జతనంబున నర్థము సం
చితముగ గావించి క్రతువిశేషంబుల దే
వతలం దృప్తుల జేయమి
యతికిల్బిషకారి యందు రాగమవేదుల్.

కనుక, కాయకష్టం చేసి కూడబెట్టడమే కాదు, శక్తి కొలది అందులో కొంత భాగాన్ని క్రతువులు అనగా ధర్మకార్యాలకు సంతోషంగా ఖర్చు చేయడం కూడా ఆచరించే ధర్మంలో భాగంగా తలచడం మనిషికి శ్రేయోదాయకం. అలా నడుచుకున్నప్పుడు జీవితం సజావుగా సాగి శాంతిని చేకూరుస్తుంది. నలుగురిలో మనిషి కొనసాగించాల్సిన సుహృద్భావ జీవన విధానానికి అది మార్గమవుతుంది అని సారాంశం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

శభాష్ సాయికిరణ్
జాతీయస్థాయి షాట్‌పుట్ క్రీడాకారుడికి సీఎం రేవంత్ అభినందన



దుద్యాల్: ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి షాట్‌పుట్ క్రీడా విభాగంలో తెలంగాణ తరఫున పాల్గొని బంగారు పతకం సాధించిన అల్వాల్ సాయికిరణ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలంలోని మారుమూల గ్రామమైన హస్నాబాద్‌కు చెందిన విద్యార్థి దేశస్థాయిలో ప్రథమంగా నిలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా సత్తాచాటి దేశ, రాష్ట్ర కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. సాయికిరణ్ సాధించిన బంగా రు పతకాన్ని తన చేతులతో క్రీడాకారుడి మెడలో వేసి శుభాకాంక్షలు తెలిపారు. సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున సహకారం అందితే అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రయత్నిస్తానని తెలిపాడు. కార్యక్రమంలో సాయికిరణ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సావిత్రమ్మ మృతికి సీపీఎం సంతాపం
సాక్షి, హైదరాబాద్: కామ్రేడ్ జాని సావిత్రమ్మ మృతికి సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం తెలిపింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు హైదరాబాద్ విద్యానగర్‌లోని సావిత్రమ్మ తన స్వగృహంలో మరణించారు. సావిత్రమ్మ, వారి కుటుంబ సభ్యులంతా సీపీఎం కోసం 30 ఏళ్లుగా పనిచేస్తున్నారు. సావిత్రమ్మ రెండవ అబ్బాయి బాబూరావు తెలంగాణ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడి రాష్ట్ర ఆఫీస్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు జయరాం ఆంధ్రప్రదేశ్ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారు. పెద్దబ్బాయి జ్యోతీశ్వరరావు పార్టీలో పని చేస్తూ పోస్టల్ యూనియన్ నాయకుడిగా ఉన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, టి.జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, డీజీ నరసింహారావు, చుక్కా రాములు, పాలడుగు భాస్కర్, పి.ప్రభాకర్, ఎస్.రామ, కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్, వెంకటేశ్, ఎం.శ్రీనివాస్, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, స్కైలాబ్ బాబు, అరుణ జ్యోతి, పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, కిరణ్ చంద్ర తదితరులు సావిత్రమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కుతుబ్‌షాహీ కాలంనాటి కోసుమినార్
గుర్తించిన పురావస్తుశాస్త్ర పరిశోధకుడు శివనాగిరెడ్డి



గుమ్మటాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న మసీదు వద్ద కుతుబ్‌షాహీ కాలం నాటి కోసు మినార్ వెలుగులోకి వచ్చింది. దీన్ని పురావస్తుశాస్త్ర పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. ఆయన శుక్రవారం తూప్రాన్‌పేట గ్రామంలోని మసీదు వద్ద ఆనవాళ్లు కోల్పోయి శిథిలావస్థలో ఉన్న కోసుమినార్ గుమ్మటాన్ని గుర్తించారు. కుతుబ్‌షాహీ చక్రవర్తులు తమ కాలంలో హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రహదారిపై రాకపోకలు సాగించేవారు. ఆ క్రమంలో నాటి రాజులు నిత్యం ఐదుమార్లు ప్రార్థనలు చేసేందుకు సమయాలకు అనుగుణంగా ప్రస్తుత జాతీయ రహదారి (నాడు సాధారణ రహదారి) వెంబడి వాటిని నిర్మించారు. ఆయా మసీదులను అటు రాకపోకలు సాగించే రాజవంశీయులు గుర్తించేందుకు వీలుగా కోసుమినార్ (మైలురాళ్లు) గుమ్మటాలను రహదారిపై ఏర్పాటు చేయించారు. కాలక్రమేణా అవి ప్రాభవాన్ని కోల్పోయాయి. పక్కనే ఉన్న మసీదు పైభాగంలోని రెండు మినార్‌లు కూడా దెబ్బ తిన్నాయి. అలనాటి వారసత్వ కట్టడాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పురావస్తుశాస్త్ర పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం తన వంతు సహకారం ప్రభుత్వానికి అందిస్తానని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి లుబ్నా సార్వత్
సాక్షి, హైదరాబాద్: సామాజిక కార్యకర్త లుబ్నా సార్వత్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డిలు గాంధీభవన్‌లో శుక్రవారం ఆమెకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ నేతలు సంగిశెట్టి జగదీశ్వరరావు, కోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పిడుగుపాటుకు పిట్టల్లా..

తెలంగాణ పల్లెల్లో పిడుగుల వర్షం | వాతావరణ మార్పులతో పెరిగిన తీవ్రత | పంట చేనుల్లోనే కూలుతున్న బతుకులు | నివారించే టెక్నాలజీ వచ్చినా నిద్రలేవని యంత్రాంగం

2019-23 వరకు ఐదేళ్లలో 384 మంది రైతులు, కూలీల మృత్యువాత

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఆకాశం మబ్బు పడితే వాన కురుస్తుందన్న ఆశ..ఆనందం.! కానీ మబ్బులు పట్టిన ఆకాశం ఇప్పుడు పగబట్టినట్లు పిడుగులు కురిపిస్తోంది. పిడుగుల వర్షం కొత్తేమీ కానప్పటికీ వాతావరణ మార్పుల కారణంగా తెలంగాణలో మేఘం నుండి భూమిని తాకే (క్లౌడ్ టూ గ్రౌండ్) పిడుగుల సంఖ్య గడిచిన ఐదేళ్లతో (2019 – 2023) పోలిస్తే ఏకంగా 36 శాతం పెరిగింది. ఫలితంగా తెలంగాణ పల్లెల్లో ఏటేటా పిడుగుపాటు మరణాల సంఖ్య పెరిగిపోతోంది. మరణిస్తున్న వారంతా రైతులు, కూలీలే కాగా, కళ్ల ముందే ప్రకృతి పగబట్టి అయినవారిని దూరం చేస్తుండటంతో బాధిత కుటుంబాలు బోరున విలపిస్తున్నాయి.

కోట్ల వోల్టులతో దూసుకువస్తూ..
మేఘాల నుండి ఒక్కసారిగా విడుదలయ్యే ఎలక్ట్రాన్లు 15 కోట్ల వోల్టుల విద్యుత్ ప్రవాహంతో మొదలై 30 కోట్ల వోల్టుల వరకు పిడుగులు భూమ్మీదకు దూసుకు వస్తున్నాయి. ఫలితంగానే పిడుగుపాటు ప్రాంతాల్లో భారీగా మనుషులతో పాటు ఇతర జంతువులు, పక్షి జాతుల మరణాల సంఖ్య పెరిగిపోయిందని జాతీయ క్లైమేట్ ప్రమోషన్ కౌన్సెల్ నిర్ధారణకు వచ్చింది. గడిచిన పదేళ్లుగా మరణాల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. 2014లో పిడుగుపాట్లకు 53 మంది మరణిస్తే, 2023కు వచ్చేసరికి ఈ సంఖ్య 84కు పెరిగిపోయింది. తెలంగాణాలో అత్యధికంగా ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్ జిల్లాల్లో అత్యధిక పిడుగుపాటు మరణాలు నమోదవుతున్నాయి.



ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు
ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం డొంగర్‌గామ్‌నకు చెందిన యువ దంపతులు సంతోష్, స్వప్నలు ఈ నెల 6న పత్తి వేసేందుకు దుక్కి చదును చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం మొదలైంది. దీంతో టేకు చెట్టు కింద ఉన్న గుడిసెలో తలదాచుకున్న సమయంలో చెవులు చిల్లులు పడేలా పిడుగు పడింది. మరుక్షణంలోనే ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

ప్రభుత్వం కోరితే సాంకేతిక సహాయం



పిడుగుపాటు మరణాలు పూర్తిగా నివారించతగ్గవే. అందివచ్చిన పరిజ్ఞానంతో పిడుగులు పడే ప్రాంతాల సమాచారాన్ని ముందే గుర్తించి, సంబంధిత ప్రజలను అప్రమత్తం చేయొచ్చు. అయితే ఇందుకు ప్రభుత్వాల చొరవ అవసరం. తెలంగాణలో గడిచిన ఐదేళ్లలో పిడుగులు, మరణాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వం కోరితే సాంకేతిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కల్నల్ సంజయ్ శ్రీవాస్తవ, చైర్మన్ క్లైమేట్ ప్రమోషన్ కౌన్సిల్, న్యూఢిల్లీ

అరెస్టర్లు అందుబాటులోకి వచ్చినా..
అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకునే విషయంలో తెలంగాణ వెనుకబడిపోయింది. పిడుగులు కురిసే ప్రాంతాలు, సమయాలు తదితర వివరాలను ముందుగానే పసిగట్టే అధునాతన అరెస్టర్లు –కండక్టర్లు అందుబాటులోకి వచ్చాయి. ఐఐటీ పుణె 'దామిని'అనే యాప్‌తో 20 నుండి 40 కి.మీల పరిధిలో పిడుగుపాటును పసిగట్టి ముందే అలర్ట్ చేస్తుంది. ఎర్త్ నెట్‌వర్క్ అనే అమెరికా సంస్థ సంస్థ సైతం అధునాతన పరికాలను మార్కెట్‌లోకి తెచ్చింది. మన దేశంలో ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో సెల్‌ఫోన్ ద్వారా అలర్ట్ మెసేజ్‌లు, రేడియో సందేశాలతో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. తెలంగాణలో మాత్రం విపత్తుల నిర్వహణ శాఖ నిర్లిప్తంగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సాయానికి ఐదేళ్లుగా ఎదురుచూపులే..
రాష్ట్రంలో పిడుగుపాటు మరణాల బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన దోమల సుందర్‌రావు.. 2019 జూలై 18వ తేదీన పత్తి చేనులో అరకతో దున్నుతున్న సమయంలో పిడుగుపడటంతో దుక్కిటెడ్లతో పాటు అక్కడికక్కడే మరణించాడు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నా ఐదేళ్లుగా ఫలితం లేదు.

ఒకే దఫా రుణమాఫీ

▶ మొదటి పేజీ తరువాయి

పండుగ చేయాలన్న కాంగ్రెస్ విధానంతో ముందుకుపోతున్నాం. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఖర్గే మాట ఇస్తే మడమ తిప్పని నాయకులు. 2004లో కరీంనగర్‌లో తెలంగాణ ఇస్తానన్న మాటను సోనియా నిలబెట్టుకున్నారు. దానివల్ల ఏర్పడిన రాజకీయ సంక్షోభం, కాంగ్రెస్ ఎదుర్కొన్న విపత్కర పరిస్థితులు అందరికీ తెలుసు. సోనియా మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ ఇచ్చారు. సోనియాగాంధీ ఏదైనా మాట చెప్పారంటే అది శిలాశాసనమే. ఎలాంటి పరిస్థితులు వచ్చినా నిలబడతారు. రూ.2 లక్షల రుణమాఫీపై మేధావులు, విశ్లేషకులు కూడా కాంగ్రెస్‌వి అలవి కాని మాటలు అంటూ వ్యాఖ్యానించారు..' అని సీఎం గుర్తు చేశారు.

ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణ విముక్తి
'కేబినెట్‌లో రుణమాఫీ విధివిధానాలపై చర్చించాం. త్వరలో జీవో విడుదల చేస్తాం. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరం. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు ఐదేళ్లలో రాష్ట్రంలో రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తాం. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుంది. రుణమాఫీకి అవసరమైన సొమ్మును సేకరించి రైతులకు రుణవిముక్తి కల్పిస్తాం. ప్రజాపాలన, రైతు సంక్షేమం, రైతు రాజ్యంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాం. రుణమాఫీతో 47 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. తెలంగాణ వచ్చాక గత ప్రభుత్వం 2014, 2018లలో రెండుసార్లు రుణమాఫీ చేసింది. మొదటిసారి రూ.16 వేల కోట్లు, రెండోసారి రూ.12 వేల కోట్లు మాఫీ చేసింది. ఇలా రెండు విడతలుగా చేసిన రుణమాఫీ మొత్తం రూ.28 వేల కోట్లు మాత్రమే. అప్పటి ప్రభుత్వం 2018 డిసెంబర్ 11వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించింది..' అని రేవంత్ చెప్పారు.

8 నెలల్లోగానే రుణమాఫీ
'గత ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని నాలుగు విడతలు, వడ్డీ మాఫీ చేస్తామని చెప్పి వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ రైతులను సంక్షోభం వైపు తీసుకెళ్లి అన్నదాతల ఆత్మహత్యలకు కారణమైంది. పదేళ్లలో రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. కానీ మా ప్రభుత్వం 8 నెలల్లోనే రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటోంది. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ పార్లమెంటు ఎన్నికలు రావడంతో రెండున్నర నెలలు కోడ్‌లోనే గడిచిపోయాయి. అయితే 8 నెలల్లోపే సామాజిక బాధ్యతతో రుణమాఫీకి చేసేందుకు మంత్రివర్గం మొత్తం ఏకతాటిమీద నిలిచి, ఏక గొంతుకతో నిర్ణయం తీసుకుంది. రుణమాఫీకి సంబంధించి బ్యాంకుల్లోని రైతు రుణాల వివరాలను సేకరించాం..' అని సీఎం తెలిపారు.

నిధుల సేకరణ బాధ్యత ఆర్థిక మంత్రిది
'రుణమాఫీకి నిధుల సేకరణ ఆర్థిక మంత్రి భట్టి బాధ్యత. ఈ విషయంలో ఏదైనా ఉంటే ఆయన్ను సంప్రదించవచ్చు. ఏ ప్రాతిపదికన చేస్తామనేది మా అంతర్గత అంశం. అయితే గడువులోగానే చేస్తాం. ఆయనలాగా (కేసీఆర్) వాయిదాలతో చేయాలంటే ఇంత హడావుడి ఎందుకు? గడువు కంటే ముందు చేస్తే మీకేమైనా (విలేకరులకు) అభ్యంతరమా? తినబోతూ రుచులెందుకు? దీనిపై ఎవరికీ శషభిషలు అవసరం లేదు. నియమ నిబంధనలు అన్నీ జీవోలో పొందుపరుస్తాం..' అని రేవంత్ చెప్పారు.

రైతుభరోసాపై మంత్రివర్గ ఉపసంఘం
'రైతు భరోసా (గతంలో రైతుబంధు)పై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. రోడ్లు, కొండలు, గుట్టలకు, రియల్ ఎస్టేట్ భూములకు, ధనికులకు ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రైతు భరోసాను పారదర్శకంగా అందించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాం. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఈ కమిటీని ఏర్పాటు చేశాం. రైతు ప్రతినిధులు, రైతు సంఘాలు సహా పలువురు స్టేక్ హోల్డర్లతో చర్చించి జూలై 15వ తేదీలోగా కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. ఆ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి అందరి సూచనలతో పారదర్శకంగా రైతు భరోసా అమలు చేస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతుభరోసా కల్పించేలా నిర్ణయం తీసుకుంటాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

కొన్ని పత్రికలు లేనిపోనివి రాస్తున్నాయి..
'మంత్రివర్గ నిర్ణయాలు, ప్రభుత్వ పరిపాలన పరమైన నిర్ణయాలను వెల్లడించే బాధ్యత మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు అప్పగించాం. వారిద్దరు ఇచ్చే సమాచారమే ప్రభుత్వ అధికారిక సమాచారం. ఏదైనా సమాచారం ప్రసారం చేసేముందు మీడియా మిత్రులు ఇది గమనించాలి. కొన్ని పత్రికలు లేని వార్తలను రాస్తున్నాయి. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి. ఎక్కడో ఒకదగ్గర ఎవరో ఏదో మాట్లాడారని చెబుతూ వార్తలు రాస్తున్నాయి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వానికి సంబంధించిన అంశాలు, వివరాలపై, అలాగే అపోహలపై సమాచారం కావాలంటే ఇద్దరు మంత్రులు అందుబాటులో ఉంటారు. వారిని సంప్రదించాలి. ఊహించుకొని రాయకుండా ఇలా చేశాం. మిగతా విషయాలకు సంబంధించిన వివరాలను ఆయా శాఖల మంత్రులు ఇస్తారు. అయితే రాజకీయాలపై ఎవరైనా ఏదైనా మాట్లాడతారు..' అంటూ రేవంత్ వివరించారు.

సాహసోపేతమైన నిర్ణయం: తుమ్మల
రుణమాఫీ ప్రకటన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆర్థికంగా ఎంత కష్టమున్నా, ఇబ్బంది ఉన్నా రుణమాఫీ చేయడానికి పూనుకున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

రుణమాఫీకి పీఎం కిసాన్ నిబంధనలు!

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిలిపివేసే అవకాశం
- ప్రభుత్వ ఉద్యోగులు, అధిక ఆదాయ వర్గాలకు కూడా..

సాక్షి, హైదరాబాద్: రైతుల పంటరుణాల మాఫీకి పీఎం కిసాన్ మార్గదర్శకాల్లో కొన్నింటిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రూ. 31 వేల కోట్ల రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో మార్గదర్శకాలు ఎలా ఉంటాయన్న దానిపై రైతుల్లో చర్చ జరుగుతోంది. త్వరలో జీవో విడుదల చేస్తామని ఆయన చెబుతున్నా.. ఎలాంటి పరిమితులు ఉంటాయన్న దానిపై వారిలో ఉత్కంఠ నెలకొంది. పీఎం కిసాన్ పథకం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఆదాయ పన్ను చెల్లించే వారిని మినహాయించారు. అలాగే రాష్ట్రంలో అమలు చేసే రుణమాఫీని వీరందరికీ మినహాయించే అవకాశముంది. అయితే ఆదాయపన్ను చెల్లించే ప్రతి ఒక్కరినీ కాకుండా అధిక ఆదాయం ఉన్నవారిని మాత్రమే మినహాయిస్తారని తెలుస్తోంది. ఇక అధిక భూమి ఉన్నవారిని మినహాయించే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

నా జీవితంలో ఈరోజు చరిత్రాత్మకం
రుణమాఫీ ప్రకటనపై 'ఎక్స్'లో సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: రైతుల పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని శుక్రవారం ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై గతంలో పార్టీ ఇచ్చిన హామీని, తాజాగా దాన్ని నిలబెట్టుకున్న వైనాన్ని 'ఎక్స్' వేదికగా నెటిజన్లతో పంచుకున్నారు. 'నా జీవితంలో ఈరోజు చరిత్రాత్మకం. 2022 మే 6న వరంగల్ వేదికగా లక్షలాది మంది తెలంగాణ రైతులకు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ హామీని నా సారథ్యంలోని మంత్రివర్గం నిలబెట్టుకుంది. తెలంగాణ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నది' అని రేవంత్ పోస్ట్ చేశారు.

అన్నారం బరాజ్‌లో జియోఫిజికల్ పరీక్షలు
- పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం ఆధ్వర్యంలో నిర్వహణ
- పరీక్షలను పరిశీలించిన రాష్ట్ర డ్యామ్‌సేఫ్టీ ఆర్గనైజేషన్ అధికారులు



జియో రాడార్ యంత్రంతో పియర్‌ల వెంట్‌పై పరీక్షలు జరుపుతున్న పుణే బృందం సభ్యులు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌లో పుణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు చెందిన ఆరుగురు నిపుణుల బృందం శుక్రవారం జియోఫిజికల్ పరీక్షలు ప్రారంభించింది. గత ఏడాది నవంబర్‌లో బరాజ్‌లో సీపేజీ లీకేజీలు ఏర్పడిన నేపథ్యంలో పలుమార్లు ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూసీ బృందాలు ఇక్కడ పర్యటించాయి. వారు చేసిన సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అన్నారం బరాజ్‌లో సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం నిపుణుడు ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో జియోఫిజికల్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. సీపేజీ లీకేజీలు ఏర్పడిన 26 నుంచి 45వ పియర్స్ వెంట్‌ల వద్ద ఒక్కో వెంట్ మధ్యలో ఒక బోర్‌వెల్ డ్రిల్ వేశారు. శుక్రవారం మొదటి రోజు 34, 35 పియర్‌ల వెంట్ చివరన డ్రిల్ రంధ్రంలోకి జియో రాడార్ యంత్రం సాయంతో ఒక కేబుల్ వైర్ పంపించి 'పార్లర్ సెస్ పిక్ వేవ్ మెథడ్'ద్వారా భూగర్భంలోని 25 మీటర్ల లోతున పరిస్థితి ఎలా ఉంది? భూమి కుంగిందా? బొరియలు ఏర్పడ్డాయా లేదా అనేది స్కానింగ్ తీస్తున్నారు. ఒక్కో పియర్ మధ్య 15 మీటర్ల పొడవున అత్యాధునిక యంత్రంతో తనిఖీలు చేస్తున్నారు. బరాజ్ పొడవునా 66 గేట్ల దూరం వరకు పరీక్షలు చేపట్టనున్నారు. బరాజ్‌లో మొత్తం భూగర్భంలో పియర్ కిందిభాగంలో ఇసుక, మట్టి కుంగకుండా 5 వేలకుపైగా సీకెంట్ ఫైల్స్‌ను అమర్చారు. ఇవి ఏమైనా చెల్లాచెదురయ్యాయా? లీకేజీలు ఎలా ఏర్పడ్డాయి అనేది జియో రాడార్ యంత్రం నుంచి వచ్చే చిత్రాల ద్వారా గుర్తించనున్నట్టు ఇంజనీరింగ్ అధికారులు చెపుతున్నారు. మరో పదిరోజుల పాటు ఈ బృందం పరీక్షలను నిర్వహించనుందని ప్రాజెక్టు ఇంజనీర్లు చెబుతున్నారు. ఈ పరీక్షల ఆధారంగా మరమ్మతులు ఎలా చేయాలనేది తెలుస్తుందని వెల్లడించారు. ఈ పరీక్షల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.13 కోట్లను మంజూరు చేసింది. రాష్ట్ర డ్యామ్‌సేఫ్టీ ఆర్గనైజేషన్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు డిప్యూటీ సీఈ నాగలక్ష్మి, ఈఈ శ్రీలత, డిప్యూటీ ఈఈ సతీష్‌కుమార్‌లు.. పుణే బృందం పరీక్షలు జరుపుతున్న విధానాన్ని, పద్ధతులను పరిశీలించారు.

మళ్లీ నయీం ముఠా ఆనవాళ్లు
బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని, నయీం ముఠా ఆనవాళ్లు మళ్లీ కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమైన రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ప్రవీణ్ కుమార్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. హోం, విద్య మంత్రిత్వ శాఖల్ని రేవంత్ రెడ్డి చూస్తున్నా జరగకూడని ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. చెంచు మహిళలపై వారం రోజులుగా పోలీసు స్టేషన్‌లో అత్యాచారం జరుగుతుంటే వ్యవస్థ ఏం చేస్తోందని ప్రవీణ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతల పరిరక్షణకు బీఆర్ఎస్ పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. కొల్లాపూర్‌లో శాంతిభద్రతలు దిగజారిపోయాయని, చెంచు మహిళపై అత్యాచార ఘటనపై ప్రభుత్వం స్పందించాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లాలో అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నా సీఎం స్పందించడం లేదని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు.

భర్తకు ఫోన్ చేసి...!

- ఆ వెంటనే బలవన్మరణానికి పాల్పడిన ఎమ్మెల్యే సత్యం భార్య రూపాదేవి
- అనారోగ్య సమస్యలు కారణమంటున్న కుటుంబసభ్యులు
- సత్యంది ప్రేమవివాహం.. దంపతులకు ఇద్దరు పిల్లలు



రూపాదేవి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సత్యం (ఇన్‌సెట్‌లో) రూపాదేవి

సాక్షిప్రతినిధి, కరీంనగర్ /అల్వాల్ /గాంధీఆస్పత్రి/మేడ్చల్: రూపాదేవి(40) తన భర్త ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాతే ఆత్మహత్య చేసుకుంది. గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంట్లో తల్లి, ఇద్దరు పిల్లలు ఉండగానే రూపాదేవి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఎంతకూ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన రూపాదేవి తల్లి భూలక్ష్మమ్మ డోర్ తీయడానికి ప్రయత్నించినా రాలేదు. దీంతో స్థానికుల సాయంతో తలుపులు తీయగా, అప్పటికే రూపాదేవి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్య సమస్యలతో తన కూతురు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని తల్లి భూలక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. చనిపోవడానికి ముందు తన కూతురు భర్తతో మాట్లాడిందని భూలక్ష్మమ్మ చెప్పింది. విషయంగా తెలియగానే నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సత్యం హుటాహుటిన తనే కారు నడుపుకుంటూ సిటీకి బయలుదేరారు. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే సత్యంను మార్గమధ్యలో ఆపి, ఆస్పత్రికి తన కారులో తీసుకొచ్చారు. భార్య మృతదేహాన్ని చూసి ఎమ్మెల్యే బోరున విలపిస్తూ ఒక్కసారిగా కుప్పకూలారు. దీంతో ఆయనకు అదే ఆస్పత్రిలో చికిత్స అందించారు. రూపాదేవి అంత్యక్రియలు శుక్రవారం తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని స్వర్గధామంలో జరిగాయి. గురువారం రాత్రి నుంచి రూపాదేవి అంత్యక్రియలు అయ్యే వరకు పొన్నం ప్రభాకర్ సత్యం వెంటే ఉన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, సుద్దాల దేవయ్య తదితరులు మేడిపల్లి సత్యంను పరామర్శించారు.

పీజీ చదువుతుండగా ప్రేమలో...
రంగారెడ్డి జిల్లాకు చెందిన రూపాదేవి, సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలానికి చెందిన మేడిపల్లి సత్యంలది ప్రేమ వివాహం. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చదువుతున్న సమయంలో హైదరాబాద్‌లో వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అనంతరం కులాంతర వివాహం చేసుకున్న సత్యం దంపతుల కాపురం అన్యోన్యంగా సాగింది. వీరికి కుమారుడు యోజిత్ (11), కుమార్తె రిషిక (9)లు ఉన్నారు. వృత్తిరీత్యా రూపాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వికారాబాద్ నుంచి మేడ్చల్ మండలంలోని రావల్‌కోల్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. రెండు నెలల క్రితం అల్వాల్ పంచశీల కాలనీకి నివాసం మార్చారు.

గురువారమే బయల్దేరిన సత్యం..
చొప్పదండిలో ఎమ్మెల్యేగా గెలవాలని చాలాకాలంగా ప్రయత్నించిన సత్యం 2014, 2018 ఎన్నికల్లో ఓటమి తర్వాత 2023లో ఎట్టకేలకు విజయం సాధించారు. సత్యం కరీంనగర్‌లోని వీపార్క్ సమీపంలో నివాసముంటున్నారు. భార్య టీచర్ కావడంతో పిల్లలతో కలిసి అల్వాల్‌లోనే నివసిస్తున్నారు. గురువారం మధ్యాహ్నమే అల్వాల్ నుంచి సత్యం చొప్పదండి చేరుకున్నారు. రోజంతా నియోజకవర్గ పరిధిలోని మల్యాల మండలంలో షాదీముబారక్ చెక్కుల పంపిణీతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఒకటి రెండుసార్లు మినహా..
సత్యం ఎమ్మెల్యే అయ్యాక రూపాదేవి నియోజకవర్గంలో చాలా తక్కువగా కనిపించేవారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సమయంలో, కొండగట్టు సమీపంలోని నల్లగొండ ఆలయంలో మొక్కులు అప్పజెప్పిన సమయంలో సత్యం సతీసమేతంగా కనిపించారు. ఫిబ్రవరి 23న కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన చిలువేరు నరేశ్ దంపతుల నాలుగు నెలల చిన్నారికి గుండె చికిత్సకు రూ.లక్ష అందజేసిన సమయంలో రూపాదేవి సత్యంతో కలిసి వచ్చారు. ఇటీవల సత్యం దంపతులు, కుటుంబసభ్యులతో కలిసి తిరుపతి, శ్రీశైలం, కాణిపాకం తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించారు. రూపాదేవి సోదరుడు తోట అనిల్ కూడా ఎమ్మెల్యే సత్యం వద్దనే వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్నారు. రూపాదేవి ఆత్మహత్యకు ఆమె అనారోగ్యమే కారణమని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

రావల్‌కోల్‌లో విషాదఛాయలు
మేడ్చల్ మండలం రావల్‌కోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూపాదేవి రెండేళ్లుగా సోషల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె మరణవార్తతో పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్కూల్‌లో ఏనాడు రూపాదేవి వ్యక్తిగత విషయాలు మాట్లాడేవారు కాదని, పేద పిల్లలు బాగా చదవాలని ఆరాటపడేవారని, తోటి ఉపాధ్యాయులు చెప్పారు. రావల్‌కోల్‌కు చెందిన ఓ విద్యార్థిని చదువుకు కూడా ఆమె ఆర్థికసాయం చేశారు. మూడురోజుల క్రితమే సెలవు పెట్టారని, అద్దె ఇంటి నుంచి సొంతింటికి మారుతున్నానని తనతో చెప్పారని హెచ్ఎం తెలిపారు.

గాంధీలో పోస్టుమార్టం
రూపాదేవి మృతదేహానికి సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్ఓడీ ప్రొఫెసర్ కృపాల్‌సింగ్ నేతృత్వంలో వైద్యుల బృందం శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించింది. చిలకలగూడ ఎస్‌హెచ్ఓ అనుదీప్ భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ రాజయ్య, పలువురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు గాంధీమార్చురీకి చేరుకుని రూపాదేవి మృతదేహం వద్ద నివాళులర్పించి మేడిపల్లి సత్యం, కుటుంబసభ్యులను పరామర్శించారు.

హాస్టల్‌లో ఉండలేక.. పారిపోయేందుకు ప్రయత్నం

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి



గిరీశ్‌కుమార్

హయత్‌నగర్ (హైదరాబాద్): కళాశాల హాస్టల్‌లో ఉండలేక గోడదూకి పారిపోయేందుకు ప్రయత్నించిన ఓ విద్యార్థి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ర్యాంకుల కోసం విద్యార్థులపై కార్పొరేట్ యాజమాన్యాల ఒత్తిడికి నిదర్శనంగా నిలిచిన ఈ హృదయ విదారకమైన సంఘటన గురువారం హయత్‌నగర్ పీఎస్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తెనాలికి చెందిన ఎ.విజయ్‌కుమార్ వ్యాపారం చేసుకుంటూ నగరంలోని ఈస్ట్ మారేడ్‌పల్లిలో నివాసముంటున్నారు. ఆయనకు ఓ కొడుకు, కూతురు సంతానం. కొడుకు గిరీశ్‌కుమార్ (15)ను ఇంటర్ మొదటి సంవత్సరం చదివించేందుకు పది రోజుల కిందట హయత్‌నగర్ పీఎస్ పరిధిలోని కోహెడ వద్ద ఉన్న నారాయణ జూనియర్ కళాశాల హాస్టల్‌లో చేర్పించాడు. ఇక్కడ చదవడం ఇష్టం లేని విద్యార్థి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. దీంతో రెండ్రోజుల కిందట వచ్చిన తల్లి కొడుకును బుజ్జగించి, మళ్లీ వచ్చి తీసుకెళ్తానని నచ్చజెప్పి వెళ్లింది. ఈ క్రమంలో హాస్టల్ నుంచి వెళ్లిపోవాలని భావించిన గిరీశ్‌కుమార్ బుధవారం రాత్రి కళాశాల నుంచి మెట్ల మార్గం ద్వారా బయటకు వెళ్లాడు. విద్యార్థి కనిపించక పోవడంతో నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి తర్వాత కాలేజీ ప్రహరీ పక్కన గిరీశ్ మృతదేహాన్ని గుర్తించిన కాలేజీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఒంటరిగా బయటికి వచ్చిన విద్యార్థి హాస్టల్ గోడ దూకి పారిపోయేందుకు ప్రహరీ గోడ ఎక్కాడని, గోడ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే గిరీశ్ చనిపోయాడని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.






అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో యోగాభ్యాసం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, సియాచిన్‌లో ఆర్మీ సిబ్బంది, న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో ఔత్సాహికులు, శ్రీనగర్‌లో ప్రధాని మోదీ యోగాసనాలు

జైల్లోనే కేజ్రీవాల్

- బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే
- రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరికొన్ని రోజులు తీహార్ జైల్లోనే ఉండనున్నారు. ఈ కేసులో ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. రెగ్యులర్ బెయిల్ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్, జస్టిస్ రవీందర్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. ట్రయల్ కోర్టులో వాదనలు వినిపించడానికి సరైన అవకాశం లభించలేదన్నారు. తమ వాదనల సమయంలో రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి తొందరపెట్టారని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఈ కేసులో వాస్తవాలను న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకోలేదన్నారు. బెయిల్‌ను రద్దు చేయడానికి ఇంతకంటే మంచి కేసు ఇంకొకటి ఉండదన్నారు. అనంతరం ట్రయల్ కోర్టు తీర్పుపై మధ్యంతర స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ''ట్రయల్ కోర్టు ఆర్డర్‌పై స్టే కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వివరణాత్మక ఆదేశాల నిమిత్తం తీర్పు రిజర్వ్ చేస్తున్నాం. మొత్తం రికార్డులను పరిశీలించాల్సి ఉంది కాబట్టి మరో రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తాం. అప్పటివరకూ ట్రయల్ కోర్టు ఆదేశాల అమలుపై మధ్యంతర స్టే విధిస్తున్నాం'' అని వెల్లడించింది. ఈడీ పిటిషన్‌పై స్పందించాలంటూ కేజ్రీవాల్‌కు నోటీసు జారీ చేసింది.

నీట్ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీం నో

సాక్షి, న్యూఢిల్లీ: జూలై 6 నుంచి జరగాల్సిన నీట్ యూజీ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. నీట్ పరీక్షలో అక్రమాలపై దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రధాన పిటిషన్లపై విచారణను కోర్టు ఇప్పటికే జూలై 8కి వాయిదా వేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్‌ను కూడా ఆ తేదీ దాకా వాయిదా వేయాలని పిటిషనర్లు కోరారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీతో కూడిన వెకేషన్ బెంచ్ శుక్రవారం అందుకు నిరాకరించింది. విచారణను జూలై 8వ తేదీకి వాయిదా వేసింది.

ఏడేళ్లు.. 70 లీకేజీలు

ప్రహసనంగా మారిన పరీక్షలు | దేశవ్యాప్తంగా 1.7 కోట్ల బాధితులు

నీట్ వంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం నానాటికీ పెరిగి పెద్దదవుతోంది. రోజుకోటి చొప్పున సంచలనాత్మక విషయాలు బయట పడుతూ దేశమంతటినీ కుదిపేస్తున్నాయి. మరోవైపు యూజీసీ–నెట్ ప్రశ్నపత్రం లీకైనట్టు తేలడంతో ఆ పరీక్షే రద్దయింది. వీటి దెబ్బతో దేశవ్యాప్తంగా ప్రవేశ, పోటీ పరీక్షల సమగ్రత, విశ్వసనీయతపై మరోసారి నీలినీడలు కమ్ముకున్న దుస్థితి! నిజానికి ప్రశ్నపత్రాల లీకేజీ మన దేశాన్ని ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న జాడ్యమే. గత ఏడేళ్లలో 15 రాష్ట్రాల పరిధిలో ఏకంగా పలురకాలైన 70 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు లీకవడం సమస్య తీవ్రతకు, భారత్‌లో పరీక్షలపై పేపర్ లీకేజీ మాఫియాకు ఉన్న తిరుగులేని పట్టుకు అద్దం పడుతోంది. ఇవన్నీ అధికారికంగా వెలుగులోకి వచ్చినవి, దర్యాప్తు జరిగిన, జరుగుతున్న కేసులు మాత్రమే. అసలు వెలుగులోకే రాకుండా పకడ్బందీగా జరిగిపోయిన ప్రవేశ, పోటీ పరీక్షల లీకేజీ ఉదంతాలు ఇంకా ఎన్నో రెట్లుంటాయని విద్యా రంగ నిపుణులే అంటున్నారు! వాటి ద్వారా ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు, ప్రభుత్వోద్యోగాలు కొట్టేసిన అనర్హులు వేలు, లక్షల్లో ఉంటారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్–యూజీ పేపర్ లీక్ కావడంతో 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం అయోమయంలో పడింది. ఇలా గత ఏడేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 70 పరీక్షల పేపర్లు లీకయ్యాయి. వాటికి 1.7 కోట్ల మందికి పైగా ఉన్నత విద్యార్థులు, ఉద్యోగార్థుల కలలు కల్లలైపోయాయి. రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, బిహార్, గుజరాత్, కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పలు పెద్ద రాష్ట్రాలతో పాటు హరియాణా వంటి చిన్న రాష్ట్రాల్లో కూడా తరచూ పలు ప్రవేశ, పోటీ పరీక్షల పేపర్లు లీకవుతున్నాయి. ఈ లీకేజీ భూతం ఉన్నత విద్యకు, భారీ స్థాయి నియామక పరీక్షలకే పరిమితం కాలేదు. పదో తరగతి వంటి స్కూలు పరీక్షలకు కూడా పాకి కలవరపెడుతోంది. బిహార్‌లో పదో తరగతి ప్రశ్నపత్రాలు గత ఏడేళ్లలో ఆరుసార్లు లీకయ్యాయి. పశ్చిమ బెంగాల్లోనైతే స్టేట్ బోర్డు పరీక్ష పత్రాలు గత ఏడేళ్లలో ఏకంగా పదిసార్లు లీకయ్యాయి. తమిళనాడులో 2022లో 10, 12 తరగతుల ప్రశ్నపత్రాలు లీకై కలకలం రేపాయి.



ఆ రాష్ట్రాల్లో అంతే...!

రాజస్తాన్, గుజరాత్ వంటి రాష్ట్రాలు కొన్నేళ్లుగా పరీక్షల లీకేజీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాయంటే అతిశయోక్తి కాదు. 2015–23 మధ్య రాజస్తాన్‌లో పలు పోటీ పరీక్షలకు సంబంధించి 14కు పైగా పేపర్లు లీకేజీ బారిన పడ్డాయి. 2022 డిసెంబర్లో సీనియర్ గవర్నమెంట్ స్కూల్ టీచర్ల నియామకానికి సంబంధించి జనరల్ నాలెడ్జ్ ప్రశ్నపత్రం లీకవడంతో ఆ పరీక్షనే రద్దు చేయాల్సి వచ్చింది. యూజీసీ నెట్, పోలీస్ రిక్రూట్‌మెంట్ గత రెండేళ్లు వరుసగా లీకయ్యాయి. గుజరాత్‌లోనూ గత ఏడేళ్లలో 14 లీకేజీ ఉదంతాలు నమోదయ్యాయి. సీపీఎస్సెస్సీ చీఫ్ ఆఫీసర్ పరీక్ష (2014), తలటీ పరీక్షలు (2015, 2016), టీచర్స్ యాప్టిట్యూడ్ టెస్ట్ (2018), ముఖ్య సేవిక, నాయబ్ చిట్నీస్, డెక్ లోక్ రక్షక్ దళ్, నాన్ సచివాలయ క్లర్క్స్, హెడ్ క్లర్క్, సీఎస్ఎస్సెస్సీ (2021), సబ్ ఆడిటర్ (2021), ఫారెస్ట్ గార్డ్ (2022), జూనియర్ క్లర్క్ (2023), వంటి పలు పరీక్షలు ఈ జాబితాలో ఉన్నాయి. యూపీలో కూడా 2017–24 మధ్య కనీసం 9 లీకేజీ కేసులు వెలుగు చూశాయి. ఇన్‌స్పెక్టర్ ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్‌పరీక్ష (2017), యూపీ టెట్ (2021), 12వ తరగతి బోర్డు పరీక్ష వంటివి వీటిలో ముఖ్యమైవి. తాజాగా ఈ ఏడాది జరిగిన కానిస్టేబుల్ పేపర్ లీకేజీ ఏకంగా 48 లక్షల మంది దరఖాస్తుదారులను ఉసూరుమనిపించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

అమల్లోకి పేపర్ లీక్ నిషేధ చట్టం

నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: పేపర్ లీకేజీల కట్టడికి ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అనైతిక కార్యకలాపాల నిరోధ) చట్టం, 2024ను అమల్లోకి తెస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నీట్, యూజీసీ–నెట్ పేపర్ల లీకేజీ వివాదాలు దేశవ్యాప్తంగా కాక రేపుతున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని నోటిఫై చేస్తూ శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. పేపర్ల లీకేజీ ఉదంతాల్లో శిక్షలను కఠినతరం చేస్తూ గత ఫిబ్రవరిలో పార్లమెంటు ఈ చట్టం చేయడం తెలిసిందే. దీని ప్రకారం లీకేజీ కేసుల్లో మూడు నుంచి పదేళ్ల జైలు, రూ.కోటి దాకా జరిమానా విధించవచ్చు. యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వేలు, బ్యాంకింగ్ పరీక్షలతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే అన్ని కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు ఈ చట్టం వర్తిస్తుంది.

ప్రపంచ శ్రేయస్సుకు యోగా శక్తివంతమైన సాధనం: మోదీ

శ్రీనగర్: యోగాను ప్రపంచ శ్రేయస్సుకు పనిచేసే శక్తివంతమైన ఉపకరణంగా నేడు అందరూ భావిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మరింత మంది పర్యాటకులను ఆకర్షించడం ద్వారా జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థను మార్చే సామర్థ్యం యోగాకు ఉందన్నారు. ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో యోగాను 50 వేల నుంచి 60 వేల మంది వరకు సాధన చేస్తుండటం సాధారణ విషయం కాదని తెలిపారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఎస్‌కేఐసీసీ)లో జరిగిన కార్యక్రమంలో మోదీ పాల్గొని ప్రసంగించారు. 'దేవుడు, ఈశ్వరుడు లేదా అల్లాను చేరుకునే ఆధ్యాత్మిక ప్రయాణంగా యోగా గురించి సాధారణంగా చెబుతుంటారు. ఆధ్యాత్మిక కోణాన్ని వదిలేసి ప్రస్తుతానికి, మనం వ్యక్తిగత అభివృద్ధి కోసం యోగాపై దృష్టి పెట్టి, దానిని జీవితంలో ఒక భాగంగా ఆచరించవచ్చు. అలా చేస్తే ఎన్నో లాభాలు ఉన్నాయి. వ్యక్తిగత అభివృద్ధి సమాజ శ్రేయస్సుకు..అంతిమంగా అది మానవాళి శ్రేయస్సుకు దారితీస్తుంది'' అని చెప్పారు.

సియాచిన్‌లోనూ యోగా డే

రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, అధికారులు యోగా చేశారు. పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, ఎస్.జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు దేశవ్యాప్తంగా పలుచోట్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. సియాచిన్‌లో, రాజస్తాన్‌లోని థార్ ఎడారిలో, సముద్రంలో విమానవాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యపై సైనికులు యోగా చేశారు. తమిళనాడులోని రామేశ్వరంలో సాయుధ సిబ్బంది జల యోగ చేశారు. ఈ ఏడాది యోగా డే ఇతివృత్తం 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ'.

ప్రపంచ దేశాల్లో యోగా దినోత్సవం

న్యూఢిల్లీ/న్యూయార్క్/టెల్అవీవ్: అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ప్రపంచవ్యాప్తంగా ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీతోపాటు న్యూయార్క్‌లో పలు కార్యక్రమాలు జరిగాయి. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్‌లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు జరిగాయి. అత్యధిక ఉష్ణోగ్రతలను లెక్క చేయకుండా జనం వేలాదిగా పాల్గొన్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్‌లోని టెల్అవీవ్‌లో జరిగిన కార్యక్రమంలో 300 మంది పాల్గొన్నారు. సింగపూర్‌లో ఆరోగ్య శాఖ మంత్రి రహయు మహజం ఆధర్యంలో జరిగిన కార్యక్రమంలో 200 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. నేపాల్‌లోని పొఖారా, బుద్ధుడి జన్మస్థలం లుంబినిలో యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. శ్రీలంక రాజధాని కొలంబో, చైనా రాజధాని బీజింగ్, ఫ్రాన్సు రాజధాని పారిస్, మాల్దీవులు రాజధాని మాలె, ఇటలీ రాజధాని రోమ్, సౌదీ రాజధాని రియాద్, కువైట్, మలేసియా, ఇండోనేసియాలో, స్వీడన్ రాజధాని స్టాక్‌హోం, లండన్‌లోని ట్రఫాల్గర్ స్క్వేర్‌లోనూ యోగా కార్యక్రమాలు జరిగాయి.

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్ష వాయిదా

పరీక్ష పత్రం లీకేజీ ఆరోపణలతో నిర్ణయం

న్యూఢిల్లీ: సీఎస్ఐఆర్–యూజీసీ–నెట్ ఉమ్మడి పరీక్ష వాయిదా పడింది. వచ్చే వారం జరగాల్సిన ఈ పరీక్షను అనివార్య పరిస్థితులు, రవాణాపరమైన ఇబ్బందుల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) శుక్రవారం తెలిపింది. పరీక్ష తదుపరి తేదీని వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని వివరించింది. అయితే, పేపర్ లీకైందంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలోనే పరీక్షను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. సీఎస్ఐఆర్–యూజీసీ–నెట్ పరీక్షను జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తారు. మంగళవారం నిర్వహించిన యూజీసీ నెట్‌ను కూడా అవకతవకల ఆరోపణల నేపథ్యంలో రద్దు చేయడం తెల్సిందే.

కెనడాలో ఖలిస్తానీల 'సిటిజన్స్ కోర్ట్'

తీవ్ర అభ్యంతరం తెలిపిన భారత్

న్యూఢిల్లీ: కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాదులు మరోసారి రెచ్చిపోయారు.వాంకోవర్‌లో ఉన్న భారత కాన్సులేట్ ఎదురుగా రెండు రోజుల క్రితం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడంతోపాటు 'సిటిజన్స్ కోర్ట్'ను నిర్వహించారు. ఈ వ్యవహారంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్‌లోని కెనడా హై కమిషన్‌కు డిప్లొమాటిక్ నోట్ ద్వారా అభ్యంతరం తెలిపింది. ఖలిస్తానీ శక్తుల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రూడో ప్రభుత్వం వేర్పాటువాదులకు దన్నుగా నిలుస్తోందని ఆరోపించింది. గతేడాది జరిగిన నిజ్జర్ హత్యకు భారత్ ఏజెంట్లే కారణమన్న కెనడా ప్రధాని ట్రూడో తీవ్ర ఆరోపణలతో రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

హజ్ యాత్ర మృతుల్లో... 98 మంది భారతీయులు

న్యూఢిల్లీ: సౌదీ అరేబియాలోని మక్కాకు హజ్ యాత్రకు వెళ్లిన భారతీయుల్లో 98 మంది చనిపోయినట్లు విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. గత ఏడాది హజ్ యాత్ర సమయంలో మొత్తం 187 మంది భారతీయులు చనిపోయినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వివరించారు. 'ఈ ఏడాది మే 9 నుంచి జూలై 22వ తేదీ వరకు జరగాల్సిన హజ్ యాత్రలో 1.75 లక్షల మందికి గాను ఇప్పటి వరకు 98 మరణాలు నమోదయ్యాయి. ఈ మరణాలన్నీ దీర్ఘకాలిక అనారోగ్యం, వృద్ధాప్యం వంటి సహజ కారణాలతో సంభవించినవే. అరాఫత్ రోజున ఆరుగురు మరణించారు. ప్రమాదాల్లో మరో నలుగురు చనిపోయారు'' అని జైస్వాల్ మీడియాకు వివరించారు.

ఢిల్లీలో ఆప్ జలదీక్ష

నిరాహార దీక్షకు దిగిన మంత్రి ఆతిశీ సింగ్

న్యూఢిల్లీ: నీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్న ఢిల్లీ వాసుల కష్టాలు తీర్చాలంటూ ఆప్ నేత, ఢిల్లీ మంత్రి ఆతిశీ సింగ్ శుక్రవారం నిరాహార దీక్ష చేపట్టారు. యమునా నది అదనపు జలాలను హరియాణా తక్షణం ఢిల్లీకి విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. రాజ్‌ఘాట్‌లో గాంధీజీకి నివాళులర్పించి దీక్ష మొదలెట్టారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ తదితరులు ఆమెకు మద్దతుగా దీక్షలో కూర్చున్నారు. దీక్షకు మద్దతుగా తిహార్ జైలు నుంచి కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని సునీత చదివి వినిపించారు. ''ఆతిశి తపస్సు విజయవంతమవుతుంది. గొంతెండుతున్న వారి దప్పిక తీర్చడం మన సంప్రదాయం. తీవ్రమైన ఎండకాలంలో పొరుగు రాష్ట్రాలు నీళ్లిచ్చి ఆదుకోవాలి. హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం నీటిని విడుదలచేయకుండా ఆపి ఢిల్లీ ప్రజలు ఆప్ ప్రభుత్వాన్ని తిట్టుకునేలా చేయాలని మోదీ సర్కారు కుట్ర పన్నింది'' అని అందులో కేజ్రీవాల్ ఆరోపించారు. ''నీటి సమస్యపై మోదీకి లేఖ రాశా. హరియాణా ప్రభుత్వాన్ని వేడుకున్నా. ఢిల్లీ ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, మహిళల నీటి సమస్యలు చూడలేక నీటి సత్యాగ్రహానికి సిద్ధపడ్డా'' అని ఆతిశి ప్రకటించారు. రోజూ 613 లక్షల గ్యాలెన్ల నీటిని విడుదలచేసే హరియాణా గత రెండు వారాలుగా కేవలం 513 లక్షల గ్యాలెన్ల నీటినే రోజూ విడుదలచేస్తోంది. గత రెండు రోజులుగా మరో 120 లక్షల గ్యాలెన్ల మేర కోత పెట్టింది.

విమర్శించిన బీజేపీ

దీక్షను రాజకీయ నాటకంగా బీజేపీ అభివర్ణించింది. ''ఆతిశి విఫల మంత్రి. నీటి కష్టాలు తప్పవని ఫిబ్రవరిలోనే సూచనలు కనిపించినా ముందస్తు ఏర్పాట్లు చేయలేదు. ఎగువ హిమాచల్ ప్రదేశ్ నుంచో, ఆప్ పాలిత పంజాబ్ నుంచి ఎందుకు నీళ్లు అడగటం లేదు? ఢిల్లీ నీటి ట్యాంకర్ మాఫియాతో ఆప్ నేతలకు సంబంధముంది'' అని ఆరోపించింది.



నిరాహార దీక్షలో ఆతిశీ సింగ్, పక్కన సునీత కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్

నా భర్త ఏమన్నా మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదా: సునీతా కేజ్రీవాల్

తన భర్త ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అన్నట్లుగా ఈడీ వ్యవహరిస్తోందని కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆయన బెయిల్‌ను హైకోర్టులో సవాలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ''బెయిల్ ఉత్తర్వు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కూడా కాకముందే తెల్లవారుజామునే ఈడీ హైకోర్టును ఆశ్రయించిందని ఆక్షేపించారు. కేజ్రీవాల్ ఏమైనా ఉగ్రవాదా?'' అంటూ దీక్షా స్థలి వద్ద మండిపడ్డారు.

తమిళనాట 50కి చేరిన మద్యం మృతులు

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లాలో కల్తీ మద్యం తాగి చనిపోయిన వారి సంఖ్య పెరుగుతోంది. శుక్రవారం మరో 10 మంది చనిపోవడంతో మొత్తం మరణాలు 50కి చేరాయి. అలాగే, సారా తాగి అస్వస్థతకు గురై ఆస్పత్రికి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్న మరో ఇద్దరు కూడా మరణించడంతో ఆ సంఖ్య 50ని దాటింది. అయితే, వీరి మరణంపై అధికారులు విచారణ చేపట్టారు. దీంతోపాటు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల్లో 30 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు కల్తీ సారా మరణాల ఘటనపై సీబీఐతో విచారణ చేయించాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం మద్రాసు హైకోర్టు విచారణ చేపట్టింది.

దద్దరిల్లిన అసెంబ్లీ

కళ్లకురిచ్చి ఉదంతంపై శుక్రవారం అసెంబ్లీ దద్దరిల్లింది. విపక్ష ఏఐఏడీఎంకే సభ్యులు నినాదాలు చేశారు. కల్తీ మద్యం తాగి 50 మంది వరకు మృతి చెందడంపై సభలో చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారంటూ స్పీకర్ అప్పావు వారిని మార్షల్స్‌తో బయటకు పంపించి వేశారు. ఈ ఆందోళనల్లో ఏఐఏడీఎంకేలోని మాజీ సీఎం పన్నీరు సెల్వం వర్గం సభ్యులు పాల్గొనక పోవడం గమనార్హం.

గ్రాడ్యుయేట్లకు అమెరికా గ్రీన్ కార్డు: ట్రంప్

వాషింగ్టన్: జాతీయవాదిగా, వలసలను వ్యతిరేకించే నాయకుడిగా పేరుగాంచిన అమెరికా రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన ధోరణి మార్చుకున్నారు. అమెరికాలో చదువుకొనే విదేశీ విద్యార్థులకు తీపి కబురు చెప్పారు. తాజాగా ఆల్–ఇన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. అమెరికా కాలేజీల్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులకు ఆటోమేటిక్‌గా గ్రీన్ కార్డులు అందించే విధానం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గ్రాడ్యుయేషన్ చదివిన తర్వాత సొంత దేశాలకు తిరిగి వెళ్లిపోవాల్సిన అవసరం ఉండదని, అమెరికాలోనే ఉండొచ్చని వెల్లడించారు. జూనియర్ కాలేజీల్లో చదువుకున్నవారికి సైతం గ్రీన్‌కార్డులు ఇస్తామన్నారు. ఇండియా, చైనా దేశాల విద్యార్థులు అమెరికా కాలేజీల్లో చదువుకొని, స్వదేశాలకు తిరిగివెళ్లి మళ్లీ బిలియనీర్లుగా పైకి ఎదుగుతున్నారని, పరిశ్రమలు స్థాపించి, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. వారు ఇక్కడే ఉండేలా చేస్తే అమెరికాకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ మరోసారి బరిలోకి దిగుతుండటం తెలిసిందే.

ఉక్రెయిన్‌కు ఆయుధాలిస్తే ఊరుకోం

దక్షిణ కొరియాకు రష్యా అధినేత పుతిన్ హెచ్చరిక



హనోయి: తమ శత్రు దేశమైన ఉక్రెయిన్‌కు ఆయుధాలు అందజేసే ఆలోచన ఉంటే వెంటనే మానుకోవాలని రష్యా అధినేత పుతిన్ దక్షిణ కొరియాకు హెచ్చరికలు జారీ చేశారు. ''ఉక్రెయిన్‌కు ఆయుధాలిస్తే అది అతి పెద్ద తప్పిదం అవుతుంది. రష్యాపై దాడులకు ఉక్రెయిన్‌కు సహకరిస్తే తీవ్ర పరిణామాలుంటాయి. దక్షిణ కొరియాకు మింగుడు పడని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది'' అని వియత్నాం పర్యటనలో ఉన్న పుతిన్ మీడియాతో అన్నారు.

కొత్త నేర చట్టాల అమలును ఆపండి

పార్లమెంట్‌లో మళ్లీ సమీక్షించండి ● మోదీకి మమత లేఖ




న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో హడావిడిగా ప్రవేశపెట్టి ఆమోదించిన మూడు కొత్త నేర చట్టాలను జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకిరాకుండా ఆపాలని ప్రధాని మోదీకి తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత చట్టాలపై మోదీకి ఆమె లేఖ రాశారు.

మరో ఆర్నెల్లు నడ్డాయే బీజేపీ చీఫ్?



సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా మరో ఆరు నెలలు కొనసాగనున్నారు. ఈ ఏడాది మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలున్న విషయం తెలిసిందే. వాటి నిర్వహణ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. అవి ముగిసేదాకా నడ్డాను కొనసాగించాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించినట్టు తెలుస్తోంది. కేంద్రంలో నరేంద్ర మోదీ 3.0 ప్రభుత్వంలో నడ్డా కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడం తెలిసిందే. పార్టీ రోజువారీ వ్యవహారాలు చూసేందుకు జాతీయ ప్రధాన కార్యదర్శులు సునీల్ బన్సల్, వినోద్ తావ్డేల్లో ఒకరిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తారంటున్నారు.

రాజీనామా వార్తలు అబద్ధం: అధీర్



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేసినట్లుగా వస్తున్న వార్తలను అధీర్ రంజన్ చౌదరి ఖండించారు. 'కాంగ్రెస్ నియమావళి ప్రకారం పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేత పీసీసీ చీఫ్‌లను నియమిస్తారు. అప్పటి దాకా మేమంతా తాత్కాలిక చీఫ్‌లమే. బెంగాల్ పీసీసీకి కొత్త చీఫ్‌ను నియమించేదాకా కొనసాగుతా'' అని తెలిపారు. బెంగాల్ సహా అన్ని రాష్ట్రాలకు కొత్త పీసీసీ చీఫ్‌లు రావచ్చని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మిర్ అన్నారు.

తజికిస్తాన్‌లో హిజాబ్‌పై నిషేధం

దుషాంబె: 96 శాతం ముస్లిం జనాభా ఉన్న మధ్య ఆసియా దేశం తజికిస్తాన్‌లో మహిళలు హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. హిజాబ్ ధరిస్తే రూ.5 లక్షల వరకు జరిమానా తప్పదని రంజాన్ మాసంలో పెద్దల నుంచి చిన్నారులు డబ్బులు తీసుకొనే సంప్రదాయాన్ని కూడా నిషేధించింది. దీనికి కూడా భారీ జరిమానా తప్పదని హెచ్చరించింది.

రేణుకస్వామి కేసులో ఏ1గా పవిత్ర!

హత్య కేసులో కొత్త మలుపు

బెంగళూరు: కన్నడ నటి పవిత్ర గౌడను ఆన్‌లైన్‌లో వేధించాడన్న పట్టరాని కోపంతో రేణుకస్వామి అనే చిరుద్యోగిని నటుడు దర్శన్ తూగుదీప, అతని అనుచరులు హతమార్చారన్న కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. దర్శన్ సన్నిహిత నటి పవిత్ర గౌడను ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా పేర్కొంటూ పోలీసులు గురువారం బెంగళూరులో 24వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట రిమాండ్ రిపోర్ట్‌ను సమర్పించారు. స్వామికి కరెంట్ షాక్ ఇచ్చి హింసించామని ఇప్పటికే అరెస్టయిన ఒక నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. ఈ వివరాలను రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు ప్రస్తావించారు. హత్య తర్వాత అరెస్ట్, కేసు నుంచి తప్పించుకునేందుకు, మృతదేహాన్ని మాయం చేసి ఆధారాలను ధ్వంసంచేసేందుకు దర్శన్ భారీగా ఖర్చుచేశారని, అందుకోసం స్నేహితుడు మోహన్ రాజ్ నుంచి రూ.40 లక్షల అప్పు తీసుకున్నారని పోలీసులు వెల్లడించారు. షాక్ ఇచ్చేందుకు వాడిన ఎలక్ట్రిక్ షాక్ టార్చ్‌ను, ఆ రూ.40 లక్షల నగదును పోలీసులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. దర్శన్, మరో ముగ్గురిని పోలీస్ కస్టడీకి, పవిత్ర గౌడను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని కోర్టును పోలీసులు కోరారు.



ఘటనాస్థలిలో చెప్పులతో కొట్టిన పవిత్ర

చిత్రదుర్గ ప్రాంతంలో రేణుకస్వామిని కిడ్నాప్ చేసి 200 కి.మీ.ల దూరంలోని బెంగళూరుకు తీసుకొచ్చి షెడ్‌లో కట్టేసి కొట్టేటపుడు నటి పవిత్ర గౌడ అక్కడే ఉన్నారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆమె కూడా రేణుకస్వామిని తన చెప్పులతో కొట్టారని పోలీసులు పేర్కొన్నారు. అసభ్య సందేశాలు పంపిన స్వామికి బుద్ధి చెప్పాలని అక్కడే ఉన్న దర్శన్‌ను పవిత్ర ఉసిగొల్పిందని ఆయా వర్గాలు వెల్లడించాయి. రేణుకస్వామి పోస్ట్‌మార్టమ్‌లో కొత్త విషయాలు వెల్లడయ్యాయి. సున్నిత అవయవాలపై దాడితో వృషణాలు చితికిపోయాయని, ఒక చెవి కనిపించలేదని నివేదిక పేర్కొంది. రేణుకస్వామి గతంలో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి డిలీట్‌చేసిన మెసేజ్‌లను వెలికి తీసివ్వాలని దాని మాతృ సంస్థ 'మెటా'ను పోలీసులు కోరారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 22 । జూన్ । 2024



.. వేలాదిగా తరలివచ్చిన జనం

ఇళ్ల స్థలాలు ఇస్తున్నారంటూ ప్రచారం చేయడంతో మియాపూర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు జనం భారీగా తరలివచ్చారు. -8లో

రౌడీలపై డేగ కన్ను!

నగరంలో ఇటీవల చోటు చేసుకున్న కొన్ని పరిణామాలతో రౌడీషీటర్లపై కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. -10లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0/25.0

నగరంలో ఆకాశం మేఘాలతో ఆవరించి ఉంటుంది. తేలికపాటి జల్లులు పడవచ్చు. గరిష్ఠ ఉష్ణోగ్రత 34 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 25 డిగ్రీలు ఉండే అవకాశం ఉంది.

యోగ భాగ్యం





సంజీవయ్య పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో యోగా చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ





నిజాం కాలేజీ గ్రౌండ్‌లో యోగాసనాలు వేస్తున్న ఔత్సాహికులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు





భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగం. ఆరోగ్యకర జీవన విధానానికి యోగా ఒక అమోఘమైన సాధనం.. అందరూ యోగా చేయాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. నగరంలోని నిజాం కళాశాల మైదానంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు.

నేరాల నిరోధానికి ప్రచార రథం

- ప్రత్యేక వాహనం సిద్ధం చేసిన హెచ్‌సీఎస్‌సీ
- ఆవిష్కరించిన కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: నగరవాసులు నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేసేందుకు హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) ప్రచార రథాన్ని రూపొందించింది. ఆడియో, వీడియో విధానంలో ప్రచారం చేసే దీన్ని శుక్రవారం నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రజల్లో అవగాహన పెంచడం, నేరాల సంఖ్యను తగ్గించడం, సిటీని సురక్షిత ప్రాంతంగా మార్చడమే లక్ష్యంగా దీనికి రూపమిచ్చారు. ఈ వాహనం కోసం మైండ్ స్పేస్ రహేజా సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) పథకం కింద నిధులు అందించింది. ×ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత, మహిళా సంక్షేమం, యాంటీ నార్కోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఫిజికల్ సెక్యూరిటీ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ వాహనం ఉపకరిస్తుంది¤ అని కొత్వాల్ అన్నారు. కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, హెచ్‌సీఎస్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉస్మానియా'కు చికిత్స చేయాలి

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



అఫ్జల్‌గంజ్: ఎంతో ఘన చరిత్ర ఉన్న ఉస్మానియా ఆస్పత్రికి చికిత్స చేయాల్సిన అవసరముందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం ఆయన ఉస్మానియా ఆస్పత్రిలో అత్యాధునిక స్కానింగ్ యంత్రం సహా రూ.13.97 కోట్ల విలువైన వైద్య పరికరాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజనర్సింహ్మ మాట్లాడుతూ.. గత పాలకులకు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణంపై ఉన్న శ్రద్ధ ఉస్మానియా దవాఖానాపై లేకుండాపోయిందన్నారు. ఆస్పత్రి కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తానని ఆయన పేర్కొన్నారు. ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఉస్మానియా ఆస్పత్రిలో 1951లో నిర్మించిన జీఎన్ఎం నర్సింగ్ కాలేజీకి హాస్టల్ భవనాన్ని నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. హెల్త్ పాలసీపై త్వరలో కీలకమైన నిర్ణయం తీసుకోబోతున్నామని, ఇందులో భాగంగా ప్రైమరీ, సెకండరీ హెల్త్ విభాగాలను ప్రభుత్వం బలోపేతం చేయాలని నిర్ణయించిందని వివరించారు. రాబోయే తరాలు గుర్తుంచుకునేలా ప్రజా పాలన ఉంటుందని మంత్రి అన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో ఉన్న అన్ని రేట్లను రివైజ్ చేస్తున్నామని, హెల్త్ స్కీమ్స్‌కి సంబంధించిన గ్యాప్స్ ఎక్కడ ఉన్నా వాటిని పరిష్కరిస్తామని రాజనర్సింహ హామీ ఇచ్చారు. కొత్త సెక్రటేరియట్ కట్టడం, పెద్ద పెద్ద విగ్రహాలు పెట్టడం కాకుండా పేద వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు ప్రభాకర్, సురభి వాణీదేవి, ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేందర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: వసతి గృహాల్లోని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు, సంక్షేమ అధికారులు కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన హాస్టల్ నిర్వహణపై సంక్షేమ అధికారులు, నాలుగో తరగతి సిబ్బందికి ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ జిల్లాలో విద్యా వ్యవస్థ బాగుంటుందని తల్లిదండ్రులు తమ పిల్లలను మహాత్మా జ్యోతిబాపూలే వసతి గృహాలకు పంపిస్తున్నారని చెప్పారు. జిల్లాలోని 50 వసతి గృహాల్లో 7 వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వసతి గృహాల సంక్షేమ అధికారులు సామాజిక బాధ్యతగా పనిచేస్తూ పిల్లలకు క్రమశిక్షణ, మంచి ఆహారం, నాణ్యమైన విద్యా బోధన అందించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐసెట్‌లలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్ఓ వెంకటాచారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.ఆశన్న పాల్గొన్నారు.

హైలైఫ్ అందాలు!





ముద్దుగుమ్మలు మురిపించారు. అరుదైన వస్త్రాభరణాలతో మెరిశారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం హైలైఫ్ జ్యువెల్ ఎగ్జిబిషన్‌ను నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి మిస్ ఇండియా వరల్డ్- 2023 నందిని గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మోడల్స్ తళుక్కుమన్నారు. – మాదాపూర్




హ్యాండ్ టచ్‌లోకి!

హస్తం పార్టీ వైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చూపు

ఆపరేషన్ ఆకర్ష్‌కు పదును పెట్టిన అధికార పార్టీ

- ఇప్పటికే కాంగ్రెస్ గూటికి దానం, కేకే, మేయర్ విజయలక్ష్మి
- వీరి బాటలోనే ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి.. తాజాగా జానారెడ్డితో భేటీ
- రేవంత్ శిబిరంతో పలువురు ఎమ్మెల్యేల మంతనాలు.. చర్చలు పూర్తి
- గ్రేటర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్‌లోకే.. పేర్లు చెప్పిన దానం



సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్ పూర్వ వైభవం కోసం 'టార్గెట్ హైదరాబాద్ సిటీ' కోణంలో పావులు కదుపుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్నా.. మహా నగరంలో పార్టీ గడ్డు పరిస్థితుల్లో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ అనుకూల వాతావరణం వీచినప్పటికీ నగరానికి తాకలేదు. లోక్‌సభ ఎన్నికల్లో సైతం అపజయాన్ని మూటగట్టుకుంది. దీనిని కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించి ఆపరేషన్ ఆకర్ష్‌కు పదును పెట్టింది. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, ఆయన కుమార్తె జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు కారు దిగి కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు పలువురు ఎమ్మెల్యేలు సైతం అదే బాటలో నడిచేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చే బల్దియా ఎన్నికల్లో పూర్తిగా హస్తగతంతో పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు కాంగ్రెస్ టచ్‌లో ఉన్నట్లు విస్తృతంగా ప్రచారం సాగుతోంది. తాజాగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాజీ మంత్రి జానా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం, మరోవైపు త్వరలో గ్రేటర్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని దానం నాగేందర్ పేర్కొనడం సరికొత్త చర్చకు దారి తీసింది. ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డిని కలవడం, మరికొందరు కూడా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన విషయం విదితమే. కాగా.. తాజాగా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నేరుగా రేవంత్ రెడ్డి శిబిరం టచ్‌లోకి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ హామీ, నామినేటెడ్ పోస్టులపై పలు దఫాలుగా చర్చలు కూడా సాగినట్లు చర్చ సాగుతోంది. నగరానికి చెందిన బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి ఒకరు కాంగ్రెస్ నుంచి పిలుపు వస్తే జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.

పాత కాపులు సైతం..

వివిధ కారణాలతో పార్టీని వీడిన నేతలను సైతం తిరిగి సొంత గూటికి వచ్చేలా అధికార కాంగ్రెస్ ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాత పరిచయాలతో ఒక్కొక్కరు ముఖ్యనేతల టచ్‌లోకి వస్తున్నారు. వాస్తవంగా రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో గ్రేటర్ పరిధిలోని కాంగ్రెస్ ముఖ్యనేతలు ఒక్కొక్కరు తమ రాజకీయ భవిష్యత్ దృష్ట్యా పార్టీని వీడారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తిరిగి సొంత గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా వారిని ఆహ్వానిస్తుండటం కలిసి వచ్చే అంశంగా మారింది.

పరిస్థితి తారుమారు..

తెలంగాణ ఆవిర్భావం అనంతరం నగరంలో కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా తయారైంది. 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అప్పట్లో నగరంలోని పలు స్థానాల నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి అప్పటి అధికార పక్షం బీఆర్ఎస్ పంచన చేరారు. 2018లో జరిగిన శాసన సభ ఎన్నికల అనంతరం కూడా అదే పరిస్థితి పునరావృత్తమైంది. 2016, 2021లలో జరిగిన బల్దియా ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా... మహానగరంలో మాత్రం పట్టు చిక్కని పరిస్థితి నెలకొంది. దీంతో ఆపరేషన్ ఆకర్ష్‌తో వ్యూహ రచనకు పదును పెట్టినట్లు తెలుస్తోంది.

భారీ స్థాయిలో విస్తరించనున్న హెచ్ఎండీఏ

- బృహత్ మహా ప్రణాళికకు వడివడిగా అడుగులు
- ఆర్థిక, పర్యావరణ, ప్రజా రవాణాపై సమగ్ర ప్రణాళిక
- మూడు కన్సల్టెన్సీలను ఎంపిక చేసిన సర్కార్
- డిసెంబర్ నాటికి మెగా మాస్టర్ ప్లాన్ రూపకల్పన

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన బృహత్ మహా ప్రణాళిక రూపకల్పనకు అడుగులు పడ్డాయి. వివిధ అంశాలపై అధ్యయనం చేసి సమగ్రమైన మెగా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం మూడు కన్సల్టెన్సీలను ఎంపిక చేసి బాధ్యతలను అప్పగించింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మెగా మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలని గడువు విధించింది. తెలంగాణను మొత్తం మూడు భాగాలుగా విభజించి 2050 వరకు దశల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధిపై బృహత్ ప్రణాళికను రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) వరకు ఉన్న ప్రాంతాన్ని అర్బన్‌గా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న భూభాగాన్ని సబర్బన్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. అలాగే రీజినల్ రింగ్‌రోడ్డు నుంచి ఉండే మిగతా తెలంగాణ ప్రాంతాన్ని రూరల్‌గా పరిగణిస్తారు. ఇందుకనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.దీంతో హెచ్ఎండీఏ పరిధి ప్రస్తుతం ఉన్న 7200 చదరపు కిలోమీటర్ల నుంచి సుమారు 10 వేల చదరపు కిలోమీటర్ల వరకు పెరగనుంది. ఈ మొత్తం భూభాగానికి వర్తించేవిధంగా ×మెగా మాస్టర్ ప్లాన్ -2050¤ని రూపొందిస్తారు. ఇందులో ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు సమగ్రమైన ప్రజా రవాణా సదుపాయాల ప్రణాళిక (కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్, ఆర్థిక అభివృద్ధి ప్రణాళిక, బ్లూ అండ్ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రణాళిక ఉంటాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మెగా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

మూడు కన్సల్టెన్సీలు– మూడు బాధ్యతలు..

- హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఎంసీహెచ్, సైబరాబాద్, ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ ప్రణాళికలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి 2018 నాటికి భారీ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ.. ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. 111 జీఓ పరిధిలోని ప్రాంతాలను కూడా ఈ ప్రణాళిక పరిధిలోకి తీసుకురావాలని భావించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో సమగ్రమైన ప్రణాళికపైన పాత ప్రతిపాదనలు అటకెక్కాయి.
- సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్ మహానగర విస్తరణ, మూసీ ప్రక్షాళనపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే కొత్తగా మెగా మాస్టర్ ప్లాన్‌కు ప్రతిపాదనలు రూపొందించారు.
- మెగా మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో మూడు ప్రధాన అంశాలపై మూడు కన్సల్టెన్సీలను ఏర్పాటు చేశారు. లీ అసోసియేట్స్ సంస్థ కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)పై అధ్యయనం చేసి నివేదికను అందజేయనుంది,
- సీఎంపీలో భాగంగా 2050 వరకు మూడు దశలుగా ప్రజారవాణా సదుపాయాలను విస్తరిస్తారు. మెట్రో, బస్ రాపిడ్ సిస్టమ్, రోడ్డు రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. 2024 నుంచి 2030 వరకు, 2031 నుంచి 2040 వరకు, 2041 నుంచి 2050 వరకు చేపట్టాల్సిన రవాణా సదుపాయాలను సీఎంపీలో రూపొందించనున్నారు.
- ఆర్థికాభివృద్ధి ప్రణాళిక రూపకల్పన బాధ్యతలను ప్రభుత్వం క్రిసిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు అప్పగించింది. దశలవారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు చేపట్టాల్సిన పనులపై ఈ ప్రణాళిక అధ్యయనం దృష్టి సారించనుంది. ఎక్కడెక్కడ పారిశ్రామిక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి, ఏ విధమైన మౌలిక సదుపాయాలను విస్తరించాలి, ఏయే పరిశ్రమలకు ఎక్కడ స్థలాలు కేటాయించాలి వంటి అన్ని అంశాలను ఈ ప్రణాళికలో రూపొందించనున్నారు.
- మెగా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా బ్లూ అండ్ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్‌పైనా ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. దీనిపై అధ్యయనం కోసం ఎస్‌సీపీఈ కన్సల్టెంట్స్‌ను ఎంపిక చేశారు.
- ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న మొత్తం ప్రాంతాన్ని హెచ్ఎండీఏ పరిధిగా పరిగణిస్తూ పర్యావరణానికి, సహజ వనరుల పరిరక్షణకు విఘాతం కలగకుండా నిర్మాణ అనుమతులు ఇవ్వాలనేది బ్లూ అండ్ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లక్ష్యం.
- ఈ మేరకు పచ్చదనం విస్తరణ, పార్కులు, ఉద్యానాల అభివృద్ధి, బహిరంగ స్థలాల ఏర్పాటు (ఓపెన్ స్పేస్), తదితర అంశాలపై అధ్యయనం చేసి నివేదికను అందజేయనున్నారు.
- నీటి వనరుల పరిరక్షణపైనా ఈ ప్రణాళిక దృష్టి సారించనుంది. ఇప్పటికే వందలాది చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయి. నగరంలోనూ, శివారు ప్రాంతాల్లోనూ చాలాచోట్ల చెరువుల్లోనే బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. వర్షాకాలం వరదల కారణంగా హైదరాబాద్ జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా ప్రణాళికలను రూపొందించనున్నారు.



మారనున్న హైదరాబాద్ ముఖచిత్రం..

సమగ్రమైన మెగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి పటిష్ఠంగా అమలు చేస్తే హైదరాబాద్ మహానగర ముఖచిత్రం సమూలంగా మారుతుందని అధికారవర్గాలు భావిస్తున్నాయి. గ్లోబల్ సిటీగా అభివృద్ధి చెందుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నగరం విస్తరించనుంది. పెద్ద ఎత్తున టౌన్‌షిప్పులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. నగరం నలువైపులా మెట్రో విస్తరణకు ఇప్పటికే ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో మెట్రోతో పాటు ఇతర ప్రజా రవాణా సదుపాయాలు విస్తరించే అవకాశం ఉంది.



ఓంకార యోగం

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా దాదాపు 8 వేల మంది విద్యార్థులు ఓంకారం ఉచ్చరించడంతో క్యాంపస్ మార్మోగింది. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. బీజేపీ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ, పాఠశాల చైర్మన్ మల్కా కొమరయ్య, స్వామి భోదమయానంద, సీఈఓ మల్కా యశస్వీ తదితరులు పాల్గొన్నారు. – మల్లాపూర్

ఏసీబీ వలలో ఇన్‌స్పెక్టర్

ల్యాండ్ వ్యవహారంలో తలదూర్చి రూ.5 లక్షలు డిమాండ్



నగదుతో సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశం

సుభాష్‌నగర్: ఓ ప్రైవేట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో రూ.5 లక్షలు డిమాండ్ చేసిన సూరారం ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. గాజులరామారంలోని ఓ ప్రైవేట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ విషయంలో భూయజమానికి, ల్యాండ్ డెవలపర్ సాయిరాజ్‌కు మధ్య ఇటీవల వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశం ప్రైవేట్ వ్యవహారంలో తలదూర్చి సాయిరాజ్‌పై రౌడీషీట్ తెరుస్తామని, అలా చేయకుండా ఉండాలంటే రూ.2 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో సాయిరాజ్ మొత్తాన్ని ముట్టజెప్పాడు. తాజాగా అదే భూమిలో డెవలప్‌మెంట్ పనులకు ఆటంకం కలగకుండా ఉండాలంటే మరో రూ.5 లక్షలు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అడ్డు తగిలాడు. విడతల వారీగా నగదు ఇస్తానని సాయిరాజ్ ఒప్పుకున్నాడు. అనంతరం ఇన్‌స్పెక్టర్ వ్యవహారంపై రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కు ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారులు చెప్పినట్లుగా సాయిరాజ్ మొదటి దఫాగా రూ.లక్ష ఇచ్చేందుకు శుక్రవారం సూరారం స్టేషన్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశం నగదు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ నేతృత్వంలో అధికారులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆనంద్ మాట్లాడుతూ భూవ్యవహారంలో తలదూర్చడమే కాకుండా, రౌడీషీట్ తెరుస్తానని ఇన్‌స్పెక్టర్ బాధితుడిని బెదిరించినట్లు ఫిర్యాదులు అందాయని, ఈ వ్యవహారంలో ఇతరుల ప్రమేయంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి వారిపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టుబడిన ఇన్‌స్పెక్టర్ వెంకటేశంను నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు తరలించారు.

ప్రజావాణిలో 575 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 575 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 185, హౌసింగ్ 64 దరఖాస్తులు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల సమస్యలపై 50, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన 43, హోం శాఖకు సంబంధించి 42 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 191 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, రెవెన్యూ నోడల్ అధికారి లచ్చిరెడ్డి తదితరులు దరఖాస్తులను స్వీకరించారు.

స్థలాలు ఇస్తున్నారనే ప్రచారంతో..

వేలాదిగా తరలివచ్చిన జనం

- మియాపూర్‌లోని ప్రభుత్వ స్థలంలో కర్రలు, తడికలతో కబ్జా
- పోలీసులు, ఆక్రమణదారుల మధ్య వాగ్వాదం
- మూడు రోజులుగా సుమారు 40 కేసులు నమోదు



మియాపూర్‌లోని 100, 101 సర్వే నంబర్‌లో భూమి ఆక్రమించేందుకు వచ్చిన జనం



జనంతో మాట్లాడుతున్న మియాపూర్ ఏసీపీ నర్సింహారావు

మియాపూర్: ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని కొంత మంది వ్యక్తులు ప్రచారం చేయడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జనం మియాపూర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు తరలి వచ్చారు. స్టాలిన్‌నగర్ పక్కనే ఉన్న 100, 101 సర్వే నంబర్‌లోని భూమి వద్దకు చేరుకొని ఆ స్థలంలో తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. వివరాల్లోకెళ్తే.. హెచ్‌ఎండీఏ 100, 101 సర్వే నంబర్‌లో సుమారు 500 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై 20 సంవత్సరాలుగా కోర్టు కేసు విచారణలో ఉంది. ఈ భూమిని పరిరక్షించే బాధ్యతను ప్రభుత్వం హెచ్‌ఎండీఏకి అప్పగించింది. ఇదిలా ఉండగా.. 15 రోజుల క్రితం సుమారు 100 మంది మహిళలు ఇళ్ల స్థలాల కోసం ఈ భూమి వద్దకు వచ్చి 3 రోజుల పాటు అక్కడే ఉండి కర్రలు, తడికలు కట్టారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎండీఏ అధికారులు మియాపూర్ పోలీసుల సహాయంతో వారిని అక్కడి నుంచి పంపించారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కొంత మందిపై కేసులు కూడా నమోదు చేశారు. మళ్లీ మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సుమారు 2000 మంది జనం వరకు వచ్చి రాత్రింబవళ్లు అక్కడే ఉండిపోయారు. మియాపూర్ పోలీస్ అధికారులు అక్కడకు చేరుకుని ప్రజలకు ఎంత నచ్చజెప్పినా అక్కడే ఉండిపోయారు. ఆ భూమిలో చెట్టుకింద రాత్రికి రాత్రే గుడిని నిర్మించి దేవుడి ఫొటోలు ఏర్పాటు చేసి పూజలు చేయడం ప్రారంభించారు. మాకు ఇళ్లు లేవని, ప్రభుత్వం మాకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ.. అక్కడే ఉండిపోయారు.

పోలీసులపై తిరగబడిన జనం..

రెండు రోజులుగా అదే స్థలంలో ఉండటంతో పోలీసులు నచ్చజెప్పారు. మియాపూర్, చందానగర్, ఆర్సీ గూడం పోలీస్ స్టేషన్‌లోని పోలీసులు, హుడా అధికారులు శుక్రవారం అక్కడకు చేరుకుని నచ్చజెప్పారు. మియాపూర్ ఏసీపీ నర్సింహారావు సంఘటనా స్థలానికి చేరుకుని జనంతో మాట్లాడారు. ఈ భూమిపై కోర్టు వివాదంలో కొనసాగుతోందని, హెచ్‌ఎండీఏ పరిరక్షిస్తోందని, ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు అక్కడి నుంచి జనాన్ని చదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో వారు పోలీసులపై తిరగబడ్డారు. 100, 101 సర్వే నంబర్ భూమిలో భూమి ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై మూడు రోజులుగా సుమారు 40 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కిడ్నాప్ కేసులో మరో నలుగురి అరెస్టు

గచ్చిబౌలి: ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో తలెత్తిన వివాదం కేసులో మరో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆంజనేయులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ప్రధాన నిందితులైన భవిశెట్టి గౌతమ్, అశోక్‌రెడ్డితో పాటు ఇద్దరిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న ఏ3 ఉటుకూరి దినేష్(24), ఏ4 ఎరువ ప్రశాంత్‌రెడ్డి(30), ఏ5 నారపురెడ్డి సునీల్‌కుమార్(41), ఏ8 మానేపల్లి గౌతమ్ శ్రీనివాస్(21)లను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మైనర్ బాలికను అపహరించిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికను అపహరించిన కేసులో నిందితుడైన మనుసాని లక్ష్మణ్(24)కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి. కోర్టు పిపి సునీత బర్ల తెలిపిన కథనం మేరకు వివరాలు.. సరూర్‌నగర్ ఠాణా పరిధిలో నివసించే మైనర్ బాలికకు నిందితుడు లక్ష్మణ్ మాయమాటలు చెప్పి అపహరించి యాదగిరిగుట్టకు తీసుకెళ్లి, అక్కడి నుంచి శ్రీశైలం తీసుకెళ్లి ఓ చిన్న గుడిలో బాలికను వివాహం చేసుకున్నాడు. ఆపై విషయం బయటకు చెబితే ఆత్మహత్య చేసుకుంటానని బాలికను బెదిరించాడు. 2018 జూలై 24న కాలేజీకి అంటూ బయటకు వెళ్లిన కూతురు ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సరూర్‌నగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, సాక్షులను విచారించిన కోర్టు శుక్రవారం పైవిధంగా తీర్పు వెలువరించింది.

మహిళల రక్షణే ధ్యేయం

రాచకొండ సీపీ తరుణ్ జోషి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి.ఉషావిశ్వనాథ్

నాగోలు: బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయం వద్ద 111 మంది ఆకతాయిలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 15 రోజుల్లో షీ టీమ్స్‌కు 111 మంది ఈవ్ టీజర్లు పట్టుబడ్డారు. ఇందులో 59 మంది మేజర్లు, 52 మైనర్లు ఉన్నారు. పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రాచకొండ పరిధిలో వేధింపులకు గురైన బాధితులు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పాటు నేరుగా కొందరిని షీ టీమ్స్ బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. ఈ నెల 1వ తేదీ నుంచి 15 వరకు 155 ఫిర్యాదులు అందాయని రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి.ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు కొనసాగుతున్నాయని అన్నారు. పోకిరీలను సాక్ష్యాధారాలతో పట్టుకొని న్యాయస్థానంలో హాజరుపరుస్తూ.. వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారని అన్నారు. రాచకొండ షీ టీమ్స్ 24 గంటలూ అందుబాటులో ఉంటున్నాయని పేర్కొన్నారు. మహిళలు ఫోన్: 8712662111 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే కటకటాలే!

- మూడు నెలల జైలు శిక్ష
- కెమెరాలతో ఉల్లంఘనల గుర్తింపు, చలాన్ల జారీ
- సైబరాబాద్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



సాక్షి, సిటీబ్యూరో: రాంగ్‌రూట్‌లో వాహనాలను నడుపుతూ తోటి ప్రయాణికుల ప్రాణాలకు హాని కలిగిస్తున్న రాంగ్ సైడ్ వాహనాల డ్రైవర్లపై సైబరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇక నుంచి సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వాహనదారులపై ఐపీసీ సెక్షన్–366 కింద ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉల్లంఘనదారులకు మూడు నెలల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చని తెలిపారు. ఈ మేరకు కమిషనరేట్ పరిధిలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ, మాదాపూర్, నార్సింగి, రాయదుర్గం ఠాణాల పరిధిలో 10 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయగా.. 77 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ పరిధిలో 124 ప్రాంతాల్లో ఎక్కువగా రాంగ్ సైడ్ డ్రైవింగ్ జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆయా మార్గాల్లో ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో ఉల్లంఘనదారులను గుర్తించి, చలాన్లు జారీ చేయనున్నారు.

వీడియో కాల్ మాట్లాడుతూ యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

దుండిగల్: ఓ యువతితో చివరిసారిగా వీడియో కాల్ మాట్లాడుతూ తాను చనిపోతున్న దృశ్యాలను చూపిస్తూ ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కన్నారం గ్రామం చెర్రీ తాండాకు చెందిన రాజు కుమారుడు డి.శ్రీకాంత్(22) డి.పోచంపల్లిలోని సర్వే నం.120లో తన అన్నా వదినలతో కలిసి ఉంటున్నాడు. అతడు గండిమైసమ్మలోని గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తమ సొంత గ్రామంలో పొలం పనులు ఉండటంతో అన్నా వదినలు 15 రోజుల క్రితమే ఊరికి వెళ్లిపోగా శ్రీకాంత్ ఒక్కడే ఉంటున్నాడు. కాగా గురువారం రాత్రి శ్రీకాంత్ ఫోన్‌లో ఎవరితోనో గొడవ పడ్డాడు. తన గదిలోకి వెళ్లి తాడుతో రాడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక ఆధారాలు సేకరించారు. శ్రీకాంత్ చివరిసారిగా ఓ యువతితో ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడినట్లు గుర్తించారు. మంచంపై ఫోన్ పెట్టి తాను ఉరి వేసుకుని చనిపోతున్న దృశ్యాలను వీడియో కాల్ ద్వారా ఆ యువతికి చూపించినట్లు తెలుస్తోంది. ప్రేమ వ్యవహారమా.. లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

మహిళ మెడపై కత్తిపెట్టి..

- సెల్‌ఫోన్ చోరీకి యత్నించిన దుండగులు
- బెదరకుండా ఎదురు తిరిగిన మహిళ
- పోలీసులపై కూడా కత్తితో దాడికి యత్నం
- ఇద్దరిలో ఒకడిని పట్టుకున్న పోలీసులు

విజయనగర్‌కాలనీ: కత్తి చూపించి ఓ మహిళ సెల్‌ఫోన్ లాక్కెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన శుక్రవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మురాద్‌నగర్‌కు సయ్యద్‌అలీగూడ బస్తీకి చెందిన ఓ మహిళ గురువారం సాయంత్రం మెహిదీపట్నం ఎంఐజీ కాలనీలో నడుచుకుంటూ వెళ్తోంది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను అడ్డగించి సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశారు. ఆమె బెదరకుండా ఎదురు తిరగడంతో మెడపై కత్తిపెట్టి చంపేస్తామని బెదిరించారు. సమీపంలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మసిఉల్లా, హోంగార్డు హరి వెంటనే అక్కడకు చేరుకుని వారిని పట్టుకునేందుకు యత్నించారు. దుండగులు పోలీసులపై కూడా కత్తితో దాడికి విఫలయత్నం చేశారు. బైకుపై పారిపోయేందుకు ప్రయత్నించిన ఇద్దరిలో ఒకరిని స్థానికుల సహాయంతో పోలీసులు పట్టుకున్నారు. దుండగుడు ముర్గిచౌక్ ప్రాంతానికి చెందిన సాద్ జాహెద్ యమాని(24)గా గుర్తించారు. మరో దుండగుడు ఆలియాబాద్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సైఫ్‌గా విచారణలో తేలింది. క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని దుండగులను పట్టుకున్న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

మండి బిర్యానీ తిని తిరిగొస్తూ..

- అతివేగంతో డివైడర్‌ను ఢీకొన్న బైక్
- ఇద్దరు యువకులు మృతి
- చికిత్స పొందుతున్న మరొకరు



ఠాకూర్ రాధాకిషన్ (ఫైల్)



వైజనాథ్ ఇంగ్లే (ఫైల్)

చాంద్రాయణగుట్ట: బైక్‌పై ట్రిబుల్ రైడింగ్ చేసుకుంటూ వచ్చి అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రినాక జయప్రకాష్ నగర్‌కు చెందిన అమర్‌సింగ్ కుమారుడు ఠాకూర్ రాధాకిషన్(24) ఏసీ మెకానిక్. స్నేహితుడి బర్త్‌డే వేడుకలకు వెళ్లేందుకు స్నేహితుడైన రోహన్ చౌకట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున బైక్ తీసుకున్నాడు. అనంతరం ఇదే ప్రాంతానికి చెందిన వైజనాథ్ ఇంగ్లే అలియాస్ సోను(30), మక్దుంపురాకు నిఖిల్(18)తో కలిసి బైక్‌పై ట్రిబుల్ రైడింగ్ చేసుకుంటూ చాంద్రాయణగుట్టలో మండి బిర్యానీ తినేందుకు వెళ్లారు. బిర్యానీ తిన్న తర్వాత తిరిగి వస్తుండగా రాధాకిషన్ బైక్ నడుపుతుండగా, మధ్యలో సోను, వెనుక భాగంలో నిఖిల్ కూర్చున్నారు. తెల్లవారుజామున 3.30 గంటలకు కందికల్ ఆర్‌ఓబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి)పై అతివేగంగా బైక్ నడపడంతో డివైడర్‌కు తాకుతూ, ఆపై స్తంభానికి ఢీకొట్టారు. ఈ ఘటనలో వైజనాథ్ ఇంగ్లే అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన రాధాకిషన్‌ను ఎల్‌బీ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయాలతో నిఖిల్ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇద్దరు యువకుల మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా ఎవరి పుట్టిన రోజు లేదని, కేవలం బిర్యానీ తినేందుకు వెళ్లామని క్షతగాత్రుడు నిఖిల్ తెలిపాడని పోలీసులు వెల్లడించారు.

యోగా.. మంచిదేగా..!


ఆత్మకూరు రామారావు బీవీబీపీ స్కూల్‌లో...


జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో...


ఖైరతాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్...


ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో...


నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల


బంజారాహిల్స్‌లోని గతి స్కూల్‌లో...


హిమాయత్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో...


ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో...


శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్...


బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో...

ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కాలనీలు, బస్తీల కమ్యూనిటీ హాళ్లు, పార్కులలో యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ యోగా డేను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, యోగా గురువులు మాట్లాడుతూ... నిత్యం క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. మెరుగైన జీవనశైలి, యోగాతో చాలా ఆరోగ్య సమస్యలను పరిష్కరించవచ్చని స్పష్టం చేశారు. - బంజారాహిల్స్

యోగాతో ఒత్తిడి దూరం



ఖైరతాబాద్: యోగాను వైద్యులు తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఒత్తిడిని అదుపులో ఉంచుకోవచ్చని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ రొబొటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఎ.వి.గురువారెడ్డి తెలిపారు. ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో యోగా గురు శ్రీరమ ఆధ్వర్యంలో డాక్టర్ గురువారెడ్డితో పాటు హాస్పిటల్ డాక్టర్లు యోగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ప్రపంచ యోగా డే సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులను ఆదుకోవాలి

హిమాయత్‌నగర్: ఆర్టీసీని ఆ రంగంలో కార్మికులను ఆదుకునేలా ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి గాను బడ్జెట్‌ను కేటాయించాలని ఐఎన్టీయూసీ (టీఎస్ ఆర్టీసీ) ప్రధాన కార్యదర్శి సయ్యద్ మహమూద్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా రవాణా సంస్థ వ్యతిరేక విధానాల వలన ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నుంచి ఆర్టీసీని ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వం 2013 వేతన సవరణ సందర్భంగా జారీ చేసిన అరియర్స్ బ్రాండ్ డబ్బులను వెంటనే ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాలని కోరారు. మహిళా ప్రయాణికులకు ఉచిత బస్ ప్రయాణాన్ని కల్పించిన ప్రభుత్వం, ఆ ఖర్చును వెనువెంటనే ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు తమ సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న కోపరేటివ్ సొసైటీకి ఇవ్వవలసిన అప్పును వెంటనే చెల్లించాలని కోరుతున్నామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు గత మూడు దఫాలుగా చేయవలసిన వేతన సవరణను వెంటనే చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

వ్యర్థాలతో పరేషాన్!

నూర్‌నగర్ పోచమ్మ గుడి వద్ద పేరుకు పోయిన చెత్తాచెదారం
- తొలగించే విషయంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
- ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించని వైనం


ఇబ్రహీంనగర్-నూర్‌నగర్ పోచమ్మ గుడి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని ఇబ్రహీంనగర్-నూర్‌నగర్ పింట్‌గాంధీ స్ట్రీట్‌లో పోచమ్మ గుడి వద్ద గత ఐదు రోజుల నుంచి పెద్ద ఎత్తున చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం, దుర్వాసనతో ప్రత్యేక నరకాన్ని చవి చూస్తున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ చెత్తాచెదారం పేరుకుపోయిందని, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని శ్రీరామ గాయత్రీ నివాస్ అపార్ట్‌మెంట్ వాసులు జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. ఫలానా నెంబర్‌కు ఫోన్ చేయాలంటూ ఆమె ఓ అధికారి నెంబర్ ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, సదరు అధికారి మాత్రం స్పందించలేదని ఇదే ప్రాంతంలో నివసిస్తున్న రాఘవకాలనీ నివాసి కె.కె.ఎస్.రెడ్డి ఆరోపించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఇక్కడి దుర్గంధంపై ఈ-మెయిల్ కూడా చేశామని, అయితే దానిని పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారులు పట్టించుకోక, స్వీపర్లు ఊడ్చక ఎస్ఎఫ్ఏల నిర్లక్ష్యంతో రోజుల తరబడి తాము దుర్వాసనలతో సతమతమవుతున్నామన్నారు. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. తాము జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయగా మీ సమస్య పరిష్కారం అయ్యిందంటూ మెసేజ్ పంపించారని, చెత్తాచెదారం అక్కడే ఉండగా సమస్య పరిష్కారం అ య్యిందంటే ఆశ్చర్యపోయామని ఆయన అన్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఏఎంహెచ్ఓ నిర్లక్ష్యం, ఎస్ఎఫ్ఏల నిర్వాకం, అధికారుల పర్యవేక్షణ కరువై సర్కిల్-18 పరిధిలో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతూ దుర్వాసనలతో స్థానికులు నరకాన్ని చూస్తున్నా జీహెచ్ఎంసీ కమిషనర్ చోద్యం చూస్తున్నారంటూ ఇక్కడి సమస్యలు సోషల్ మీడియా చక్కెర్లు కొడుతున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రారంభం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-1లో నూతనంగా ఏర్పాటుచేసిన ఎత్నిక్ మహారాజా బ్రైడల్ స్టూడియోను శుక్రవారం ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, టీప్రీస్ ప్రెసిడెంట్ ఫహీంక్కురేశ్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎత్నిక్ మహారాజా స్టూడియో నిర్వాహకులు రాజు, వికాస్‌లు మాట్లాడుతూ... డిజైనర్ దుస్తుల తయారీలో సుదీర్ఘ అనుభవం తమకు ఉందని, నాణ్యతకు పెద్ద పీట వేస్తామన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 71, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 80, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 80, పచ్చకాకర 65, పందిరి బీర 72, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 45, గుండుబీన్స్ 175, గింజ చిక్కుడు 75, గోకరకాయ 55, కీర 35, దోసకాయ 27, రూట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 35, మొరంగడ్డ 40.

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు గాంధీభవన్ నుంచి తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో శుక్రవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. బంజారాహిల్స్ నుంచి భారీ ర్యాలీతో ఆయన తరలివెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ 23 లక్షల మంది విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇందుకు నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

సమైక్య పోరాటాలతోనే హక్కుల సాధన


మంద కృష్ణ మాదిగతో మాట్లాడుతున్న కుమారస్వామి

లిబర్టీ: బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం సమైక్యంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఉందని.. అలాంటి పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను శుక్రవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. విడిపోతే పడిపోతుంది, కలిసి ఉంటే హక్కులు సాధించుకుంటామని ఈ సందర్భంగా కుమారస్వామి విన్నవించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు సంఘటితమై పోరు సాగించి రాజ్యాంగ హక్కులను అమలు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కుల గణనకు మద్దతు ఇవ్వాలని మందకృష్ణకు కుమారస్వామి విన్నవించారు. మందకృష్ణమాదిగ స్పందిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం కలిసి నడుస్తామని భరోసా ఇచ్చారు. బీసీలు పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కులగణనకు మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.

30లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే పెనాల్టీ ఉండదు: డీఎంసీ

వెంగళరావునగర్: ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ నెల 30వ తేదీలోపు చెల్లించినట్టయితే అలాంటి వారికి ఎలాంటి పెనాల్టీ తీసుకోవడం జరగదని జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ పన్ను బకాయిదారులందరూ ఒకేసారి పన్నును చెల్లించాలని సూచించారు. ఆ విధంగా చెల్లిస్తే అపరాధ రుసుము ఉండదన్నారు. వచ్చే నెలలో చెల్లిస్తే అలాంటి వారికి రూ.2 శాతం పెనాల్టీ పడుతుందన్నారు. ముఖ్యంగా ఈ రెండు శాతం పెనాల్టీ ప్రతినెల చెల్లించాల్సి వస్తుందన్నారు. అందువల్ల పన్ను చెల్లింపుదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. జీహెచ్ఎంసీ సర్కిల్-19లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలం కబ్జాను అడ్డుకోండి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టీజేఎస్ నేతలు

బంజారాహిల్స్: షేక్‌పేట మండలం ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో కొంతమంది ఆక్రమణదారులు గుడిసెలు వేసి కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని, వాటిని తొలగించి చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ జన సమితి నేతలు శుక్రవారం షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇక్కడ వేసిన గుడిసెలు తొలగించి వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

స్ఫూర్తిప్రదాత జయశంకర్

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ నిర్వహించిన భూమిక ఎన్నటికీ మరువలేదని.. భవిష్యత్‌వర్గాలకు స్ఫూర్తిదాయకమని లోక్‌దల్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి పురస్కరించుకొని శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా చరిత్రలో మిగిలిపోతారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాదన కోసం సిద్ధాంతాన్ని రూపకల్పన చేసి ఉద్యమానికి ఊపిరిలూదిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు.

హోటల్స్‌కి స్టార్ రేటింగ్ ఇవ్వాలంటూ గృహిణికి భారీ టోకరా

టెలిగ్రామ్ యాప్ ద్వారా సందేశం పంపి రూ. 21 లక్షలు కాజేసిన చీటర్స్

హిమాయత్‌నగర్: దేశంలోని ప్రముఖ హోటల్స్‌కు 5 స్టార్ రేటింగ్ ఇస్తూ సులభంగా డబ్బు సంపాదించవచ్చని నమ్మించి సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన 44 ఏళ్ల గృహిణికి పార్ట్‌టైం జాబ్ అంటూ టెలిగ్రామ్ యాప్‌లో సందేశం వచ్చింది. ప్రముఖ హోటల్‌లకు 5 స్టార్ రేటింగ్‌లు ఇస్తూ సులభంగా డబ్బు సంపాధించే పార్ట్‌టైమ్ ఉద్యోగ అవకాశం ఉందని చెప్పారు. అది నమ్మిన బాధితురాలు ఎలా చేయాలని అడిగింది. వారు పంపిన లింక్ ద్వారా ఆమెకు 5 స్టార్ రేటింగ్‌లతో రేట్ చేయడానికి కొన్ని హోటళ్లను అందించారు. ఆమె టాస్క్‌లు పూర్తి చేసిన అనంతరం స్క్రీన్‌షాట్‌లను షేర్ చేయమన్నారు. అందుకు గాను ఒక్కోదానికి రూ. 50 చెల్లించారు. అనంతరం బాధితురాలికి పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక లాభాలు సంపాధించవచ్చిన నమ్మించారు. ఈ విధంగా మొదట రూ. 5 వేలు పెట్టించి, రూ. 6500 లాభం వచ్చిందని నమ్మించారు. ఈ విధంగా విడతల వారీగా బాధితురాలి నుంచి మొత్తం రూ. 21.73 లక్షలు కాజేశారు. డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయానని బాధితురాలు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆలయ నల్లా.. మాయమైంది ఎలా?

రహమత్‌నగర్: భక్తుల నీటి సమస్య తీర్చేందుకు ఆలయ వద్ద ఏర్పాటు చేసిన నల్లాను ఓ వ్యక్తి తన ఇంటి అవసరాల కోసం మరల్చుకున్నాడు. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివరాలివీ... ఎస్పీఆర్‌హిల్స్ రెండు బొమ్మల వద్ద ఉన్న శివాలయం వద్ద భక్తుల నీటి అవసరాల కోసం నల్లాను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఆలయం పక్క నివాసం ఉన్న ఓ వ్యక్తి గృహ మరమ్మతులు నిర్వహిస్తూ పబ్లిక్ నల్లాను తన ఇంట్లోకి మార్చుకుని ఏ మాత్రం ఆనవాలు లేకుండా చేశాడు. దీంతో భక్తులు, బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కోరుతున్నారు.

తమ్ముడు అదృశ్యంపై అన్న ఫిర్యాదు

వెంగళరావునగర్: తమ్ముడు కనిపించడం లేదంటూ అతని అన్న మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌కు చెందిన సి.హెచ్. నాగరాజు ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తాడు. ఆయన తమ్ముడు సి.హెచ్.మురళి ఈ నెల 17న నాగరాజు ఇంటికి వచ్చాడు. ఆర్థిక స్థితి గతుల కారణంగా మనసు బాగోలేదని తెలియజేశాడు. 18వ తేదీ మురళి తన ఫోన్‌ను ఇంట్లో వదిలేసి బయటకు వెళ్లాడు. ఇంటికి రాలేదు. దాంతో ఆందోళన చెందిన నాగరాజు చుట్టు పక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

అల్లం వెల్లుల్లి ధర అడిగితే దంపతులపై దాడి...

మార్కెట్‌లో అల్లం వెల్లుల్లి రేటు అడిగినందుకు దుకాణదారుడు భార్యాభర్తలపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... గురువారం రాత్రి కార్మికనగర్‌లో రైతుబజార్ ఏర్పాటు చేశారు. రహమత్‌నగర్‌లో నివాసం ఉండే రాములు తన భార్య శృతితో కలిసి మార్కెట్‌కు వెళ్లాడు. ఒక దుకాణదారుడి వద్ద అల్లం వెల్లుల్లి ధర అడిగాడు. కిలో రూ. 200 అని తొలుత చెప్పిన ఆ వ్యక్తి వెంటనే రూ. 220 అన్నాడు. సరేనని వాటిని తీసుకుని రూ. 220 ఫోన్ పే చేశాడు. ఈ క్రమంలో వివాదం ప్రారంభమైంది. ఇదేమని ప్రశ్నించిన రాములు అతని భార్య శృతిలపై వ్యాపారులు జహంగీర్, ఖదీర్ దాడిచేసి గాయపరిచారు. క్షతగాత్రులు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

కమ్యూనిటీ హాల్ స్థలం ఆక్రమణకు యత్నం

- నాయీ బ్రాహ్మణ సంఘ నాయకుల నిరసన
- బోరబండ పోలీసులకు ఫిర్యాదు

రహమత్‌నగర్: నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సంఘటన స్థలంలో నిరసన తెలిపి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ... నాయీ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం 120 గజాల స్థలాన్ని ఎస్పీఆర్ హిల్స్‌లోని నందినగర్ బస్తీలోని బస్తీలో కేటాయించింది.

ఈ స్థలంలోనే నాయీ బ్రాహ్మణులు బోర్డు నాటి చిన్న గుడారం ఏర్పాటు చేసుకున్నారు. గురువారం సాయంత్రం కొంత మంది మహిళలు కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన స్థలంలోకి జొరబడి గుడారాన్ని తొలగించి ఆ స్థలం తమదేనంటూ హంగామా సృష్టించారు. సమాచారం అందుకున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ సంఘం నాయకులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి అధికారికంగా తమ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించారని చెప్పారు. ప్రభుత్వం మారగానే కొంత మంది తన సంఘానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ చర్యలను తమ సంఘం అడ్డుకుంటుందని ప్రకటించారు. ఆనంతరం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మాదిగలంతా ఏకం కావాలి: మోత్కుపల్లి

లక్డీకాపూల్: జాతి నిర్మాణం కోసం మాదిగలు అంతా ఏకం కావాలని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 'మాదిగ శక్తి– సుస్థిర లక్ష్యాలు' కరపత్రాన్ని ఓయూ ప్రొఫెసర్ కాశీంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్నీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ఉనికిని మనం నిలబెట్టుకోవాలని, ప్రస్తుతం మాదిగ కులాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మాదిగలను పక్కకు పెట్టి..వారి ఉనికి లేకుండా చేస్తున్నారని, ఇది బాధాకరమన్నారు. తెలంగాణ వచ్చాక 60 లక్షలకు పైగా ఉన్న మాదిగలు ప్రస్తుతం 50 సంవత్సరాలు వెనక్కి పోయారని, ఒక్క ఎంపీ సీటు కూడా లేదని అన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం ఇవ్వాలన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానన్నారు. చాలా మంది సంఘాలు పెడుతున్నారే కానీ చిత్తశుద్ధితో పనిచేయడం లేదని ఓయూ ప్రొఫెసర్ కాశీం అన్నారు. సమావేశంలో సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్, భూషిపాక గణేష్, మోరె ప్రభాకర్, లింగంపల్లి మనోజ్, కూరపాటి ఆంజనేయులు, డాక్టర్ సంజీవ్ నాయక్, పినపాటి రజనీ, పవన్ కుమార్, ఎం.నారాయణ, వెంకటేశ్వర ప్రసాద్, కల్లెపల్లి రవి, నాగుల కిరణ్ బాబు, నాగుల అనిల్ బాబు, భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్, ప్రధాన కార్యదర్శి చలపతి రావు, తుమ్మల చిరంజీవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెన్షన్లను వెంటనే అమలు చేయాలి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పెన్షన్‌లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవనంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలేదని ఆరోపించారు. ముఖ్యంగా పెన్షనర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవాని చౌదరి, తెలంగాణ మహిళా అధ్యక్షురాలు పంతంగి మంగమ్మ, కోర్ కమిటీ చైర్మన్ గోపాల్ రావు, అందె రాంబాబు, గరిగంటి రజిత పాల్గొన్నారు.

మేయర్‌కు శుభాకాంక్షలు

రహమత్‌నగర్: నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీకి కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సి.ఎస్.రెడ్డి శుక్రవారం కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి మేయర్‌కు రాత పుస్తకాలు అందించగా.. బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా 'శాశ్వత అష్టాదశ బలం'



సాక్షి, సిటీ బ్యూరో: మెరీడియన్ స్కూల్ వ్యవస్థాపక వేడుకలు ఘనంగా జరిగాయి. స్కూల్‌ను స్థాపించి 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'శాశ్వత అష్టాదశ బలం' పేరిట వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. 18 ఏళ్లుగా మెరీడియన్ స్కూల్ సాధించిన ఘనత, దాటిన మైలురాళ్లను గుర్తు చేసుకున్నారు. స్కూల్ వ్యవస్థాపకులు బుట్టా రేణుక, బుట్టా నీలకాంత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి స్కూల్ వ్యవస్థాపకుడు వింగ్ కమాండర్ జుబేర్ షేక్, వైద్య రంగ నిపుణుడు దేవేంద్ర కొలతొడి హాజరయ్యారు.



గోల్డెన్ డే..

బంగారం ధగ ధగలు.. వజ్ర వైఢూర్యాల వెలుగులు.. వెండి మెరుపులు..ముత్యాల సొబగులకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని జీఎంఆర్ ఏరీనా వేదికగా మారింది. తెలంగాణ జ్యువెలరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ ఫెస్టివల్‌ను శుక్రవారం ఇక్కడ ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగుతుంది. ప్రత్యేకంగా బిజినెస్ టూ బిజినెస్ కింద కేవలం లైసెన్స్ కలిగిన వివిధ రకాల ఆభరణాలు, దాని అనుబంధ రంగాల వర్తకులకు మాత్రమే ఈ ప్రదర్శనకు అనుమతి ఉంది. సుమారు 500 పైచిలుకు స్టాళ్లలో వంద రూపాయల ముత్యం మొదలు కోట్ల రూపాయల విలువైన వజ్రాభరణాలు కొలువుదీరాయి. ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, సూరత్, అహ్మదాబాద్, త్రివేండ్రం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన హోల్‌సేల్ వ్యాపారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను రిటైల్ వ్యాపారులు సందర్శించారు. రూ.50 వేల విలువైన కలం, వెండితో చేసిన అనేక కళారూపాలు, లాబ్రన్ వజ్రాలు పొదిగిన ఖరీదైన చేతి గడియారాలు, బంగారు వాచీలు ఆకట్టుకుంటున్నాయి. జ్యువెలరీ అసోసియేషన్ ప్రముఖులు పలువురు పాల్గొన్నారు. - శంషాబాద్



బంగారం, వెండితో చేసిన వస్తువులు



యాభైవేల రూపాయల ఖరీదైన కలం



బంగారు వాచీలు..



లాబ్రాన్ వజ్రాలు పొదిగిన ఖరీదైన గడియారం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జ్యువెలరీ రంగ ప్రముఖులు

◆ రాష్ట్రపతి నిలయంలో యోగా డే



బొల్లారం రాష్ట్రపతి నిలయంలో జరిగిన యోగా డే దృశ్యాలు

రసూల్‌పురా: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ పేరుతో వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ప్రముఖ యోగా శిక్షకులు, రాష్ట్రపతి నిలయం సీనియర్ అసిస్టెంట్ రవీందర్ సింగ్, వివిధ యోగా కేంద్రాల శిక్షకుల ఆధ్వర్యంలో యోగా భంగిమలు, శ్వాస, ధ్యాన పద్ధతుల సాధన నిర్వహించారు. రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజనీప్రియా మాట్లాడుతూ శారీరక వ్యాయామాలతో పాటు యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆధునిక జీవితంలోని సవాళ్ల మధ్య ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించడంలో యోగా పాత్ర కీలకమన్నారు.

◆ విద్యార్థుల మధ్య మేయర్ బర్త్‌డే



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తన పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం బంజారాహిల్స్‌రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో జరుపుకొన్నారు. విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తన వద్దకు వచ్చే వారు తనకు శాలువాలు, బొకేలు ఇవ్వొద్దని, పేద విద్యార్థులు చదువుకున్న ప్రభుత్వ పాఠశాలల కోసం ఏదైనా ఇవ్వాలని సూచించారు.

◆ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి ఘనత



భూపతిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సైదులు

సాక్షి, సిటీబ్యూరో: జూపార్కులోని 'కులీకుతుబ్ షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల' విద్యార్థి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌లో ప్రతిభ చూపారు. ఏకంగా ఐఐటీకి అర్హత సాధించారు. కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ కోర్సు ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బడావత్ భూపతి ఉత్తమ పర్సంటైల్, ర్యాంకు సాధించాడని ప్రిన్సిపాల్ ఎం.సైదులు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చదివిన విద్యార్థి జేఈఈలో ప్రతిభ చూపడం తమకు గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి భూపతిని ఆదర్శంగా తీసుకుని చదువులో మంచి స్థాయికి ఎదగాలని సైదులు సూచించారు. ప్రతిభ, ఆసక్తి ఉన్న విద్యార్థులను తాము ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా భూపతిని కళాశాలలో ప్రత్యేకంగా సత్కరించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. తమ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు, ఇతర అధ్యాపక సిబ్బంది ప్రోత్సాహం, గైడెన్స్ వల్లే తాను జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ పర్సంటైల్ సాధించానని భూపతి పేర్కొన్నారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. ఈ ర్యాంకు స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తానని పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌లో ఎస్టీ విభాగంలో 786 ర్యాంకు వచ్చిందని, ముంబై ఐఐటీలో తనకు సీటు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

◆ ఎస్‌బీఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న సర్కిల్ సీజీఎం రాజేష్ కుమార్

లక్డీకాపూల్: ఎస్‌బీఐ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో ఎప్పటికప్పుడు సరికొత్త లాభదాయకమైన విధానాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్, ఎస్‌బీఐ సెక్యూరిటీస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సురేష్ శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం రాజ్‌భవన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్‌బీఐ క్యాప్ సెక్యూరిటీస్' బ్రాంచ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులు వారి సర్వీస్ అవసరాలకు ఈ క్యాప్ సెక్యూరిటీస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అతి త్వరలో కేపీహెచ్‌బీ, సికింద్రాబాద్‌లలో మరో రెండు బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రోకింగ్ జోనల్ రీజినల్ మేనేజర్ నవాజ్ అలీ, జోనల్ మేనేజర్ బాలాజీ, సేల్స్ రీజినల్ మేనేజర్ వరేశ్ ముండెల్, జోనల్ మేనేజర్ జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ హైటెక్స్‌లో ఇండో మ్యాక్ ఎగ్జిబిషన్



మాదాపూర్: దక్షిణ భారతదేశంలో అతిపెద్ద పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఇండోమ్యాక్ అని వెల్డింగ్ ఇండియా లిమిటెడ్ సీఓఓ, కోయికే కట్టింగ్ కుమగయి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇండోమ్యాక్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ మెషినరీ, మెషీన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సేవలు, భారీ, తేలికపాటి యంత్రాలు, యంత్ర పరికరాలు, ఉపకరణాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎగ్జిబిషన్‌కు దేశ విదేశాల నుంచి 200 మందికి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొన్నట్టు తెలిపారు. 750కి పైగా లైవ్ మెషనరీలు, 900కుపైగా ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బోనాల బడ్జెట్‌ను రూ.25 కోట్లకు పెంచాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అంజయ్య

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే బడ్జెట్‌ను పెంచాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బోనాల బడ్జెట్ రూ.15 కోట్లుగా ఉందని, ఈసారి రూ.25 కోట్లకు పెంచాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు. బోనాలు వైభవంగా నిర్వహించేందుకు నిధులు అవసరమని పేర్కొన్నారు.

హిందూ వాహిని సంఘటన్ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా భార్గవిరెడ్డి



హిమాయత్‌నగర్: రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నగరానికి చెందిన మద్దూరు భార్గవి రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ జాతీయ అధ్యక్షుడు రమేష్ చంద్ర ద్వివేది శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హిమాయత్‌నగర్‌కు చెందిన భార్గవి రెడ్డి కొంతకాలంగా బీజేపీ అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా రమేష్ చంద్ర ద్వివేది, అయోధ్య ట్రస్టీలు కల్కిభగవాన్, చంపక్ రాయ్‌లకు భార్గవి రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కంపెనీలు, ఉన్నత విద్యాసంస్థలు కలిసి పనిచేయాలి

రాయదుర్గం: కంపెనీలు, ఉన్నత విద్యాసంస్థల మధ్య అంతరాలు తగ్గించడమే లక్ష్యంగా ట్రిపుల్ ఐటీ ముందడుగు వేసింది. అందులో భాగంగా ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టి..ఇందులో అనేక కంపెనీలను భాగస్వాములను చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని క్వాల్‌కామ్ కంపెనీలో ఆ కంపెనీ సహకారంతో 'టెక్ ఫార్వర్డ్' పేరిట రీసెర్చ్ సెమినార్‌ను నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ కమ్యూనిటీ చొరవ తీసుకుందని, దేశంలోనే తొలిసారిగా ఒక విద్యాసంస్థ ఇలాంటి చొరవకు శ్రీకారం చుట్టిందన్నారు. ట్రిపుల్ ఐటీ అనేక ఐటీ సంస్థల మధ్య ఉందని, పరిశ్రమతో అనుసంధానం కావడం వల్ల ఇటు విద్యాసంస్థలు, అటు పరిశ్రమలకు సమానంగా ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో క్వాల్‌కామ్ ఇంజినీరింగ్ ఉపాధ్యక్షుడు రాజేష్ నారాయణన్, ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ అనూప్ ఎం నంబూద్రి, క్వాల్‌కామ్ సంస్థ ఇండియా ఇంజినీరింగ్ వీపీ శశిరెడ్డి, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీలపై డేగ కన్ను!

'షీట్స్'పై సమూలంగా సమీక్షకు నిర్ణయం

- అవసరం లేని వారిపై తొలగించే యోచన
- నేరచరితులపై కొత్తగా మరికొన్ని నమోదు
- ఆచూకీ లేని వారి కోసం ప్రత్యేక బృందాలు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న నగర పోలీసు బాస్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇటీవల చోటు చేసుకున్న కొన్ని పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి..రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వీరిపై నిఘా ముమ్మరం చేయడంతో పాటు ప్రస్తుతం నగరంలో ఉన్న రౌడీషీట్లను పూర్తి స్థాయిలో సమీక్షిస్తున్నారు. అవసరం లేని వారిపై ఎత్తేయడంతో పాటు కొత్తగా నేరచరితులుగా మారిన వారిపై తెరిచేందుకు ఆదేశాలు జారీ చేశారు. శాంతిభద్రతల విభాగం, టాస్క్‌ఫోర్స్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) విభాగాలు ఉమ్మడిగా చేపట్టే చర్యలను స్వయంగా కొత్వాల్ పర్యవేక్షిస్తున్నారు. దీనిపై ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విస్తృత సమీక్ష చేశారు.

అమలులో మూడు రకాల షీట్లు..

అసాంఘిక శక్తులపై అనునిత్యం నిఘా ఉంచడానికి అనువుగా ప్రస్తుతం పోలీసు విభాగం మూడు రకాలైన షీట్లు తెరుస్తోంది. నిర్ణీత కాలంలో వరుసగా కేసులు నమోదైన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీ షీట్లు, మతపరమైన అంశాలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై కమ్యూనల్ షీట్లు, అనుమానాస్పద ప్రవర్తన, వ్యవహారశైలితో పాటు సొత్తు సంబంధిత నేరాల్లో నిందితులపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తున్నారు. బోనాలు, గణేష్ ఉత్సవాలు వంటి కీలక సందర్భాలతో పాటు ఎన్నికల సీజన్‌లోనూ ఈ షీటర్లను ఠాణాలకు పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వడం, బైండోవర్ చేయడం చేస్తున్నారు. ప్రస్తుతం నగర వ్యాప్తంగా అన్ని రకాలు కలిపి దాదాపు 1500 మంది షీటర్లు ఉన్నారు.

వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు...

రౌడీషీటర్లలో దాదాపు 250 మంది ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. వీరు స్థానిక పోలీసులకు, టాస్క్‌ఫోర్స్ అధికారులకూ కనిపించట్లేదు. వీరిని పోలీసు పరిభాషలో ఔట్ ఆఫ్ వ్యూ అని పిలుస్తుంటారు. ఈ షీటర్లలో కొందరు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లి బతుకుతుండగా మరికొందరు నిఘాకు చిక్కకుండా తమ దందా కొనసాగిస్తున్నట్లు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. ఈ షీటర్ల ఆచూకీ కనిపెడితేనే వాళ్లు ఏం చేస్తున్నారనే దానిపై స్పష్టత వస్తుంది. దీన్ని పరిగణలోకి తీసుకున్న పోలీసు కమిషనర్ స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ అధికారులతో ప్రత్యేక బృందాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ టీమ్స్ తమ పరిధిలో ఔట్ ఆఫ్ వ్యూగా ఉన్న షీటర్ల ఆచూకీ కనిపెట్టడానికి పని చేస్తాయి. మరోపక్క రౌడీషీటర్ల కౌన్సిలింగ్, బైండోవర్ ప్రక్రియల్ని వేగవంతం చేయాలని కొత్వాల్ ఆదేశాలు జారీ చేశారు.

పట్టించుకోని స్థానిక పోలీసులు...

ఈ షీటర్లను ప్రతి నెలా టాస్క్‌ఫోర్స్ అధికారులు తమ కార్యాలయానికి పిలిచి అటెండెన్స్ తీసుకుంటూ ఉంటారు. ఆ సందర్భంలో వారికి కౌన్సిలింగ్ చేయడంతో పాటు వ్యవహారశైలి తదితరాలను గమనిస్తుంటారు. గతంలో స్థానిక శాంతిభద్రతల విభాగం అధికారులు సైతం వీరిపై నిఘా ఉంచేవాళ్లు. పెట్రోలింగ్ సిబ్బంది క్రమం తప్పకుండా వారి ఇళ్లకు వెళ్లి వివరాలు ఆరా తీయడంతో పాటు నిఘా ఉంచేవాళ్లు. గస్తీ బృందాల విధి నిర్వహణలో ఇది కీలకాంశంగా చేర్చారు. అయితే కొన్నాళ్లుగా రౌడీషీటర్ల వ్యవహారం పూర్తిగా టాస్క్‌ఫోర్స్‌కు సంబంధించిన అంశం అన్నట్లు శాంతిభద్రతల విభాగం భావిస్తున్నట్లు కొత్వాల్ గుర్తించారు. దీంతో ప్రతి ఠాణాకు చెందిన అధికారులూ తమ పరిధిలో నివసించే షీటర్లపై నిఘా ఉంచాల్సిందే అంటూ స్పష్టం చేశారు.

'తీసివేతలు-కూడికలకు' ఆదేశాలు...

నగర పోలీసు రికార్డుల్లో ఉన్న షీటర్లలో అనేక మంది ప్రస్తుతం తమ వ్యవహారశైలిని మార్చుకున్నారు. కొన్నేళ్ల క్రితం నగరంలో నెలకొన్న పరిస్థితులు, అప్పటి పరిణామాల నేపథ్యంలో కొందరిపై షీట్లు తెరిచారు. ఈ నేపథ్యంలో దాదాపు 350 మంది వివరాలతో ప్రత్యేక జాబితాలు రూపొందించారు. గడిచిన పదేళ్లల్లో ఎలాంటి నేరం చేయని వాళ్లు, 60 ఏళ్ల వయస్సు పైబడిన వాళ్లతో పాటు సాంకేతికంగా అనివార్య కారణాల నేపథ్యంలో షీటర్లుగా మారిన వారి పేర్లు ఇందులో ఉన్నాయి. వీటిని సమీక్షించడం ద్వారా అవసరం లేని వారిపై షీట్లు ఎత్తేయనున్నారు. అలాగే ఇటీవల కాలంలో నేరాలు చేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్న వారిపై కొత్తగా తెరిచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, సాంకేతికంగా చేపట్టాలని కొత్వాల్ ఆదేశాలు జారీ చేశారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలని
యూత్ కాంగ్రెస్ నిరసన



ర్యాలీగా వెళ్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు

కాచిగూడ: ఎన్టీఏ నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో అవినీతి, అక్రమాలు జరిగినందున వెంటనే పరీక్షను రద్దు చేయాలని యువజన కాంగ్రెస్ హైదరాబాద్ నగర అధ్యక్షుడు మోత రోహిత్ డిమాండ్ చేశారు. నీట్ అవకతవకలపై జరుగుతున్న నిరసనలో భాగంగా శుక్రవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బర్కత్‌పురలోని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. మొదట వినూత్న రీతిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బర్కత్‌పుర చౌరస్తా నుంచి చమన్ మీదుగా కిషన్ రెడ్డి ఇంటికి ర్యాలీగా వెళ్ళుతున్న యువజన కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకుని కాచిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులకు, యూత్ కాంగ్రెస్ నేతలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ దేశ యువతను మోసం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కొనసాగే నైతిక హక్కు లేదని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ మౌనం వీడి తక్షణమే న్యాయ విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో సందిరి సాయిబాబా, సంగపాక వెంకట్, సోహెల్, జై గౌడ్, అఖిల్, మోహీస్ తదితరులు పాల్గొన్నారు.

బిహార్ హైకోర్టు తీర్పు విస్మయపరిచింది: జాజుల

లక్డీకాపూల్: జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లను పాట్నా హైకోర్టు రద్దు చేయడం తనను విస్మయపరిచిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ తీర్పు ద్వారా బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా కనుగుణంగా రిజర్వేషన్లను అడుగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ తీర్పు యావత్ బీసీ సమాజాన్ని నిరాశకు గురిచేసిందన్నారు. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు సాధించే వరకు తాము పోరాటం చేస్తామని చెప్పారు. దేశంలో సామాజిక రిజర్వేషన్లను రక్షించుకోవడానికి త్వరలోనే ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టి ఆగస్టు చివరి వారంలో ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో 10 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ ఉప్పరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

రాజకీయాలకు ఆదాయ వనరుగా ప్రాజెక్టులు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల విమర్శ


లక్డీకాపూల్: తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు, రాజకీయాలకు ఆదాయ వనరుగా మారాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జల సాధన సమితి, తెలంగాణ రైతు సంక్షేమ సమితి సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ..ఒక తప్పుడు నిర్ణయం వల్ల దేశం నాశనం అవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిని నిగ్గుతేల్చాలన్నారు. కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఏకపక్ష నిర్ణయాలతో నీటిపారుదల ప్రాజెక్ట్‌లకు నష్టం జరిగిందని ఆరోపించారు. ఈ విషయంలో నష్టపోయిన రైతులకు న్యాయం జరగాలన్నారు. ఇంకా పలువురు మాట్లాడుతూ జ్యుడీషియల్ కమిషన్‌ను బెదిరించే ధోరణి కేసీఆర్ సరి కాదన్నారు. గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత వేములపల్లి వెంకట్రామయ్య, నర్సింహారెడ్డి, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ చంద్రకుమార్

జులై 1న జాతీయ బంజారా సమ్మేళనం

లక్డీకాపూల్: లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జులై 1న జాతీయ బంజారా సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్టు సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్య నాయక్ తేజావత్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బంజారాల భాష గ్వార్‌బోలిని భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో చేర్పించడమే లక్ష్యంగా చేపట్టే ఉద్యమానికి ఈ సమ్మేళనం నాంది పలకనున్నట్టు పేర్కొన్నారు. బంజారా జాతిలో విశిష్ట సేవలు అందించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కేతావత్ సోంలాల్ నాయక్, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రమేష్ నాయక్, కేంద్ర ప్రభుత్వ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్‌లను ఈ సమ్మేళనంలో సన్మానించనున్నట్టు చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించే ఈ జాతీయ సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు ఆర్. కైలాస్ నాయక్, భూక్యా కోట్యా నాయక్, అశోక్ నాయక్, అజ్మీర స్వామి నాయక్, రామావత్ సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బెల్లయ్య నాయక్

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శనివారం, 22, జూన్, 2024

అటు అందం.. ఇటు ఆరోగ్యం

- సింబయాటిక్స్‌తో కాలుష్య నివారణ
- టేబుల్ ప్లాంట్స్‌తో ఒత్తిడికి చెక్
- ఆక్సిజన్ బాంబ్స్‌కు ఆదరణ



నగర ప్రజల ఆలోచనా సరళి మారుతోంది.. పచ్చని ప్రకృతికి ఆకర్షితులవుతున్నారు.. గార్డెన్‌లో పెరగాల్సిన మొక్కలను గదుల్లో అలకరణకు పెడుతున్నారు. మొత్తానికి మొక్కలు నట్టింట్లో నచ్చే విధంగా ఏర్పాటుచేసుకుంటున్నారు. మదిలో మెదిలే ఆలోచనకు అనుగుణంగా గదులను మార్చేస్తున్నారు. నగర వాతావరణంలో తగ్గిపోతున్న ఆక్సిజన్ అవసరాలను తీర్చడానికీ, కాలుష్య కారకాలను నియంత్రిచడానికి ఇంటీరియర్ మొక్కలు ఉపకరిస్తున్నాయి.

– సాక్షి, సిటీ బ్యూరో

మదిలోంచి గదిలోకి

నట్టింట్లో.. నచ్చేట్టు!

ఇంటీరియర్ ప్లాంటేషన్.. ఇప్పుడిదే ట్రెండ్

పచ్చనిచెట్లు.. ప్రగతికి మెట్లు.. అన్నట్లు.. మొక్కలు ప్రగతికే కాదు.. ఆరోగ్యానికీ ఎంతో దోహదం చేస్తాయి.. ఈ కాన్సెప్ట్‌తోనే ఇంటీరియర్ డిజైనర్స్ ఇంట్లో పెరిగే మొక్కలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఓ వైపు కాలుష్యం.. మరో వైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి మానసిక, శారీరక రుగ్మతలకు చక్కని పరిష్కారం ఈ ఇన్‌డోర్ ప్లాంట్స్. నగర వాతావరణంలో ఇళ్లు, ఆఫీసు అనే తేడా లేకుండా కాలుష్య కారకాలైన బెంజీన్, ఫార్మాల్డిహైడ్, యుటిక్విటస్, ట్రిక్లోరో ఇథిలిన్ వంటి ప్రమాదకర కారకాలు గాలిలో కలిసి మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. బ్రాంకైటిస్, ఆస్తమా వంటి రోగాలతో పాటు కేన్సర్ వంటి ప్రాణాంతక రోగాలు దాడిచేస్తున్నాయి. వీటిని అరికట్టడంలో ఇంటీరియర్ ప్లాంట్స్ కీలకపాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

కాలుష్య నివారిణి సింబయాటిక్..

సింబయాటిక్ రిలేషన్‌షిప్ అనే విధానంలో కొన్ని మొక్కలు గాలిలోని కాలుష్య కారకాలని నిర్మూలిస్తాయి. ఇందులో మొక్కల ఆకులు, వేర్లతో పాటు..మట్టిలోని సూక్ష్మజీవులు సైతం ప్రధాన పాత్ర పోషిస్తాయి. సహజంగానే ఇండోర్ ప్లాంట్స్ వాటి ఎదుగుదలకు కిరణజన్య సంయోగ క్రియని (ఫోటోసింథసిస్) అధిక మొత్తంలో జరుపుతుంది. పత్రాలకున్న సూక్ష్మ రంధ్రాలు గాలిలోని విష వాయువులు, కార్బన్ డై ఆక్సైడ్‌ని పీల్చుకుని ఆక్సిజన్ విడుదల చేస్తాయి.

జెర్బరా డైసీ (జెర్బరా జెమ్‌సన్, డైసీ, గుల్‌బహార్)



ఈ పూల మొక్క బెంజీన్, 'క్యాన్సర్' కారక రసాయనాలను తొలగించడంలో ఉపయోగపడుతుందని 'నాసా' తెలిపింది. ఈ మొక్క రాత్రంతా కార్బన్ డై ఆక్సైడ్‌ని పీల్చుకొని ఆక్సిజన్‌ని విడుదల చేస్తుంది. ప్రశాంతంగా నిద్ర పోవడానికి ఈ మొక్కను బెడ్‌రూంలో పెంచుకుంటారు. దీనిని ఇంట్లో సూర్యకాంతి పడేలా పెట్టుకోవాలి. ఇది ఇండోర్, ఔట్‌డోర్ ప్లాంట్ కూడా.. రంగుల పూలతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది.



క్రిసాంథిమమ్ (క్రిసాంథిమమ్ మారిఫోలియమ్, గార్డెన్ మమ్)



ఇంటి పరిసరాల్లోని అమ్మోనియా, బెంజిన్, ఫార్మాల్డిహైడ్, గ్లైలిన్‌తో పాటు ఇతర రసాయనాలను తొలగిస్తుంది. గాలిని శుద్ధి చేసే అత్యుత్తమమైన మొక్కగా 'నాసా' దీనిని గుర్తించింది. విభిన్న రంగుల పూలతో అతి తక్కువ ధరకు దొరికే సాధారణ మొక్క. గార్డెన్‌లోనూ పెరుగుతుంది. పొగతాగే ప్రదేశంలో, ప్లాస్టిక్, ఇంక్ పేయింట్స్, వార్నిష్, ఆయిల్స్, డిటర్జెంట్స్, సింతటిక్ ఫైబర్స్, గ్యాసోలిన్, రబ్బర్ వాసన వచ్చే చోట ఉంచడం వల్ల విష వాయువులను నిర్మూలిస్తుంది.

పీస్ లిల్లీ(స్పాతిఫైలమ్)



తెల్లటి పూలతో చూడగానే ఆకట్టుకుంటుంది. కాలుష్యకారకాలైన బెంజీన్, టోల్యూన్, గ్లైలీన్, అమ్మోనియా, ఫార్మాల్డిహైడ్, ట్రిక్లోరో ఇథైలిన్‌లను ఫిల్టర్ చేస్తుంది. విషవాయులు వెలువడే ప్రాంతాల్లో ఈ మొక్కను పెంచితే వాటిని గ్రహించి పరిశుభ్రమైన గాలిని అందిస్తుంది. కార్పొరేట్ ఆఫీసుల్లో స్మోకింగ్ జోన్ వద్ద వీటిని పెట్టడం వల్ల కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

లెమన్‌గ్రాస్..

లెమన్‌గ్రాస్ మొక్కను వరండాలో, బాల్కనీలో సూర్యరశ్మి తగిలేలా పెంచుకోవాలి. విషవాయువులను తొలగించడంతో పాటు మంచి ఫ్లేవర్‌ను అందిస్తుంది. దోమల నివారణకు చక్కటి పరిష్కారం. ఈ మొక్క ఆకులను మరుగుతున్న టీలో వేసుకుంటే ఔషధ గుణాలను అందించమే కాకుండా మంచి రుచిని అందిస్తుంది.

కలబంద (అలోవెర)

ఇది ఒక సకులెంట్ జాతి మొక్క. ఈ మొక్క గాలిని పూర్తి స్థాయిలో కాలుష్య రహితం చేస్తుంది. ఎంతలా అంటే... ఒక ఇంటిని రిఫ్రెష్ చేయడానికి ఒక్క మొక్క చాలు. వాతావరణంలోని ఫార్మాల్డిహైడ్‌ని తొలగించి, ఎన్నో ఔషధగుణాలను అందిస్తుంది. దీనిని వంటగది కిటికీ దగ్గర పెట్టుకుంటే ఎంతోమేలు. కిచెన్‌లో గ్యాస్ స్టవ్ నుండి వెలువడే ఫార్మాల్డిహైడ్‌ని పూర్తిగా శోషించుకుంటుంది.

స్పైడర్ ప్లాంట్ (రిబ్బన్ ప్లాంట్)

ఇంటిని శుభ్రపరిచే క్రమంలో స్ప్రే చేసినప్పుడు వెలువడే రసాయనాలను శోషించుకోడం స్పైడర్ ప్లాంట్ ప్రత్యేక లక్షణం. అన్ని నర్సరీల్లో లభించే అతి సామాన్యమైన మొక్క. తక్కువ నీటితో పెరుగుతుంది. దీనిని వరండాలో కానీ, బాత్‌రూమ్ దగ్గర, రోడ్డుకు ఇరువైపులా, కిటికీల దగ్గర పెట్టుకోవడం ఉత్తమం.

చైనీస్ ఎవర్‌గ్రీన్ (ఆగ్లోనెమ మోడెస్టమ్)

ఇది అధిక మొత్తంలో ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. బెంజీన్, ఫార్మాల్డిహైడ్‌లాంటి టాక్సిన్‌లను తొలగిస్తుంది. ఇంట్లో అలంకరణగా పెంచడం వల్ల అదృష్టం కలిసొస్తుందని ఆసియా ఖండంలోని కొన్ని దేశాల్లో నమ్ముతారు. ఈ మొక్కని గ్యాసోలిన్ కారక ప్రదేశాల్లో, కార్పెటింగ్ ఏరియాల్లో పెంచుకోవచ్చు.



రబ్బర్ ప్లాంట్ (ఫైకస్ రోబస్టా)



ఇది అధిక మొత్తంలో ఆక్సిజన్ విడుదల చేసి O_2 స్థాయిలను పెంచుతుంది. ఫార్మాల్డిహైడ్ వంటి విషవాయువులను తొలగిస్తుంది. ఖాళీ ప్రదేశంలో, సూర్యకాంతి పడేలా పెట్టుకుంటే మంచిది. దీని మందమైన ఆకులు సూర్య కాంతిని తట్టుకుని, ముదురు రంగులో అందంగా కనిపిస్తాయి. ఇది బోన్సాయిలో కూడా లభిస్తుంది.

మనీ ప్లాంట్(ఎపిప్రైరెమ్నమ్ ఆరియమ్)

అందరి ఇళ్లలో విరివిరివిగా పెంచుకునే ఈ మొక్క కార్బన్ మోనాక్సైడ్, బెంజిన్, ఫార్మాల్డిహైడ్ తదితర కారకాలకు సహజ విరుగుడుగా పని చేస్తుంది. దీనిని బెడ్ రూమ్‌లో, ఫర్నీచర్ దగ్గర పెంచుకోవాలి. అంతేకాకుండా ఎక్కువ కాలం మూసి ఉంచే గదుల్లో, స్టోర్ రూమ్‌లో ఉంచడం వల్ల ఫలితాన్నిస్తుంది.

స్నేక్ ప్లాంట్ (సెన్సివేరియా లారెంటీ)

పాము చర్మంపై చారలను పోలి ఉండే ఈ మొక్క ఇంట్లోని బెంజిన్, ఫార్మాల్డిహైడ్, గ్జైలీన్‌తో పాటు ట్రిక్లోరో ఇథైలిన్‌ను తొలగిస్తుంది. సాధారణంగా దీనిని కార్పొరేట్ ఆఫీసుల్లో, రెస్టారెంట్లలో పెంచుతుంటారు. దీని పెంపకం కోసం ప్రత్యేక జాగ్రత్తలు అవసరంలేదు. నెలకు ఒకటీ, రెండు సార్లు నీరు పోస్తే చాలు. కాంతి తగిలేలా అమర్చుకోవాలి. దీనిని కార్పెటింగ్ ఏరియాలో, రబ్బరు వస్తువులు, శుభ్రపరచి ఉంచిన వస్తువుల వద్ద ఏర్పాటు చేసుకోవాలి.

డంబ్ కేన్(లొయొపాడ్ లిల్లీ)



వెడల్పుగా ఉండే వీటి ఆకులు అతి తొందరగా గాల్లో కలుషితాలను తొలగిస్తుంది. ఈ మొక్క కాస్త విషకారిణి..దీని నుంచి వచ్చే పసరు తాకకుండా చూసుకోవాలి. తాకితే నీటితో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. దీనిని ఫర్నీచర్ దగ్గర్లో పెంచుకుంటే మంచి ఫలితాలను ఇస్తుంది.

ఇవే కాకుండా డ్రాసేన, బాంబూ ప్లామ్ వంటి పలు మొక్కలు అతి త్వరగా పెరిగి గాలిలోని కాలుష్య కారకాలను తొలగిస్తాయి.



రైడర్ ప్రియాంక

ఓవైపు వృత్తి.. మరోవైపు హాబీ

మహిళలంటే వంటింటికే పరిమితం అనే అపోహలను చెరిపేస్తూ.. అన్నింటిలోనూ పోటీకి సిద్ధమని నిరూపిస్తున్నారు నేటి మహిళలు.. కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఆటల్లోనూ ముందడుగేస్తున్నారు. ఎంత కష్టమైనా.. ఎదురు నిలిచి.. గెలిచి చూపిస్తున్నారు.. అంతటితో ఆగకుండా మరోవైపు కుటుంబ బాధ్యతలను భారంగా కాకుండా ఎంతో నిబద్ధతతో చక్కదిద్దుతూ ముందుకు సాగుతున్నారు ఎన్టీపీసీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రియాంక భుయాన్. గుర్రపు స్వారీలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూ.. నలుగురికీ రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారు.

చిన్ననాటి కల..

అస్సాంలోని గువహటిలో జన్మించాను. అక్కడే నా బాల్యం గడిచింది. మూడేళ్ల వయసప్పుడు అమ్మ ఇచ్చిన ఓ గ్రీటింగ్ కార్డులో తొలిసారిగా గుర్రం బొమ్మ చూశాను. అప్పటి నుంచి గుర్రాలంటే పిచ్చి. కాస్త పెరిగాక గుర్రపు స్వారీపై ఆసక్తి పెరిగింది. కానీ ఆర్థిక పరిస్థితులు అందుకు సహకరించలేదు. గుర్రాన్ని దగ్గరి నుంచి చూడటమే విశేషం. కానీ ఇప్పుడు గుర్రం స్వారీ చేస్తూ పోటీల్లో పాల్గొనడం, పతకాలు సాధించడం నాకే ఆశ్చర్యం అనిపిస్తుంది.

ఎన్నో ఆటంకాలు...

వృత్తిలో భాగంగా 2020లో రాయ్‌పూర్ బదిలీ అయ్యాను. కుటుంబం నుంచి దూరంగా ఉండటంతో ఒంటరిగా ఫీలయ్యేదాన్ని. అప్పుడే హార్స్ రైడింగ్ కలకు చేరువవ్వాలని నిర్ణయించుకున్నా.. అయితే మొదట్లో ఎవరేం అనుకుంటారో అని కాస్త భయపడ్డా. పైగా మహిళలకు ఈ రంగంలో చాలా ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అయినా ధైర్యం చేసి ట్రైనింగ్‌సెంటర్‌లో చేరాను. ట్రైనింగ్‌సెంటర్‌కు వెళ్లి గుర్రాలను చూడగానే ఎగిరి గంతేశాను. అయితే ప్రాక్టీస్ సమయంలో కింద పడి గాయాలయ్యాయి. వాటన్నింటినీ దాటుకుని ముందుకెళ్లాను. ఢిల్లీలో జరిగిన పోటీలో కాంస్య పతకం గెలుచుకున్నా.

ఓ వైపు వృత్తి.. మరోవైపు హాబీ.. చాలా మంది ఈ రెంటిలో ఏదో ఒక్కదానికే ప్రాధాన్యం ఇస్తారు. అతికొద్దిమంది మాత్రమే ఈ రెంటినీ బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగుతారు.. అలా రెంటిలోనూ గుర్తింపు తెచ్చుకోడం అంత సులువేం కాదు.. అందునా ఓ మహిళ ఇలా మల్టీ టాస్కింగ్ చేయడం చెప్పుగోదగ్గ విషయం.. పైగా అతి కష్టతరమైన గుర్రపు స్వారీలో రాణించడమంటే ఎంతో గుండె ధైర్యం కూడా ఉండాలి.. అలా గుర్రపు స్వారీలో రాణిస్తూనే.. ఎన్టీపీసీలో మేనేజర్‌గా బిజీగా ఉంటూ.. మరోవైపు రచయిత్రిగానూ రాణిస్తున్నారు.. నగరానికి చెందిన ప్రియాంక భుయాన్. పలువురికి రోల్‌మోడల్‌గా నిలుస్తున్న ఆమె అనుభవాలు సాక్షితో పంచుకున్నారు... ఆ వివరాలు మీకోసం..

– సాక్షి, సిటీ బ్యూరో



- ఎన్టీపీసీలో మేనేజర్‌గానూ బిజీ
- జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం
- రచయితగానూ మంచి గుర్తింపు

గుర్రపు స్వారీలో రాణిస్తున్న ప్రియాంక

రాయడమూ ఇష్టమే..

గుర్రపు స్వారీతో పాటు పుస్తకాలు రాయడమూ హాబీ. ఇప్పటివరకూ మూడు పుస్తకాలు రాశాను. వాటికి పాఠకుల నుంచి స్పందన వచ్చింది. కురుక్షేత్రంలో మహిళల గురించి ప్రపంచానికి పరిచయం చేయాలని నా తపన. అందుకే వీలు చిక్కినప్పుడల్లా పుస్తకాలు రాస్తుంటాను.



ఆ బాండింగ్ ప్రత్యేకం..

హార్స్ రైడింగ్ నేర్చుకోవడమే కాదు.. గుర్రంతో మంచి అనుబంధం ఉండాలి. ఎంత బాండింగ్ ఉంటే అంత అద్భుతంగా రాణించగలుగుతాం. ఒక్కోసారి గుర్రాలు మనకు సహకరించవు. దీనివల్ల గాయాలు కావొచ్చు. ప్రాణాలు కూడా పోవచ్చు. ముందస్తు జాగ్రత్తలతో పాటు గుర్రంతో స్నేహం చేయాలి. కుదిరితే సొంత గుర్రం కొనుక్కోవడం మంచిది.

ధర ఎక్కువే..

గుర్రాల్లో చాలారకాలుంటాయి. స్వారీలకు వేడి రక్తం ఉన్న విదేశీ గుర్రాలను వాడుతుంటారు. వాటిని దిగుమతి చేసుకోవడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఒక్కోదాని ఖరీదు రూ.30 నుంచి రూ. 40 లక్షలు ఉంటుంది. దీనికి పన్ను అదనం. దేశవాళీ గుర్రాలు అయితే కాస్త తక్కువ ధరకు దొరుకుతాయి. కానీ అనుకున్నన్ని సాహసాలు, మిరాకిల్స్ కష్టం. నేనూ ఓ గుర్రాన్ని కొనుక్కున్నా. కాకపోతే దురదృష్టవశాత్తు కొన్ని నెలలకే క్యాన్సర్‌తో మరణించింది. గుర్రాన్ని పెంచడమూ ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే.



'ఐఐఐడీ షోకేస్' ఎక్స్‌పో..

జూన్ 28 నుంచి 3 రోజుల పాటు ప్రదర్శన...

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా ఈ నెల 28 నుంచి 30 వరకూ ప్రతిష్టాత్మక 'ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ గీ – 2024' ప్రదర్శనను నిర్వహించనున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చాప్టర్‌లోని ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు ఏర్పాటు చేస్తున్న ఈ ఎక్స్‌పోను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని శుక్రవారం హైటెక్స్‌లో నిర్వహించారు. కన్వీనర్ రాకేష్ వాసు సీ.ఎస్, చైర్‌పర్సన్ అర్.పల్లవి అంచూరి మాట్లాడుతూ ఇంటీరియర్ డిజైన్, ఆర్కిటెక్చర్ పరిశ్రమ నిపుణులను, సామాన్యులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ ఎక్స్‌పో ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిజైన్ ఇంటెలిజెన్స్ థీమ్‌తో నిర్వహిస్తున్న 5వ ఎడిషన్ ఎక్స్‌పోలో ఐఐఐడీ జాతీయ అధ్యక్షులు ఆర్.సరోష్ వాడియా ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ఫెలోషిప్ సమావేశంలో దక్షిణాఫ్రికా–జోహన్నెస్‌బర్గ్‌కు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ పీటర్ రిచ్, లోటస్ ఆర్కిటెక్ట్స్ నుంచి సిద్ధార్థ్ తల్వార్ పాల్గొని ఔత్సాహికులకు అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు.



బైక్‌పై లడఖ్.. జర్నీ

జగద్గిరిగుట్ట: సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు హైదరాబాద్ నుంచి లడఖ్‌కు బుల్లెట్ బైకులపై వెళ్లారు. కుత్బుల్లాపూర్, చింతల్‌కు చెందిన ఆరుగురు స్నేహితులు ఈ నెల 1న ప్రయాణం మొదలుపెట్టి 17 రోజుల అనంతరం తొమ్మిది రాష్ట్రాలను దాటుతూ తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. చింతల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన అవినాష్, చరణ్‌జీత్ సింగ్, వినయ్, ఇస్తియాక్, ప్రదీప్, మనోజ్‌లు సుమారు 6400 కిలోమీటర్లు ఈ జర్నీ చేశారు. సంవత్సరం ముందు నుండి 1000–2000 కిలోమీటర్లు బైకులపై తిరుగుతూ జర్నీకి కావాల్సిన వస్తువులు తెలుసుకున్నారు. 17,582 అడుగుల ఎత్తులో ఉన్న లడఖ్, ఖర్దుంగ్లకు చేరుకున్నారు. ట్రిప్ పూర్తి చేసుకొని వచ్చిన వీరికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు.



దేశమంతా...'దక్కన్ చాయ్'

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న రుచుల చాయ్‌లున్నా హైదరాబాద్ చాయ్ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. టీ కొట్టు నుంచి స్టార్ హోటళ్ల వరకూ హైదరాబాద్ ఫ్లేవర్ చాయ్‌కు ప్రత్యేక ఆదరణ ఉంది. ఈ హైదరాబాదీ చాయ్‌ను విశ్వవ్యాప్తం చేయనున్నామని, మొదట దక్షిణాది రాష్ట్రాలకు పరిచయం చేయనున్నామని ప్రముఖ శ్రేయాస్ గ్రూప్ చైర్మన్ శ్రీనివాస్ రావు తెలిపారు. ఇప్పటికే సినిమా, ఈవెంట్, ఫ్యాషన్ రంగాల్లో తమదైన గుర్తింపు పొందిన శ్రేయాస్ గ్రూప్ 'దక్కన్ చాయ్'తో మార్కెట్‌లోకి ప్రవేశించింది. దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని శుక్రవారం బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఏర్పాటు చేశారు. దేశంలో చాయ్ వ్యాపారం 11 వేల మిలియన్ డాలర్ల మార్కెట్‌కు కలిగి ఉందని, మరో పదేళ్లలో ఇది 18 వేల మిలియన్ డాలర్లకు చేరుకోనుందని తెలిపారు. ఇందులో హైదరాబాదీ చాయ్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో భాగంగా తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో దాదాపు వెయ్యి ఔట్‌లెట్లను ప్రారంభించనున్నామని శ్రీనివాస్ రావు అన్నారు. ఇలా వెయ్యి మంది ఎంటర్‌ప్రూనర్స్‌తో పాటు 2 వేల మందికి హైదరాబాదీ చాయ్ తయారీ పై శిక్షణ అందించి ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు. 'దక్కన్ చాయ్' వ్యవస్థాపకులు వీరన్న మాట్లాడుతూ.. ఇప్పటికే 250 ఔట్‌లెట్‌లతో దక్కన్ చాయ్ తేనీటి విందును అందిస్తున్నాయని, శ్రేయాస్ మీడియా భాగస్వామ్యంతో ఈ సేవలు మరింత పెరగనున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఆర్ట్ ఆఫ్ టీ మేకింగ్ కోర్సుతో యువతకు శిక్షణ అందించనున్నామని, కొత్తవాళ్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తామే స్టాల్ వేదికగా డిజిటల్ యాడ్స్, వాల్ మార్ట్ రూపంలో అదనంగా ఆదాయం వచ్చేలా రూపకల్పన చేశామన్నారు.

నేడు రోంకిణి గుప్తా సంగీత ప్రదర్శన



మ్యాస్ట్రో ఎ.ఆర్.రెహ్మాన్ అభిమాన గాయకురాలిగా గుర్తింపు పొందిన ప్రముఖ నేపథ్య గాయని రోంకిణి గుప్తా నగరంలో తన సంగీత ప్రదర్శన శనివారం నిర్వహిస్తున్నారు. తెలంగాణ టూరిజంతో కలిసి సాయంత్రం 6.30 గంటలకు మాసబ్ ట్యాంక్ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ (జెఎన్ఎఫ్ఎయు) ఆడిటోరియంలో రోంకిణి గుప్తా హిందుస్థానీ క్లాసికల్ సంగీతాన్ని సుర్మండల్ పేరిట అందించనున్నారు. మూడు సార్లు ఉత్తమ మహిళా నేపథ్య గాయనిగా నామినేట్ అయిన రోంకిణి గుప్తా ఇటీవల స్వర కోకిల లతా మంగేష్కర్ అవార్డును సైతం అందుకున్నారు.

పోటరీ వర్క్‌షాప్

కుండలు, మట్టి పాత్రల తయారీ కళలో శిక్షణ అందించే పోటరీ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. శిక్షణార్థులకు అవసరమైన మెటీరియల్ అంతా నిర్వాహకులే అందిస్తారు.

తేదీ: జూన్ 23, స్థలం: హౌజ్ ఆఫ్ గార్మెంట్, జూబ్లీహిల్స్, సమయం మధ్యాహ్నం 3గంటల నుంచి

రీల్స్ ఎడిక్షన్





ఈ వ్యసనం ప్రాణాంతకం

15 సెకన్ల రీల్స్ కోసం నూరేళ్ల జీవితాన్ని పణంగా పెడుతోంది నేటి యువత.
రీల్స్‌ను ప్రవేశపెట్టిన ఇన్‌స్టాగ్రామ్‌కు నేడు మన దేశంలో
24 కోట్ల మంది ఖాతాదార్లు ఉన్నారు.
వీరిలో యువతీ యువకులే ఎక్కువ.
ఆన్‌లైన్ ఫేమ్ కోసం చిత్ర విచిత్రమైన రీల్స్ చేయడానికి ప్రాణాలతో రిస్క్ చేస్తున్నారు.
గొడవలు, మర్డర్లు జరుగుతున్నాయి.
మంచి ఫోన్ల కోసం దొంగలుగా మారుతున్నారు.
తల్లిదండ్రులు, సమాజం ఈ వ్యసనాన్ని ఇలాగే వదిలేయాలా?

పూణెలో పోలీసులు వెంటనే స్పందించారు. మిహిర్ గాంధీ (27), మీనాక్షి సలూంఖే (23) లను అరెస్ట్ చేశారు. వీరి మీద ఐ.పి.సి 336 సెక్షన్ కింద కేసు పెట్టారు. దీని ప్రకారం ఆరు నెలలకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉంటాయి. ఎందుకు వీరిని అరెస్ట్ చేశారు. ప్రాణాంతకమైన రీల్ చేశారు కనుక.

ఏం జరిగింది?

పూణెకు చెందిన మిహిర్ గాంధీ, మీనాక్షి వారం క్రితం ఒక రీల్ విడుదల చేశారు. అందులో ఎత్తయిన భవంతి మీద మిహిర్ ఉంటే అతని చేయి ఆధారంగా మీనాక్షి గాల్లో వేలాడింది. అతను వదిలేసినా ఆమె చేయి జారినా మీనాక్షి కచ్చితంగా చనిపోయి ఉండేది. ఈ రీల్ బయటకు రాగానే అందరూ మండి పడ్డారు. ఈ రీల్స్ పిచ్చికి శిక్ష పడాలని డిమాండ్ చేశారు. వెంటనే పోలీసులు స్పందించారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి...

ఇటీవల లక్నోలోని వాటర్ ట్యాంక్ ఎక్కి రీల్ చేయబోయిన శివాంశ్ అనే కుర్రాడు కాలు జారి పడి మరణించాడు. దాంతో లక్నోలో పెద్ద ఎత్తున రీల్స్ అడిక్షన్ మీద చర్చ జరిగింది. ఇలా రీల్స్ చేస్తున్న వారికి గౌరవ మర్యాదలు ఇవ్వడం మానేయాలని తల్లిదండ్రులు, సమాజం అందరూ కోరారు. ఇలాగే రాజస్థాన్‌లోని పాలిలో ఒక యువకుడు తన తల్లిదండ్రులతో కలిసి ఒక రీల్ చేయాలనుకున్నాడు. తల్లిదండ్రులు వారించే సరికి కోపమొచ్చి వారిని చంపేశాడు. టీనేజ్ యువతీ యువకులు ఇలా మతిలేని పనులు చేస్తున్నారనుకున్నా వైవాహిక జీవితంలో ఉన్న స్త్రీలు, పురుషులు కూడా రీల్స్‌కు బలవుతున్నారు. చత్తిస్‌గఢ్‌లోని భిలాయ్‌కి చెందిన ఒక మహిళ రీల్స్ చేయడానికి అడిక్ట్ అయ్యి భర్త వారించాడని ఆత్మహత్య చేసుకుంది. కర్నాటకలో ఒక భార్య రీల్ కోసం కన్నడ గీతానికి గంతులేసిందని మనసు నొచ్చుకున్న భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. బిహార్‌లో రీల్స్ వద్దన్నందుకు భర్తనే చంపేసింది మరో మహిళ. రీల్స్ కోసం యువతీ యువకులు రకరకాల డ్రస్సులు వేసుకోవడం, ప్రాంక్‌లు చేయడం, ట్రాఫిక్‌లో ప్రమాదకరమైన ఫీట్లు చేయడం చివాట్లు తినడం ఆనవాయితీగా ఉంది. సమర్థమైన మంచి కంటెంట్‌తో కొందరు గుర్తింపు పొంది లాభపడుతున్నా మరెందరో ఈ రీల్స్ అనే వధ్యశిలపై తలలు తెగిపడుతున్నారు.

> **ఏం చేయాలి?**
> - కుటుంబం కూచుని సోషల్ మీడియా అడిక్షన్ గురించి మాట్లాడుకోవాలి.
> - మనం చేసే రీల్స్ వల్ల కుటుంబానికి మంచిదా చెడ్డదా చర్చించుకోవాలి.
> - ఇతరులు తమ గురించి ఏమనుకుంటున్నారో నిజాయితీగా చెప్పే మిత్రుల సలహా అడగాలి.
> - పిల్లలు చేసే ప్రతి పనికీ అంగీకారం ఉండదని తల్లిదండ్రులు వారిని ఒప్పించేలా చెప్పాలి.
> - సైకియాట్రీ సాయం పొందాలి.
> - విలువలతో కూడిన గుర్తింపు, గౌరవం మాత్రమే శాశ్వతమని తెలుసుకోవాలి.

గుర్తింపు కోసం పోరాటం...

గతంలో డార్విన్ మనుగడ కోసం పోరాటం అన్నాడు. ఇవాళ ప్రభుత్వ పథకాల వల్ల మనుగడకు ఢోకా లేదు. ఇక మిగిలింది గుర్తింపు. టీనేజ్‌లో ఉన్న యువతీ యువకులకు గుర్తింపు బడాలన్న కోరిక విపరీతంగా ఉంటుంది. గతంలో బాగా చదివి, ర్యాంక్ తెచ్చుకుని, మంచి ఉద్యోగం తెచ్చుకుంటే గుర్తింపు వచ్చేది. ఇప్పుడు ఒక్క రీల్‌తో గుర్తింపు వస్తోంది. ఫాలోయెర్ల వల్ల ఇదంతా 'తమ కుటుంబం' అనే భావన వారిలో కలుగుతుంది.



ఎప్పుడూ కల్పిత ప్రపంచంలో ముక్కూ మొహం ఎరగని వారి కామెంట్ల ద్వారా వారు సంతృప్తి పొందుతుంటారు. మరిన్ని కామెంట్ల కోసం మరిన్ని రీల్స్ చేయాలి. మరిన్ని రీల్స్ కోసం మరిన్ని రిస్క్‌లు తీసుకోవాలి అనే భావన బలపడుతుంది.

253 కోట్ల మంది...

ప్రపంచ వ్యాప్తంగా రోజూ 253 కోట్ల మంది రీల్స్ చూస్తున్నారని ఒక అంచనా. 2020లో టిక్‌టాక్ బ్యాన్ అయ్యాక ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను ప్రవేశ పెట్టింది. 15 నుంచి 30 సెకండ్ల వీడియోలు పోస్ట్ చేసుకునే అవకాశం ఇచ్చింది. దాంతో ఇన్‌స్టా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేరుతో కంటెంట్ క్రియేటర్ల పేరుతో గుర్తింపు కోసం అందరూ రంగంలో దిగారు. మన దేశంలో 8 కోట్ల మంది కంటెంట్ క్రియేటర్లు ఉన్నారంటే (కంటెంట్ ద్వారా ఆదాయం పొందాలని చూస్తున్నారంటే) అంతమందికి మంచి కంటెంట్ దొరికే అవకాశం లేదు. అందుకే పిచ్చి స్టంట్స్ చేయడానికి కూడా వెనుకాడటం లేదు. ఒకప్పుడు సెల్ఫీ పిచ్చితో చాలామంది ప్రాణాలు కోల్పోతే ఇప్పుడు రీల్స్ వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు.

అసలు ప్రపంచంలో...

యువతీ యువకులు అసలైన ప్రపంచంలో ఉండేలా చేస్తే వారిని ఈ రీల్స్ నుంచి బయటకు తేవచ్చు. 'సోషల్ మీడియా అడిక్షన్ వల్ల ఆత్మహత్య ఆలోచనలతో ఉన్న వారు పెరుగుతున్నారు' అని సైకియాట్రిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులతో దూరం, నిరుద్యోగం, ఈజీ మనీ కోసం వెంపర్లాట, క్షణిక గుర్తింపుతో వస్తున్న మానసికానందం, విలువల శూన్యత ఇవన్నీ యువతను రీల్స్ వైపు నెడుతున్నాయి. స్నేహితులతో ఆటలు, మాటలు కూడా లేనంతగా (అవతలివారు కూడా ఫోన్లతో బిజీగా ఉండటం వల్ల) ఒంటరితనానికి విరుగుడును సోషల్ మీడియాలో వెతుక్కుంటూ మరింత ఒంటరి బౌతున్నారు. తల్లిదండ్రులు.

స్ఫూర్తి

కర్నాటకకు చెందిన 'బజ్ ఉమెన్' అనే స్వచ్ఛంద సంస్థ గ్రామీణ ప్రాంత మహిళలను దృష్టిలో పెట్టుకొని ఇంటింటికి వెళ్లి ఫైనాన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, లీడర్‌షిప్ లాంటి అంశాలలో శిక్షణ ఇస్తోంది. అలా బజ్ ఉమెన్ గ్రామీణ ప్రాంతాల ప్రజలలో చైతన్యాన్ని తీసుకువచ్చింది.

మార్పు దిశగా బజ్ ఉమెన్

సురక్షితం కాని మాంసం తినడం వల్ల అనారోగ్యానికి గురైంది కర్నాటకలోని కదారిపుర గ్రామానికి చెందిన కాంతలక్ష్మి. ఇలాంటి మహిళల కోసం ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారం గురించి అవగాహన కలిగించడంలో విజయం సాధించింది బజ్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ.

'బజ్ గ్రీన్ ప్రోగ్రాం' ద్వారా దేశీ పౌల్ట్రీ నుంచి ఆర్గానిక్ ఫామింగ్ వరకు ఎన్నో విషయాలు తెలుసుకోగలిగారు గ్రామీణప్రాంత మహిళలు.

'బజ్ గ్రీన్ ప్రోగ్రాం' ద్వారా తాను తెలుసుకున్న విషయాలను ఆచరణలోకి తీసుకువచ్చింది కాంతలక్ష్మి. యాభై వేలు అప్పు చేసి ఫామ్ మొదలుపెట్టింది. ఆ తరువాత బంగాళదుంప, మునగకాయలు, ఉల్లిపాయలు, బీన్స్... వంటి వాటితో కిచెన్ గార్డెన్ కూడా మొదలుపెట్టింది.



గ్రామీణ మహిళలతో ఉతార నారాయణ్

సొంతంగా కూరగాయలు పండించడం ద్వారా కాంతలక్ష్మి డబ్బును ఆదా చేస్తోంది.

పౌల్ట్రీ ఉత్పత్తులను అమ్మడం ద్వారా మరి కొంత ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

'యాక్టివ్ క్లైమేట్ ఛేంజ్ ఏజెంట్'గా కూడా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన కాంతలక్ష్మి తన ఇంటి చుట్టుపక్కల ప్రదేశాలలో మామిడితో సహా రకరకాల మొక్కలు నాటింది. నీటిని రీసైక్లింగ్ చేసే పద్ధతుల గురించి కూడా నేర్చుకుంది.

'బజ్ గ్రీన్' ద్వారా తాను నేర్చుకున్న విషయాలను తనలాంటి మహిళలకు చెబుతూ వారిని చైతన్యవంతులను చేస్తోంది కాంతలక్ష్మి.

'బజ్ ఉమెన్' ద్వారా పర్యావరణం నుంచి నీటి పొదుపు వరకు ఎన్నో విషయాలు తెలుసుకున్న ఆరు లక్షలమంది మహిళలలో కాంతలక్ష్మి ఒకరు.

'లింగ వివక్షతను అధిగమించడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి. పేదరికం నుంచి బయట పడడానికి, వాతావరణ మార్పుల గురించి తెలుసుకోవడానికి గ్రామీణ ప్రాంత మహిళలకు మా సంస్థ సహాయపడుతుంది. సాధికారత దిశగా అడుగులు వేసే శక్తి వారిలో ఉంది' అంటుంది 'బజ్ ఉమెన్' వ్యవస్థాపకులలో ఒకరైన ఉతార నారాయణ్.

కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ఉతార నారాయణ్ 'జనగ్రహ' అనే స్వచ్ఛంద సంస్థలో పని చేసింది. ఎన్నో కార్యక్రమాల్లో భాగం అయింది. ఆ అనుభవం జ్ఞానం 'బజ్ ఉమెన్'ను ముందుకు నడిపించడానికి ఉపయోగపడింది.

ఆడపిల్లలు, మగపిల్లలను సమానంగా చూసే కుటుంబ వాతావరణంలో పెరిగింది నారాయణ్. అయితే చుట్టుపక్కల మాత్రం ఆడపిల్లల పట్ల చాలా వివక్ష కనిపించేది. ఆర్థికంగా భర్త మీద ఆధారపడే మహిళలే ఎక్కువగా కనిపించేవారు. ఈ నేపథ్యంలో గ్రామీణ మహిళలను చైతన్యవంతం చేసే కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించుకుంది.

'బజ్ ఉమెన్' సంస్థ కార్యక్రమాలలో భాగంగా ఎన్నో గ్రామాలకు వెళ్లి, ఎంతోమంది మహిళలతో మాట్లాడింది ఉతార నారాయణ్. ఆ అనుభవాలు సంస్థను మరింత ముందుకు నడిపించడానికి ఉపయోగపడుతున్నాయి.

స్టాండ్‌అప్ కమెడియన్‌గా ఎదిగింది

చీపురు పట్టిన చేత్తోనే మైక్ అందుకుంది..!



దీపికా మహత్రే

ఇంటి పెద్ద అనారోగ్యంతో మంచం పట్టాడు.
ఐదుగురు వ్యక్తులు ఉన్న ఆ ఇల్లు నిలబడాలంటే ఇంటి ఇల్లాలు ఏదో ఒక పని వెతుక్కోవాలి.
గృహిణిగా ఇంటి పనులు చేయగలగడం తప్ప మరే నైపుణ్యాలు లేవు.
అలాంటి దిక్కుతోచని వాతావరణం నుంచి దీపికా మహత్రే ఓ కొత్త మార్గంవైపు నడిచింది.
భర్త, ముగ్గురు పిల్లల పోషణ కోసం ఇళ్లలో పనిమనిషిగా చేరింది.
ముంబయ్ లోకల్ రైళ్లలో ఇమిటేషన్ జ్యువెలరీని అమ్మేది.
అక్కడ నుంచి స్టాండ్ అప్ కమెడియన్‌గా ఆమె జీవితం ఓ గొప్ప మలుపు తీసుకుంది.
వెబ్‌సిరీస్‌లో నటించే అవకాశం పొందింది. పనిమనిషి నుంచి స్టాండ్ అప్ కమెడియన్‌గా ఎదిగిన ఆమె కథ ఎంతో మంది జీవితాలను ఉత్సాహపరుస్తుంది.

"నా భర్త ఆరోగ్యం బాగోలేనప్పుడు ఐదుగురు సభ్యులతో కూడిన నా కుటుంబానికి ఏకైక జీవనోపాధిని అయ్యాను. మా ప్రాథమిక అవసరాలు తీర్చడానికి ఊరగాయలు, పాపడ్‌లను అమ్మడం మొదలు పెట్టాను. పేషెంట్ కేర్ సర్వీస్‌లో పనిచేశాను. ఐదు ఇళ్లలో వంటపని చేయడం ప్రారంభించాను. అంతేకాదు, ముంబై లోకల్ ట్రైన్‌లో ఇమిటేషన్ జ్యువెలరీని అమ్మడం ప్రారంభించాను. ఇన్ని పనులు చేయడం కష్టమయ్యేది. కానీ, కష్టసమయాల్లో నా కుటుంబాన్ని నిలబెట్టాలి, నా పిల్లలకు మెరుగైన విద్యను అందించాలి. ఈ తపనతోనే అన్ని పనులూ ఓర్పుగా చేసేదాన్ని.

మలుపు తిప్పిన కామెడీ..

అయితే, అన్ని పనుల్లో ఒక ప్రత్యేకత ఉందన్న విషయం నాకే తెలియదు. నలుగురిని నవ్విస్తూ, సరదాగా మాట్లాడుతుంటాను. నేను పని చేసేచోట యజమాని ఫ్రెండ్ ఒకరు నా టాలెంట్‌ను ప్రదర్శించమని ప్రోత్సహించాడు. సంపన్నుల కుటుంబాల్లో వ్యక్తుల ద్వంద్వ ప్రమాణాలను ఎగతాళి చేస్తూ, నేను గమనించిన అసమానతలను హాస్యంగా హైలైట్ చేస్తూ చెప్పాను. చాలా మెచ్చుకున్నారు. కామెడీ అనేది ఒక అద్దంలా పనిచేస్తుంది, మార్పును కలిగిస్తుంది. ఒక రిపోర్టర్ నా వినోద భరితమైన స్టోరీని పత్రికలో వేశారు. హాస్యనటుడు అదితి మిట్టల్ నా స్టోరీ చూసి, నన్ను కలవడానికి వచ్చారు. నా కామెడీని కొనసాగించమని ప్రోత్సహించారు. నేను దానిని అనుసరించాను.

పరిశీలనే కంటెంట్..

నాలాంటి మహిళలకు ఆర్థికంగా సొంతకాళ్లపై నిలబడే అవకాశం రావడం నిజంగా అదృష్టమే. వేదికపైన అందరి దృష్టిని ఆకర్షించాలంటే నాదైన ప్రత్యేకత చూపించాలి. నేను ఎక్కడ పనిచేసినా ఆ ఇంటి యజమానుల పనులను గమనించేదాన్ని. అదే నా కంటెంట్‌గా మారింది. నాలాగా పని చేస్తున్నవారు ఎదుర్కొంటున్న వాస్తవాలను వెలుగులోకి తేవడం మొదలుపెట్టాను. పనిమనిషికి కూర్చునేందుకు ఎక్కడా సరైన స్థలం కూడా ఉండదు. ఎంత కష్టంగా అనిపించినా అన్నీ పెదవి చాటున బిగపట్టుకొని పనులు చేస్తూ ఉండాలి. నా పరిశీలనలే నా హాస్య కచేరీలకు సరైన కథనాలను అందించాయి. వెబ్‌సిరీస్ 'బ్యాడ్ గర్ల్' వంటి ప్రాజెక్ట్‌లలో కూడా పాల్గొన్నాను. సామాజిక అసమానతలను హాస్యంలో మేళవించి నిర్భయంగా ప్రస్తావిస్తూ రావడంతో పాల్గొన్న వేదికలన్నీ వినోదానికే కాదు న్యాయం వైపుగా కూడా ఆలోచింపజేసేవి.

పెరిగిన ఆదరణ

జనాదరణ పెరగడంతో టెలివిజన్ ఛానెల్స్ నుండి ఆఫర్లు రావడం పెరిగాయి. పేరు, డబ్బు రావడంతో కుటుంబం కూడా ఆర్థికంగా నిలదొక్కుకుంది. 'స్మైల్ ఈజ్ మై సూపర్ పవర్' అని నమ్మకంగా చెబుతాను. ఎందుకంటే, నా జీవితంలో ఒడిదొడుకులను చిరునవ్వుతోనే ఎదుర్కొంటున్నాను. జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించాలనే నమ్మకాన్ని ఏ ఒక్కరూ కోల్పోనక్కర్లేదు. అందుకు వయసుతో, పరిస్థితులతో కూడా సంబంధం లేదు. ఇప్పుడు నేను నడివయసు మహిళను. ఎవరైనా సరే 40, 50 లేదా వందేళ్లయినా సరే జీవితం పట్ల అభిరుచిని కోల్పోవాల్సిన అవసరం లేదు. మనం వృద్ధాప్యానికి దగ్గర కావచ్చు. కానీ, మనలో ఎప్పటికీ ఒక చిన్న అమ్మాయి ఉంటుంది. ఆమె ఎప్పటిలాగే ఉత్సాహంగా ఉంటుంది. మనం కూడా అలాగే ఉండాలి. ఏదైనా సమస్య మన తలుపు తడితే భయపడకుండా, విచారంగా లేకుండా చిరునవ్వుతో స్వాగతించాలి. ఎలాంటి సవాళ్లు వచ్చినా సానుకూల దృక్పథంతో ఎదుర్కోవడం మొదలుపెడితే మన మార్గం కూడా సులువు అవుతుంది.

స్టాండ్ అప్ కామెడీ పురుష ఆధిపత్య ప్రపంచానిదే. అలాంటి రంగంలో నాకంటూ ఓ సముచిత స్థానాన్ని సంపాదించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నిరాశావాదంతో కొట్టుమిట్టాడేవారికి నా జీవితమే ఓ గొప్ప ఉదాహరణ. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక గొప్పదనం ఉంటుంది. దానిని వెలికి తీసేందుకు ఎవరికి వారు ప్రయత్నం చేస్తూనే ఉండాలి' అంటోంది ఈ స్టాండప్ కమెడియన్.

త్రినేత్రం

ఈ ఛాయాచిత్రాలు...

కన్నీటి కథలు... పోరాట రూపాలు

వన్యప్రాణులపై ఆసక్తితో సరదాగా కెమెరాను చేతపట్టింది నాన్కీ సింగ్. అయితే ఇప్పుడు ఆమె దృష్టి కోణం మారింది. తన కెమెరా ఇప్పుడు బాధితుల చేతిలో ఆయుధం. వారి పోరాట పటిమకు నిదర్శనం.

సరదాగా 'రీల్స్' చేసే వయసులో సామాజిక విషయాలపై దృష్టి పెట్టింది 22 సంవత్సరాల నాన్కీ సింగ్.

దిల్లీకి చెందిన నాన్కీ సింగ్ యాసిడ్-ఎటాక్ సర్వైవర్‌ల జీవితాలను 'ఏ జర్నీ టు ది మిర్రర్' పేరుతో డాక్యుమెంటేషన్ చేసింది.

ఈ ఛాయాచిత్ర ప్రదర్శన దిల్లీలోని స్టైయిన్లెస్ గ్యాలరీలో జరుగుతోంది.

'సర్వైవర్' అన్న సానుకూల మాటేగానీ యాసిడ్-సర్వైవర్‌లలో చాలామంది జీవితాలు నరకప్రాయంగా ఉంటాయి. సానుభూతికే పరిమితమైనవారు సహాయానికి ముందుకు రాకపోవచ్చు. అంతకు ముందు వరకు ఆత్మీయులుగా ఉన్న వారు అందనంత దూరం జరగవచ్చు.

'బతికాను సరే, ఎలా బతకాలి' అనేది వారికి ప్రధాన సమస్య అవుతుంది. ఉద్యోగం చేయడం నుంచి సొంతంగా చిన్నపాటి వ్యాపారం మొదలు పెట్టడం వరకు ఏదీ సులభం కాదు.

యాసిడ్ దాడి బాధితుల గురించి ఎన్నో ఆర్టికల్స్ చదివిన నాన్కీసింగ్ తన కాలేజి అసైన్‌మెంట్‌లో భాగంగా వారి కష్టాలు, కన్నీళ్లు, పోరాటాలను ప్రపంచానికి చూపించాలనుకుంది. అలా 'ఏ జర్నీ టు ది మిర్రర్' ప్రాజెక్ట్ పట్టాలకెక్కింది. ఈ ప్రాజెక్ట్ కోసం నోయిడాలోని ఛాన్స్ అనే ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించింది. యాసిడ్ దాడి బాధితులకు వైద్య, ఆర్థిక సహాయాలు అందించడంతో పాటు పునరావాసం కలిగించే సంస్థ ఇది.

నాన్కీ ఎంతోమంది సర్వైవర్స్‌తో మాట్లాడింది. మొదట్లో మాట్లాడడానికి ఇబ్బంది పడ్డారు.

అయితే పరిచయం స్నేహంగా మారిన తరువాత మనసు విప్పారు.



యాసిడ్ దాడి బాధితులతో నాన్కీ సింగ్

అమ్మాయిపై యాసిడ్ దాడి జరిగింది... అనే వార్త చదివి 'అయ్యో' అనుకుంటాం. దాడి చేసిన దుర్మార్గుడిని తిట్టుకుంటాం. వాడిని కఠినంగా శిక్షించాలని కోరుకుంటాం.

ఎవరి పనుల్లో వారు బిజీ కావడం వల్ల, ఎవరి లోకంలో వారు ఉండిపోవడం వల్ల 'ఘటన తరువాత యాసిడ్ బాధితురాలి పరిస్థితి ఏమిటి?' అనేదానిపై దృష్టి మళ్లదు.



యాసిడ్ దాడి బాధితురాలికి బర్త్‌డే సెలబ్రేషన్స్

> **వారి కుటుంబంలో భాగం అయింది...**
>
> 'ఏ జర్నీ టు ది మిర్రర్' ప్రాజెక్ట్ పూర్తికాగానే 'ఇక సెలవు' అనే మాట నాన్కీసింగ్ నోట వినిపించలేదు. 'మళ్లీ మళ్లీ కలుస్తుంటాను' అన్నది నాన్కీ. అనడమే కాదు తనకు సమయం దొరికినప్పుడల్లా యాసిడ్ దాడి బాధితుల దగ్గరికి వెళుతుంది. వారితో సరదాగా కబుర్లు చెబుతుంది. వారి కష్టసుఖాల్లో భాగం పంచుకుంటుంది.
>
> 'నాన్కీతో మాట్లాడుతుంటే కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లుగానే ఉంటుంది. ఆమెతో మాట్లాడితే సంతోషమే కాదు ఆత్మస్థైర్యం కూడా వస్తుంది' అంటారు యాసిడ్ దాడి బాధితులు.

ఒక్కొక్కరిది ఒక్కో కథ.

కన్నీళ్లు తెప్పించే కథ.

చుట్టూ చీకటి కమ్ముకున్న క్లిష్ట సమయంలోనూ వెలుగు దారుల వైపు అడుగులు వేసిన కథ.

సబ్జెక్ట్‌తో ఫొటోగ్రాఫర్ మమేకం అయినప్పుడు చిత్రం ప్రేక్షకుల దగ్గరికి వేగంగా వెళుతుంది. తాను ఎంచుకున్న సబ్జెక్ట్‌కు అనుగుణంగా సాంకేతిక జ్ఞానాన్ని వాడుకుంది నాన్కీ.

ఉద్దేశపూర్వకంగానే బ్లాక్ అండ్ వైట్‌లో ఫొటోలు తీసింది. దీనికి కారణం కలర్ ఫొటోలు సబ్జెక్ట్‌కు అతీతంగా వేరే అంశాలపై దృష్టి మళ్లిస్తాయి.

బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు మాత్రం నేరుగా సబ్జెక్ట్‌పై దృష్టి పడేలా చేస్తాయి.

'అద్దంలో నా ముఖం చూసుకోవాలంటే అంతకుమించిన నరకం లేదు అని చాలా మంది అమ్మాయిలు నాతో పదేపదే చెప్పారు' అంటుంది నాన్కీ సింగ్.

అలాంటి వారిలో ధైర్యం నింపింది నాన్కీ. 'మీరేమీ తప్పు చేయలేదు. కష్టాలను తట్టుకొని మీరు చేస్తున్న జీవన పోరాటం సాధారణమైనదేమీ కాదు' అని చెప్పింది.

కాలేజి ప్రాజెక్ట్‌లో భాగంగా యాసిడ్ దాడి బాధితుల దగ్గరికి వచ్చిన నాన్కీ వారితో కలిసి ప్రయాణం చేస్తోంది. వారి కష్టాలను పంచుకుంటోంది.

'ఫొటోగ్రాఫర్లు, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్‌లు వారి దగ్గర రావడం కొత్తేమీ కాదు. అయితే నేను మాత్రం ప్రాజెక్ట్‌కు అతీతంగా వారితో అనుబంధం పెంచుకోవాలనుకున్నాను. వారికి ఏది నచ్చుతుందో, నచ్చదో తెలుసుకోవాలనుకున్నాను. వారిని కేవలం బాధితులుగా చూడడం నాకు ఇష్టం లేదు' అంటుంది నాన్కీ సింగ్.

తనకు ఎప్పుడు వీలైతే అప్పుడు వారి దగ్గరకు వెళ్లి మాట్లాడి వస్తుంది. వారి బర్త్‌డేకు కేక్ కట్ చేయించి ఫొటోలు దిగుతుంది.

తన ఫొటో ఎగ్జిబిషన్‌ల ద్వారా యాసిడ్ దాడి బాధితుల కోసం నిధుల సేకరణ చేస్తోంది.

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా తన ప్రయాణం మొదలు పెట్టింది నాన్కీ. ఇందులో భాగంగా దక్షిణాఫ్రికాకు వెళ్లింది. అక్కడినుంచి తిరిగి వచ్చిన తరువాత దిల్లీలోని చాందిని చౌక్ లాంటి ప్రాంతాల్లో స్ట్రీట్ ఫొటోగ్రఫీ చేసింది. ఫొటోగ్రఫీలోని సాంకేతిక విషయాలపై పట్టు కోసం న్యూయార్క్‌లోని 'స్కూల్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్'లో చేరింది.

నాన్కీ సింగ్ ఇప్పుడు సామాజిక విషయాలపై దృష్టి పెట్టింది. మహిళల హక్కుల నుంచి వారిపై జరుగుతున్న హింస వరకు ఎన్నో అంశాలపై ఫొటో ప్రాజెక్ట్‌లు చేస్తోంది.



శుక్రవారం ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మాజీ సీఎం వైఎస్ జగన్

కొలువుదీరిన ఏపీ కొత్త శాసనసభ

- సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- తొలి రోజే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను అగౌరవపర్చిన ప్రభుత్వం
- సీఎం తర్వాత విపక్ష నేత ప్రమాణ స్వీకారం చేయడం సభ సంప్రదాయం
- ఆ సంప్రదాయాన్ని కాదని మంత్రుల తర్వాత విపక్ష నేత జగన్‌కు అవకాశం
- 2019లోబాబుకు సముచిత గౌరవం కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కొత్త శాసన సభ కొలువుదీరింది. 16వ శాసన సభ సమావేశాలు శుక్రవారం ఉదయం 9:46 గంటలకు ప్రారంభం అయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో తొలి రోజు శాసన సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. శనివారం అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. తొలిరోజే ప్రభుత్వం సభా సంప్రదాయాలను తుంగలో తొక్కింది. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అగౌరవపర్చింది. వాస్తవంగా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రతిపక్ష నేతకు అవకాశం కల్పించాలి. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయాలి. అయితే, ప్రతిపక్ష నేతకు సముచిత గౌరవం ఇవ్వకుండా మంత్రులందరూ ప్రమాణం చేసిన తర్వాత చివర్లో ప్రమాణం చేయించింది. తద్వారా మున్ముందు ప్రతిపక్షం పట్ల తన వైఖరి ఏ విధంగా ఉండబోతోందో మొదటిరోజే స్పష్టంగా తెలియజెప్పింది. సీట్ల సంఖ్య ఎలా ఉన్నా 40 శాతం ఓట్లతో అత్యంత బలమైన పార్టీగా వైఎస్సార్‌సీపీ ఉంది. ఆ పార్టీకి ఉన్న ప్రజా బలాన్ని కూడా ప్రభుత్వం విస్మరించింది. 2019లో కొత్త అసెంబ్లీ కొలువుదీరినప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి విపక్ష నేత చంద్రబాబును సముచితంగా గౌరవించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తర్వాత ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుతో ప్రమాణం చేయించింది. ఆ తర్వాతే ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, మిగిలిన సభ్యులు ప్రమాణం చేశారు. ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వాలనే సదుద్దేశంతో అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చంద్రబాబు చేత సీఎం తర్వాత ప్రమాణం చేయించి గౌరవించింది. ఇప్పుడు ప్రతిపక్ష హోదా లేదనే సాకుతో టీడీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మంత్రులందరి తర్వాత ప్రమాణం చేయించి సభా సంప్రదాయాలను కాలరాసింది. నిజానికి ప్రతిపక్ష హోదాకు 10 శాతం సభ్యులు ఉండాలనే నిబంధనం ఏ చట్టంలోనూ లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభ తొలి స్పీకర్ మౌలంకర్ సభలో ఇచ్చిన రూలింగ్‌ను కొన్ని రాజకీయ పార్టీలు అవసరార్థం వాడుకుంటున్నాయి. కానీ చాలా రాష్ట్రాలలో అధికారపార్టీలు మాజీ ముఖ్యమంత్రులకు, ప్రతిపక్ష నేతలకు సముచిత గౌరవం ఇస్తూ సత్సాంప్రదాయాలను పాటిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం అలాంటి వాటిని తుంగలో తొక్కింది. 2019లో టీడీపీకి వచ్చిన ఎమ్మెల్యే సీట్లు 23 మాత్రమే. అప్పట్లో ఆ పార్టీకి ఇప్పుడు వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఓట్లకన్నా తక్కువ ఓట్లే వచ్చాయి. గెలిచిన 23 మంది సభ్యుల్లోనూ ఐదుగురు టీడీపీని వీడి బయటకు వెళ్లిపోయారు. మిగిలిన కొద్ది మందిలో ఇంకొందరు ఆ పార్టీని వీడేలా చేసి, చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలనుకుంటే అప్పటి ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆ ఆలోచన లేకపోవడంతో టీడీపీ సభ్యుల జోలికి వెళ్లకుండా చంద్రబాబుకు అప్పటి ప్రభుత్వం ప్రతిపక్ష నేత గౌరవం ఇచ్చింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా సభా సాంప్రదాయాలను పక్కనపెట్టి మాజీ ముఖ్యమంత్రిని అవమానపరిచేలా వ్యవహరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్షరక్రమంలో సభ్యుల ప్రమాణం

శాసన సభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత సీఎం చంద్రబాబునాయుడు, తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆ తర్వాత మంత్రులు అక్షర క్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం సభలోని సభ్యులందరికీ వైఎస్ జగన్ అభివాదం చేశారు. ఆ తర్వాత మహిళా ఎమ్మెల్యేలతో, అనంతరం అక్షర క్రమంలో మిగిలిన ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సహా వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన 11 మంది, జనసేనకు చెందిన 21 మంది, బీజేపీకి చెందిన 8 మంది, టీడీపీకి చెందిన 131 మంది ఎమ్మెల్యేలు మొత్తం 171 మంది ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా ఏడుగురు సభ్యులు ఆంగ్లంలో, మిగిలిన వారందరూ తెలుగులో ప్రమాణం చేశారు. టీడీపీకి చెందిన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, కాకినాడ ఎమ్మెల్యే వి. వెంకటేశ్వరరావు (కొండబాబు) వ్యక్తిగత కారణాలతో ప్రమాణస్వీకారం చేయలేదు. వీరితో ప్రొటెం స్పీకర్ శనివారం ప్రమాణం చేయిస్తారని తెలిసింది. తొలి రోజు శాసన సభ సమావేశం మొత్తం ప్రమాణ స్వీకారాలతోనే నడిచింది.

సీబీఐ దృష్టిలో దస్తగిరి ఓ వీఐపీ

వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ4)ని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఓ నిందితుడిగా కాకుండా వీఐపీలా చూసిందని ఎంపీ అవినాశ్‌రెడ్డి తరపు న్యాయవాది తెలిపారు. ఇలాంటి దర్యాప్తు సంస్థను ఎన్నడూ చూడలేదని చెప్పారు. హత్య కేసులో అప్రూవర్‌గా మారినందున తనను నిందితుల జాబితా నుంచి తొలగించి సాక్షిగా పరిగణించాలని కోరుతూ దస్తగిరి హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి రఘురాం శుక్రవారం వాదనలు చేపట్టారు. సీబీఐ తరఫున అనిల్ తల్వార్ వాదనలు వినిపించారు. కోర్టు అనుమతిస్తే దస్తగిరిని నిందితుల జాబితా నుంచి తొలగించి, సాక్షుల జాబితాలో చేర్చడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. అనంతరం అవినాశ్ తరపు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఓ కరుడుగట్టిన హంతకుడు అప్రూవర్‌గా మారినంత మాత్రాన సాక్షిగా పేర్కొనడం ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇలాగైతే ఇకపై హత్యలు చేసిన వారంతా అప్రూవర్‌గా మారి శిక్ష లేకుండా బయటకొస్తారని చెప్పారు. ఇది సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ దశలో దస్తగిరి న్యాయవాది కల్పించుకొని వీఐపీ అనడంపట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ముమ్మాటికీ దస్తగిరిని సీబీఐ ఓ వీఐపీలానే చూసిందని ఉమామహేశ్వర్‌రావు పునరుద్ఘాటించారు. నిందితుల న్యాయవాదుల వాదనల సందర్భంగా సీబీఐ న్యాయవాది కలుగజేసుకోవడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీబీఐ వాదించేటప్పుడు తాము జోక్యం చేసుకోలేదన్నారు. తదుపరి విచారణను న్యాయమూర్తి జూలై 5కు వాయిదా వేశారు. న్యాయవాదులు సాయివంశీ, రవీందర్‌రెడ్డి, టీఎల్ నయన్‌కుమార్‌రెడ్డి పలువురు నిందితుల తరఫున వాదించారు.

ఆర్టీసీ ఖాతాలను పునరుద్ధరించండి

పీఎఫ్ అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు చెల్లించడం లేదంటూ స్తంభింపజేసిన టీజీఎస్ ఆర్టీసీ బ్యాంక్ ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు స్పష్టం చేసి తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేసింది. రూ.940 కోట్ల పీఎఫ్ బకాయిలు పేరుకుపోవడంతో టీజీఎస్ ఆర్టీసీకి చెందిన బ్యాంక్ ఖాతాలను పీఎఫ్ అధికారులు స్తంభింపజేయడం తెలిసిందే. ఈ కారణంగా ఆర్టీసీ రోజువారీ కార్యకలాపాలకు నగదు లేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందంటూ రవాణా అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై సీవీ భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. టీజీఎస్ ఆర్టీసీ తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి పీఎఫ్ బకాయిలున్నాయని స్పష్టం చేశారు. విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పీఎఫ్ అధికారులు ఒక్క టీజీఎస్ ఆర్టీసీ ఖాతాలను స్తంభింపజేయడం సరికాదన్నారు. ఆర్టీసీ విభజన జరిగినా.. ఈపీఎఫ్ విభజన జరగలేదని వివరించారు. ఇంకా ఏపీఎస్ ఆర్టీసీ పేరుపైనే పీఎఫ్ ఖాతాలున్నాయని వెల్లడించారు. పీఎఫ్ బకాయిలపై ఇరు రాష్ట్రాలు చర్చలు జరుపుతుండగానే అధికారులు ఖాతాలను స్తంభింపజేయడం సమర్థనీయం కాదని వాదించారు. 2014, మార్చి నుంచి 2019, సెప్టెంబర్ వరకు పీఎఫ్ అంచనాల్లోనూ లోపాలున్నట్టు తెలిపారు. పీఎఫ్ నగదు చెల్లింపులో టీజీఎస్ ఆర్టీసీ ఆలస్యం చేయలేదని, ఒకవేళ జరిగినా అది దీర్ఘకాలికం కాదని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్-2, రికవరీ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

అసెంబ్లీలో ఘనంగా జయశంకర్ వర్ధంతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అర్పించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా అసెంబ్లీ కమిటీ హాల్‌లోని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి గుత్తా నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీయడంతో పాటు, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకు కొట్లాడారన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శేరి సుభాష్ రెడ్డి, అసెంబ్లీ సెక్రెటరీ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో.. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లోనూ జయశంకర్ వర్ధంతి సందర్భంగా పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బండ ప్రకాశ్ తోపాటు మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బాల్క సుమన్, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు జయశంకర్ విగ్రహానికి పూలమాల వేశారు.

ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్, హరీశ్‌రావు

'ఆరు దశాబ్దాల పాటు తెలంగాణను స్వప్నించి, శాసించి మూడు తరాల ఉద్యమకారులకు ప్రేరణగా నిలిచిన మహా వ్యక్తి జయశంకర్' అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరుబాట చూపిన ఉద్యమ నేత, స్వరాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన సిద్ధాంతకర్త జయశంకర్' అని మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

నీట్‌పై స్పందించకపోతే కేంద్ర మంత్రులను తిరగనివ్వం

- అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతలు బల్మూరి, శివసేనారెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి. చిత్రంలో దానం, అంజన్ కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: నీట్ పరీక్షల్లో అక్రమాల కారణంగా 24 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని, అందుకే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను తెలంగాణలో తిరగనీయబోమని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డిలు హెచ్చరించారు. నీట్ పరీక్షలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం ఉదయం గాంధీభవన్ నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్, శివసేనాలు మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బిహార్, గుజరాత్, హరియాణాలలో పేపర్ లీక్ అయినట్టు ఆధారాలతో సహా రుజువైందని, అందుకే ఎవరూ పట్టించుకోకూడదన్న ఉద్దేశంతో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజున నీట్ ఫలితాలు విడుదల చేశారని అన్నారు. ఈ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై సందేహాలున్నందున ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు తాము పోరాడుతామని, ఈనెల 24న పార్లమెంటును ముట్టడిస్తామన్నారు.

ఏపీ శాసనసభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు



సాక్షి, అమరావతి: ఏపీ శాసన సభాపతి (స్పీకర్)గా టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్పీకర్ ఎన్నికను శనివారం నిర్వహించాలని గవర్నర్ నిర్ణయించారని, నామినేషన్లను కార్యదర్శికి సమర్పించాలని ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం సభకు తెలిపారు. ఆ తర్వాత అయ్యన్నపాత్రుడి తరఫున డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల, సత్యకుమార్, పయ్యావుల అసెంబ్లీ కార్యదర్శికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ పదవికి ఒక నామినేషనే రావడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం ఈ విషయాన్ని సభలో ప్రకటిస్తారు.

సాక్షి రియల్టీ

ఎలాంటి ఇళ్లు కొంటున్నారంటే?



సాక్షి, హైదరాబాద్: గృహ కొనుగోలుదారుల అభిరుచులు మారుతున్నాయి. గతంలో ధర ప్రాధాన్యంగా గృహ కొనుగోలు నిర్ణయం తీసుకునే కస్టమర్లు.. ఆ తర్వాత వసతులను పరిగణనలోకి తీసుకున్నారు. కానీ, కరోనా తర్వాతి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో ఇంటి ఎంపికలోనూ ఇదే ధోరణి అవలంభిస్తున్నారు. ధర, సౌకర్యాలే కాదు ఇంటికి చేరువలో ఎలాంటి మౌలిక వసతులు ఉన్నాయి? ఆఫీసులు, వినోద కేంద్రాలు ఎంత దూరంలో ఉన్నాయనే అంశాలను సైతం పరిగణనలోకి తీసుకొని గృహాలను ఎంపిక చేస్తున్నారు.

- నేటి యువతరం ఇల్లు కొనేటప్పుడు చుట్టుపక్కల ఆరోగ్య సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది ప్రధానంగా చూస్తున్నారు. అత్యవసరంలో ఎంత సమయంలో ఆసుపత్రికి చేరుకోవచ్చు? ఎంత సమీపంలో వైద్య సదుపాయాలు ఉన్నాయనేది ఆరా తీస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్దల ఆరోగ్య అవసరాల రీత్యా వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.
- చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనాపాలనా చూసే డే కేర్ సౌకర్యాలు ఉండాలని గృహ కొనుగోలుదారులు చూస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కార్యాలయాలకు వెళితే పిల్లలను చూసుకోవడం కష్టం అవుతుంది. వర్క్ ఫ్రం హోమ్ ఉన్నా పిల్లలపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. కాబట్టి కమ్యూనిటీలో డే కేర్ సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు.
- ఇల్లు కొనేటప్పుడు ఆఫీసుకు ఎంత దూరంలో ఉందనేది కస్టమర్ల ప్రాథామ్యాలలో ఒకటి. నగరంలో ట్రాఫిక్‌లోనే అధిక సమయం వృథా అవుతుంది కాబట్టి దూరం, సమయం అనేది ప్రధానంగా మారా యి. ప్రజా రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటున్నారు.
- వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు షాపింగ్ మాల్స్, థియేటర్లు ఎంత దూరంలో ఉన్నాయనేవి కూడా కొనుగోలు ఎంపికలో భాగమైపోయాయి. పచ్చని ప్రకృతిని ఆస్వాదించాలని కోరుకునే నివాసితులు శివారు ప్రాంతాలలో కొంటున్నారు.

వావ్.. వీకెండ్ హోమ్స్!



సాక్షి, హైదరాబాద్: వీకెండ్ వస్తే చాలు పబ్‌లోనో, సినిమాలకో, షికార్లకో గడిపే నగరవాసులు క్రమంగా ఇంటి పట్టునే ఉంటున్నారు. అయితే ఈ ఇళ్లు కాస్త ప్రత్యేకమైనవే. కాలుష్యం, రణగొణ ధ్వనులకు దూరంగా, ప్రశాంతమైన పచ్చని వాతావరణంలో ఉండే వీకెండ్, హాలిడే హాలిడే హోమ్స్‌కు పరుగులు పెడుతున్నారు. ఎంచక్కా కుటుంబంతో కలిసి వారాంతాన్ని అక్కడే గడిపేస్తున్నారు. కరోనాతో మొదలైన వీకెండ్ హోమ్స్‌కు ఆదరణ క్రమంగా పెరిగిపోయింది.

- స్థానికులే కాదు ప్రవాసులు, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ కూడా వీకెండ్ హోమ్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. లగ్జరీ హాలిడే హోమ్ కోసం కోట్లలో ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని లగ్జరీ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ సంస్థ ఇండియా సోథెబీ ఇంటర్నేషనల్ నివేదికలో వెల్లడైంది. 200ల మంది హెచ్‌ఎన్‌ఐల అభిప్రాయాల ఆధారంగా దేశంలోని 8 ప్రధాన నగరాలలో సర్వే నిర్వహించింది. వచ్చే రెండేళ్లలో స్థిరాస్తి కొనుగోళ్లకు సుముఖంగా ఉన్నామని చెప్పిన 75 శాతం మంది ప్రాధాన్యతలు గమనిస్తే.. 89 శాతం మంది ఖరీదైన అపార్ట్‌మెంట్లు, బంగ్లాలు, హాలిడే హోమ్స్ కొనుగోళ్లకు ఆసక్తిగా ఉన్నారు. 11 శాతం మంది ఖరీదైన వాణిజ్య ఆస్తులను కొనుగోలు చేయాలని భావిస్తున్నారు.
- ప్రవాసులు, హెచ్‌ఎన్‌ఐలు వారి జీవనశైలిని మెరుగుపరుచుకోవడం, మంచి పెట్టుబడులను సొంతం చేసుకునే ఆలోచనతో ఉన్నారు. గత రెండు మూడేళ్లలో హెచ్‌ఎన్‌ఐలు, అల్ట్రా హెచ్‌ఎన్‌ఐలు ఖరీదైన ఇళ్లను సొంత వినియోగానికే కొనుగోలు చేశారు.

నిర్మాణంలో నాణ్యత.. గడువులోగా అప్పగింత!

సాక్షి, హైదరాబాద్: నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ, గడువులోగా కొనుగోలుదారులకు అపార్ట్‌మెంట్లను అందించడమే రాంకీ ఎస్టేట్స్ లక్ష్యం. ఈక్రమంలో ప్రగతినగర్‌లో 8.1 ఎకరాల్లో రాంకీ వన్ హార్మొనీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుంది. మొత్తం ఏడు టవర్లలో 803 యూనిట్లను నిర్మిస్తున్నామని సంస్థ ఎండీ నంద కిశోర్ తెలిపారు. ఫేజ్-1కు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) లభించిందని, దీంతో కొనుగోలుదారులు జీఎస్టీ చెల్లించకుండానే కలల గృహాన్ని సొంతం చేసుకోవచ్చు. అభివృద్ధి చెందిన ప్రాంతంలో, మెరుగైన రవాణా, మౌలిక వసతులు, ఆధునిక సౌకర్యాలతో ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఫేజ్-2కు కూడా ఓసీ వస్తుందని తెలిపారు. ప్రముఖ విద్యా, వైద్య సంస్థలు, వినోద కేంద్రాలకు చేరువలో హార్మొనీ ప్రాజెక్ట్ ఉందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫేజ్ 1, ఫేజ్ 2లకు ప్రత్యేక క్లబ్‌హౌస్‌లు, రూఫ్ టాప్ స్విమ్మింగ్ పూల్‌లు వంటి ఆధునిక వసతులు ఉంటాయి.





ఆరోగ్యానికి శుభయోగం

ఆధునిక జీవితంలో ఒత్తిడి వల్ల ఎంతోమంది కష్టపడుతున్నారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను ఎక్కువగా ఉపయోగించడం, ఎక్కువసేపు కూర్చుని పని చేయడం వంటి వాటి వల్ల శారీరక, మానసిక సమస్యలు వస్తున్నాయి. వాటికి చెక్ పెట్టే శక్తి యోగాకు ఉంది. ఎందుకంటే ఇది శారీరక వ్యాయామం మాత్రమే కాదు... మానసిక, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉంటుంది. ప్రశాంతతను అందిస్తుంది. అయితే యోగాను ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి, ఎవరెవరు చేయవచ్చు, యోగా చేసేవారు తీసుకోవాల్సిన ఆహారం ఏమిటి... వంటి వివరాలు తెలుసుకుందాం.

తీసుకోవాల్సిన ఆహారం

యోగా చేసేవారికోసం కొత్త ఆహార మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆ మార్గదర్శకాల ప్రకారం శరీరానికి, మనసుకు అనువైన ఆహారాన్ని తినాలని చెబుతోంది. శాకాహారం తినడమే యోగా సాధనకు మంచిదని వివరిస్తోంది. ముప్పై ఏళ్ల వయసు దాటిన వ్యక్తి లేదా అనారోగ్యం, అధిక శారీరక శ్రమ వంటివి పడుతున్న వ్యక్తులు తప్ప మిగతా వారంతా రోజుకు రెండు పూటలా తింటే సరిపోతుందని, అది కూడా శాకాహారం తింటే మంచిదని చెబుతోంది ఆయుష్.

యోగా వల్ల ఈ రోగాలన్నీ పరార్

ప్రతిరోజూ యోగా చేస్తే శారీరక, మానసిక ప్రయోజనాలు ఎన్నో కలుగుతాయి. వైద్య పరిశోధనలు కూడా యోగా అనేక రోగాలను దూరం పెడుతుందని చెబుతున్నాయి. ప్రతిరోజూ పావుగంట నుంచి అరగంట పాటు యోగా చేస్తే చాలు శారీరక దృఢత్వంతో పాటు కార్డియోవాస్కులర్ అనారోగ్యాలు వచ్చే అవకాశం చాలా వరకు తగ్గుతుంది. మధుమేహం, అధిక రక్తపోటు, శ్వాసకోశ వ్యాధులు వంటివాటిని అదుపు చేయడంలో యోగా ఎంతో సాయపడుతుంది.

జీవనశైలి సంబంధిత రుగ్మతలను తట్టుకోవడంలో యోగా ముందుంటుంది. ఎవరైతే డిప్రెషన్, మానసిక ఒత్తిడి, అలసట వంటి వాటితో బాధపడుతున్నారో వారు ప్రతిరోజు యోగా చేయడం చాలా అవసరం. ఇక మహిళలు ప్రతిరోజు యోగా చేయడం వల్ల నెలసరి సమస్యలు తగ్గుతాయి. యోగా అనేది ఆరోగ్యమైన శరీరాన్ని అందించడమే కాదు, మనసును స్థిరంగా ఉంచే ప్రక్రియ. ఇది సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి ఒక దారి చూపిస్తుంది.

యోగా చేసే ముందు...

ఒక ప్రశాంతమైన వాతావరణాన్ని ఎంచుకోండి. యోగాభ్యాసాన్ని ఖాళీ పొట్టతో చేయాలి లేదా తేలికపాటి ఆహారాన్ని తిన్నాక చేయాలి. మరీ బలహీనంగా అనిపిస్తే గోరువెచ్చని నీటిలో కాస్త తేనె వేసుకొని తాగి యోగా చేయవచ్చు.

యోగాభ్యాసాన్ని చేసే ముందు మూత్రాశయం, పేగులు ఖాళీగా ఉండాలి. అంటే ముందుగానే కాలకృత్యాలు తీర్చుకుంటే మంచిది. తేలికైన, సౌకర్యవంతమైన కాటన్ దుస్తులను ధరించి చేయడం మంచిది. ఎవరైతే తీవ్ర అలసటతో, అనారోగ్యాలతో బాధపడుతున్నారో అలాంటివారు యోగా చేయకూడదు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులు గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా యోగాభ్యాసాలను చేసేముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. గర్భం ధరించిన వారు, నెలసరిలో ఉన్నవారు కూడా యోగా చేసే ముందు యోగా నిపుణులను సంప్రదించడం ఉత్తమం.

ఇవి కలిపితే ఆరోగ్యం పెరుగుతుంది



పెరుగు ఆరోగ్యానికి మంచిదని తెలిసిందే. పెరుగులో కొందరు పంచదార కలిపి తింటే, ఉప్పు కలిపి మరికొందరు తింటుంటారు. గతవారం మనం పెరుగుతో కలిపి తినకూడని పదార్థాలేమిటో చెప్పుకున్నాం. పెరుగులో ఏయే పదార్థాలు కలిపి తింటే ఏయే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో ఈ వారం చూద్దాం.

జీలకర్రతో...

పెరుగు, జీలకర్ర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఒకవేళ మీరు అధిక బరువు సమస్యతో బాధపడుతుంటే, పెరుగుతో జీలకర్ర పొడిని కలిపి తింటే, దాని నుంచి మంచి ప్రయోజనం పొందుతారు. దీని కోసం ముందు జీలకర్రను కాస్త వేయించి, ఆ తర్వాత దానిని పెరుగులో కలుపుకుని తినాలి. జీర్ణ సమస్యలు, కడుపునొప్పి తగ్గుతాయి.



సైంధవ లవణంతో...

పెరుగు, సైంధవ లవణం కలిపి తింటే ఎసిడిటీ తగ్గుతుంది.

కోడి గుడ్డుతో...

పెరుగు, కోడిగుడ్డు కలిపి తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి మేలు జరుగుతుంది. మీకు పంటి నొప్పి ఉంటే, ఈ రెండు పదార్థాలను కలిపి తినండి. ఇది నోటి అల్సర్ల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది.

నల్ల ఉప్పుతో...


నల్ల ఉప్పును పెరుగు లో కలిపి తీసుకుంటే

వాముతో...

కొంత వాము తీసుకుని ఓ కప్పు పెరుగులో కలిపి తినాలి. దీనివల్ల నోటిపూత, పంటి నొప్పి, ఇతర దంత సంబంధ సమస్య లు తొలగుతాయి.

చక్కెరతో కలిపితే...

పెరుగు చక్కెర... ఈ రెండింటిని కలిపి తినడం వల్ల దగ్గు తగ్గుతుంది. వంటికి తక్షణ శక్తి లభిస్తుంది.



మిరియాల పొడితో...

ఈ రెండింటినీ కలిపి తీసుకుంటే మలబద్ధకం పోతుంది.

పండ్ల ముక్కలతో కలిపితే...

పెరుగులో తాజా పండ్లముక్కలు కలిపి తింటే వ్యాధి నిరోధకత పెరుగుతుంది.

తేనెతో...

పెరుగులో ప్రొటీన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. తేనెలో రోగనిరోధక శక్తి సమృద్ధిగా ఉంటుంది. ఈ రెండు పోషకాలు కలిసి ఎముకలను దృఢపరుస్తాయి కాబట్టి ఎముకల నొప్పులు ఉన్న వారు పెరుగు, తేనె కలిపి తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. ఇంకా బోలు ఎముకల వ్యాధి, రక్తం గడ్డకట్టడం, అతిసార, ఊబకాయం, కీళ్లనొప్పులు, గుండె, రక్త సంబంధిత వ్యాధులు నయం అవుతాయి.





పచ్చిబఠానీలతో ప్రయోజనాలు



పచ్చి బఠానీలు ఆహారానికి రుచిని ఇస్తాయి. ఆరోగ్యాన్ని పెంచుతాయి. పచ్చి బఠానీల తింటుంటే కలిగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము. బఠానీలు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి, దీనివల్ల గుండెపోటు, రక్తపోటు వంటి వ్యాధులను నివారించవచ్చు. పచ్చి బఠానీలు తీసుకోవడం వల్ల షుగర్ లెవెల్ కూడా అదుపులో ఉంటుంది.

బఠానీలలో ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి, దీని కారణంగా ఆకలి తగ్గుతుంది. ఇది జింక్, రాగి, మాంగనీస్, ఇనుము కలిగి ఉంటుంది. దానివల్ల వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల క్యాన్సర్ రిస్క్ తగ్గుతుంది. ముఖ్యంగా కడుపు క్యాన్సర్ నిరోధిస్తాయి. పచ్చి బఠానీలను తినడం వల్ల యవ్వనంగా కనిపిస్తారు, వృద్ధాప్య ప్రభావం త్వరగా కనిపించదు.

పచ్చి బఠానీలో ప్రొటీన్‌తోపాటు ఉండే విటమిన్ కె బోలు ఎముకల వ్యాధిని నివారించడంలో సహాయపడుతుంది. పచ్చి బఠానీలను తినడం జ్ఞాపకశక్తిని పెంచడంలో సహాయపడుతుంది. గర్భిణులకు పచ్చి బఠానీలు మేలు చేస్తాయి. ఇది గర్భస్థ శిశువుకు తగిన పోషణను కూడా అందిస్తుంది. ఇంకా ఇవి రుతుక్రమ సమస్యలలో కూడా సాయం చేస్తాయి.

మీకు తెలుసా?

- సూర్యోదయానికి ముందే నిద్ర లేవాలి. ఉదయం నిద్ర లేవగానే ఒక లీటర్ గోరువెచ్చని నీళ్లు లేదా రాగి పాత్రలో నీళ్లు తాగాలి.
- నీళ్లు ఎప్పుడు తాగినా గటగటా తాగకూడదు. గుటక, గుటక మింగుతూ నిదానంగా సిప్ చేస్తూ తాగాలి.
- నీళ్లు ఎప్పుడు తాగినా కూర్చొని తాగాలి, వాష్ రూమ్‌కు వెళ్లి వచ్చిన తర్వాత నీళ్లు తాగితే మూత్ర సంబంధ వ్యాధులు వస్తాయి.
- ఉదయం పరగడుపున గ్లాను నీళ్లలో ఒక చెక్క నిమ్మరసం పిండుకొని తాగడం చాలా మంచిది.
- అన్నం తిన్న తర్వాత 500 అడుగుల నడవడం వల్ల పొట్ట రాదు. తిన్న ఆహారం తొందరగా అరుగుతుంది.
- రోజుకు పదివేల అడుగులు కనీసం నడవాలి. వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిది
- ఆహారంలో అయోడిన్ సాల్ట్ బదులు సైంధవ లవణం వాడటం ఆరోగ్యకరం.
- వంటకు సన్‌ఫ్లవర్ ఆయిల్, రిఫైండ్ ఆయిల్‌కు బదులు నువ్వుల నూనె, వేరుశనగ నూనె, కుసుమ నూనె వాడడం మంచిది.
- రాత్రి భోజనంలో అన్నము పెరుగు, రాజమా కర్రీ తినకూడదు
- రాత్రి హెవీగా తినడం వల్ల మధుమేహం, జీపీ, ఒబేసిటీ, మలబద్ధకం లాంటి సమస్యలు వస్తాయి.
- ఉదయం పూట పండ్ల రసాలు; మధ్యాహ్నం మజ్జిగ; రాత్రిళ్లు పాలూ తాగడం ఆరోగ్యకరం.

సినిమా



"ఒక నటుడికి తాను సంపాదించే డబ్బు ముఖ్యం కాదు. జనాలు గుర్తుపట్టి పలకరించినప్పుడు, నటించిన సినిమాల్లోని పాత్రల పేరుతో పిలిచినప్పుడు ఎంతో సంతృప్తిగా ఉంటుంది. ప్రేక్షకుల గుర్తింపే పెద్ద అవార్డుతో సమానం" అని నటుడు ఆనంద చక్రపాణి అన్నారు. 'దాసి' (1988) సినిమాతో నటుడిగా పరిచయమయ్యారు ఆనంద చక్రపాణి. ఆ తర్వాత సరైన అవకాశాలు లేక ఇండస్ట్రీ నుంచి వ్యాపారం వైపు వెళ్లిన ఆయన 'మల్లేశం' (2019) సినిమాతో సెకండ్ ఇన్నింగ్స్‌ని ప్రారంభించారు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంటున్న ఆనంద చక్రపాణి 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు.

ప్రేక్షకుల గుర్తింపే పెద్ద అవార్డుతో సమానం

- నటుడు ఆనంద చక్రపాణి

● నా తొలి చిత్రం 'దాసి'. ఆ తర్వాత ఐదారు సినిమాల్లో నటించినప్పటికీ సరైన గుర్తింపు రాలేదు. పైగా కొత్త అవకాశాలేవీ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడ్డాను. దీంతో ఇండస్ట్రీని వదిలి అడ్వర్టైజింగ్ ఫీల్డ్‌కి వెళ్లి, కొన్ని యాడ్ ఫిలింస్‌కి స్క్రిప్ట్ రాయడంతో పాటు దర్శకత్వం వహించాను. 'మల్లేశం' సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్‌గా చేసిన లక్ష్మణ్ యేలేగారి ద్వారా ఆ సినిమాలో నటించే చాన్స్ వచ్చింది. అందులో హీరో ప్రియదర్శి తండ్రి పాత్ర చేశాను. నా పాత్రకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. నా నటన సినీ ప్రముఖులను, సినీ విమర్శకులను, సాధారణ ప్రేక్షకుడిని సైతం భావోద్వేగానికి గురి చేసింది. నా కెరీర్‌కి ఆ మూవీ ఓ మలుపులా ఉపయోగపడింది. నా జీవితం 'మల్లేశం'కు ముందు.. 'మల్లేశం'కు తర్వాత అని చెప్పుకోవాలి. నాకు ఆ సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాత రాజ్ రాచకొండకు రుణపడి ఉంటా. ● 'మల్లేశం' తర్వాత 'వరల్డ్ ఫేమస్ లవర్, అనగనగా ఓ అతిథి, విరాట పర్వం, లవ్ స్టోరీ, నాంది, వకీల్ సాబ్, టైగర్ నాగేశ్వరరావు... ఇలా దాదాపు 45 సినిమాల్లో నటించాను. 'గెటప్' శీను హీరోగా నటించిన 'రాజు యాదవ్' చిత్రం మే 24న విడుదలైంది. ఈ సినిమాలో హీరో తండ్రిగా ట్యాక్సీ డ్రైవర్ రాములు పాత్ర చేశాను. ఇందులోని భావోద్వేగ సన్నివేశాల్లో నా నటన ప్రేక్షకుల చేత కన్నీళ్లు పెట్టించింది. నా కెరీర్‌లో 'మల్లేశం, అనగనగా ఓ అతిథి, రాజు యాదవ్' చిత్రాలు ఎంతో ప్రత్యేకం. 'మల్లేశం, అనగనగా ఓ అతిథి' చిత్రాలకు మించిన గుర్తింపు 'రాజు యాదవ్'తో వచ్చింది.

● ఒకే తరహా పాత్రలు కాకుండా ఎప్పటికప్పుడు వైవిధ్యమైన క్యారెక్టర్స్ చేయాలని ఉంది. 'ఆనంద చక్రపాణి మంచి నటుడు. ఏ పాత్రకి అయినా న్యాయం చేయగలడు' అని ప్రేక్షకులు, ఇండస్ట్రీ వర్గాల వారి నుంచి అనిపించుకోవాలన్నదే నా లక్ష్యం. ప్రస్తుతం అరడజనుకు పైగా సినిమాలు చేస్తున్నాను. 'షష్ఠి పూర్తి' చిత్రంలో రాజేంద్రప్రసాద్‌గారి ఫ్రెండ్‌గా నటిస్తున్నాను. అలాగే నిఖిల్ సిద్ధార్థ్ 'స్వయంభూ'తో పాటు 'గాంధీ తాత చెట్టు, ఉరుకు పటేలా' తదితర చిత్రాల్లో నటిస్తున్నాను. 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నా పాత్రకి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అదే విధంగా మరికొన్ని సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.

ఈసారి ప్రిపేరై వచ్చాను!


ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ, శోభన, అన్నా బెన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. భైరవ పాత్రలో ప్రభాస్, సుమతి పాత్రలో దీపిక, అశ్వత్థామ పాత్రలో అమితాబ్, సుప్రీమ్ యాక్సిన్‌గా కమల్ కనిపిస్తారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా రిలీజ్ ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. 'సమయం వచ్చింది. భగవంతుడి లోపల సమస్త సృష్టి ఉంటుందంటారు. అలాంటిది మీ కడుపున భగవంతుడే ఉన్నాడు, నేను కాపాడతా..' (అమితాబ్), 'ఎన్ని యుగాలైనా... ఎన్ని అవకాశాలు ఇచ్చినా మనిషి మారడు... మారలేదు' (కమల్) 'ఒక పెద్ద బౌంటీ... వన్ షాట్... కాంప్లెక్స్‌కి వెళ్లిపోతా..., సరే... ఇంక చాలు, ఈసారి ప్రిపేరై వచ్చాను... దా' అనే డైలాగ్స్‌తో పాటు 'మాధవా...' అనే పాట కూడా ఈ ట్రైలర్‌లో వినిపిస్తుంది. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ స్వరకర్త.

పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో...


సాయి దుర్గ తేజ్

'విరూపాక్ష' (2023) వంటి హిట్ మూవీ తర్వాత సాయి దుర్గ తేజ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా మూవీ 'ఎస్‌డీటీ 18' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంతో రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'హను–మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి 'ఎస్‌డీటీ 18' నిర్మిస్తున్నారు. ఈ చిత్రం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ – ''పీరియాడికల్ హై యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎస్‌డీటీ 18'. ఇందులో సాయి దుర్గ తేజ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ చిత్రం కోసం నిర్మించిన ఓ భారీ సెట్‌లో ప్రస్తుతం తొలి షెడ్యూల్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం రూపొందుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది.

మేమంతా శ్రామికులం


'వెన్నెల' కిశోర్

''మా ఊరు శ్రీకాకుళం... మేమంతా శ్రామికులం... స్వేదమే మూల ధనం... ఊరికీ మాకూ దూరం...' అనే పాట 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' చిత్రంలోనిది. 'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్ మూవీకి రచయిత మోహన్ దర్శకుడు. శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్ పై లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం...' అనే పాటను దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేసి మాట్లాడుతూ– ''వెన్నెల' కిశోర్‌గారి నుంచి ఓ డిఫరెంట్ మూవీని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం. ఈ చిత్రం టైటిల్ ఫన్నీగా ఉంది. యూనిట్ అందరికీ ఆల్ ది బెస్ట్'' అన్నారు. ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్ సంగీత సారథ్యంలో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. సీయా గౌతమ్, స్నేహా గుప్తా, రవితేజ మహాదాస్యం, బాహుబలి ప్రభాకర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

సినిమా అంటే నేనొక్కడినే కాదు

- ఫర్హాన్ అక్తర్



హిందీలో 'దిల్ చాహ్‌తా హై' (2001), 'లక్ష్య' (2004), 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్' (2006), 'డాన్ 2: ది కింగ్ ఈజ్ బ్యాక్ (2011)' వంటి చిత్రాలతో దర్శకుడిగా ప్రతిభను నిరూపించుకున్నారు ఫర్హాన్ అక్తర్. కానీ 'డాన్: ది కింగ్ ఈజ్ బ్యాక్' తర్వాత ఫర్హాన్ దర్శకుడిగా మళ్లీ మెగాఫోన్ పట్టలేదు. అయితే దాదాపు మూడేళ్ల క్రితం ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్ లీడ్ రోల్స్‌లో 'జీ లే జరా' సినిమాకు దర్శకత్వం వహించనున్నట్లు ప్రకటించారు ఫర్హాన్. కానీ ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లకుండానే రణ్‌వీర్ సింగ్, కియారా అద్వానీ హీరో హీరోయిన్లుగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 'డాన్ 3' ప్రకటన వచ్చింది. ఈ సినిమా కూడా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. తాజాగా ఈ విషయాలపై స్పందించారు ఫర్హాన్. ''నేను దర్శకుడిగా సెట్స్‌లోకి వెళ్లక పదేళ్లకు పైనే అయింది. నటుడిగా బిజీగా ఉండటం వల్లే డైరెక్షన్‌కి టైమ్ కుదరలేదు. 'డాన్ 3' చిత్రీకరణ వచ్చే ఏడాది ఆరంభమవుతుంది. అలాగే 'జీ లే జరా' కూడా నా దర్శకత్వంలోనే ఉంటుంది. ఈ సినిమా ప్రకటన వచ్చి చాలా టైమ్ గడిచింది. సినిమా అంటే నేనొక్కడినే కాదు. నటీనటులు, సాంకేతిక నిపుణుల కాల్షీట్స్ అన్నీ కరెక్ట్‌గా కుదరాలి. నా దర్శకత్వంలో రాబోయే నెక్ట్స్ రెండు సినిమాలు 'డాన్ 3, జీ లే జరా'నే'' అన్నారు ఫర్హాన్ అక్తర్.

బుజ్జి మేక


యువ చంద్ర కృష్ణ

యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'బుజ్జి మేక...' అంటూ సాగే పాటని రిలీజ్ చేసింది యూనిట్. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను కాలభైరవ పాడారు. ''రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక ఫ్రెష్ కాన్సెప్ట్‌తో రూపొందించిన చిత్రం 'పొట్టేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 3 పాటలు చార్ట్ బస్టర్ హిట్స్‌గా అలరిస్తున్నాయి. 'బుజ్జి మేక..' పాట భావోద్వేగాలతో సాగుతుంది'' అన్నారు మేకర్స్. అజయ్, ప్రియాంకా శర్మ, తనస్వీ చౌదరి నటించిన ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతి రాజు.

అలా పిలిస్తే సరదాగా తీసుకోలేం


శ్రుతీ హాసన్

నోరు మూసుకుని వెళ్లు అని స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఈ బ్యూటీకి ఇంతలా కోపం రావడం వెనక ఓ కారణం ఉంది. వీలు కుదిరినప్పుడల్లా సోషల్ మీడియా మాధ్యమాల వేదికగా నెటిజన్లతో చాట్ సెషన్ నిర్వహిస్తుంటారు శ్రుతీహాసన్. తాజాగా శ్రుతి నిర్వహించిన చాట్ సెషన్‌లో 'సౌత్ ఇండియన్ యాసలో ఏదైనా చెప్పండి' అని ఓ నెటిజన్ అడిగాడు. ఈ ప్రశ్న శ్రుతికి కోపం తెప్పించింది. "ఈ రకమైన జాతి వివక్షను నేను అస్సలు సహించను. మమ్మల్ని ఉద్దేశించి మీరు ఇడ్లీ, సాంబార్, దోసె అని పిలిస్తే ఊరుకోం. ఎలా పడితే అలా పిలిస్తే సరదాగా తీసుకోలేం. అలాగే మమ్మల్ని అనుకరించాలని మీరు ప్రయత్నించవద్దు. ఎందుకంటే.. మీరు మాలా చేయలేరు. సరే.. మీరు సౌత్ ఇండియన్ యాసలో ఏదైనా చెప్పమని అడిగారు కాబట్టి చెబుతున్నాను. 'నోరు మూసుకుని వెళ్లు'" అంటూ ఆ నెటిజన్‌కు రెస్పాండ్ అయ్యారు శ్రుతీహాసన్. ఇక సినిమాల విషయానికొస్తే... ప్రస్తుతం 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ, చెన్నై స్టోరీ' చిత్రాలతో బిజీగా ఉన్నారు శ్రుతీహాసన్.

ఇద్దరు స్నేహితుల కథ


రామ్ యోగి

సూర్య శ్రీనివాస్, శివ బొడ్డు రాజు హీరోలుగా, జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఈవీఓఎల్' (ఏ లవ్‌స్టోరీ ఇన్ రివర్స్). తేడా బ్యాచ్ సినిమా సమర్పణలో రామ్ యోగి వెలగపూడి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామ్ యోగి వెలగపూడి మాట్లాడుతూ– ''ఇద్దరు స్నేహితుల మధ్య అవగాహన నేపథ్యంలో సాగే కథే ఈ మూవీ. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుంది. హైదరాబాద్, వైజాగ్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: తేడా బ్యాచ్ సినిమా టీమ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	269	77,210
నిఫ్టీ ▽	66	23,501

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (భారత కాలమానం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,672	▽	49
డోజోన్స్	39,113	▽	21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,238	△	35
డాక్స్	18,164	△	91
షాంఘై	2,998	▽	7
నికాయ్	38,596	▽	37

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	72,746 △	548
బంగారం (99.5 స్వచ్ఛత)	72,455 △	582
వెండి (కిలో)	90,666 △	688

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.19	84.21
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.69	107.24
€	యూరో	ఎస్‌బీఐ	88.51	90.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.10	53.24
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.83	56.77
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.33	64.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.46

జెప్టోకు నిధుల పంట

- రూ. 5,550 కోట్ల సమీకరణ
- రూ. 30,000 కోట్లకు కంపెనీ విలువ



న్యూఢిల్లీ: గ్రోసరీ డెలివరీ స్టార్టప్ జెప్టో భారీగా పెట్టుబడులను అందుకుంది. త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానున్న కంపెనీ 66.5 కోట్ల డాలర్ల (రూ. 5,550 కోట్లు) నిధులను సమీకరించింది. దీంతో ఈ క్విక్ కామర్స్ సంస్థ విలువ 3.6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 30,000 కోట్లు)కు ఎగసింది. వెరసి ఈకామర్స్ దిగ్గజాలు అమెజాన్, బ్లింకిట్ (జొమాటో), స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బిగ్‌బాస్కెట్ (టాటా గ్రూప్)లతో పోటీ పడనుంది. గ్రోసరీ డెలివరీ విభాగంలో తీవ్ర పోటీ కారణంగా అధిక పెట్టుబడులు, తక్కువ మార్జిన్లు నమోదయ్యే సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జెప్టోలో తాజా పెట్టుబడులకు ప్రాధాన్యత ఏర్పడింది. 2021 ఏప్రిల్‌లో ప్రారంభమైన స్టార్టప్ జెప్టోలో కొత్త సంస్థలు ఎవెనీర్ గ్రోత్ క్యాపిటల్, లైట్‌స్పీడ్, అవ్రా క్యాపిటల్‌సహా ప్రస్తుత ఇన్వెస్టర్లు గ్లేడ్ బ్రూక్, నెక్సస్, స్టెప్‌స్టోన్ గ్రూప్ తాజా పెట్టుబడులను అందించాయి. కాగా.. జెప్టో నిర్వహణస్థాయిలో లాభాలు ఆర్జించేందుకు సిద్ధంగా ఉన్నదని, సమీప భవిష్యత్‌లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే అవకాశముందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గ్రోసరీస్‌ను 10 నిమిషాల్లో డెలివరీ చేసే సంస్థల్లో కంపెనీ 29% వాటాను ఆక్రమిస్తుండగా..40% వాటాతో బ్లింకిట్ టాప్‌లో ఉంది.

నాన్‌స్టాప్‌గా ఎగిరిపోదాం!


- డైరెక్ట్ ఫ్లయిట్స్ వైపు భారతీయ విమాన ప్రయాణికుల మొగ్గు
- 2023లో 3.72 కోట్ల మంది అంతర్జాతీయ ప్యాసింజర్లు

న్యూఢిల్లీ: అమెరికా, యూరప్ తదితర దేశాలకు వెళ్లే భారతీయ విమాన ప్రయాణికులు ఇన్‌డైరెక్ట్ ఫ్లయిట్ల కన్నా నాన్-స్టాప్, డైరెక్ట్ ఫ్లయిట్లకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అంతర్జాతీయ ట్రావెల్ డేటా సంస్థ ఓఏజీ గణాంకాల ప్రకారం గత కొన్నాళ్లుగా ఈ ధోరణి పెరుగుతోంది. 2023లో 3.72 కోట్ల మంది ప్యాసింజర్లు నాన్-స్టాప్ ఫ్లయిట్స్‌లో ప్రయాణించారు. కోవిడ్ పూర్వం 2019తో పోలిస్తే ఇది ఇరవై లక్షలు అధికం. ఇదే వ్యవధిలో ఒకటి లేదా అంతకు మించి స్టాప్స్‌లో ఆగుతూ వెళ్లే ఇన్‌డైరెక్ట్ ఫ్లయిట్స్‌లో ప్రయాణించిన వారి సంఖ్య 25 లక్షలు తగ్గి 2023లో 2.74 కోట్లకు పరిమితమైంది.

2023లో ప్రయాణించిన మొత్తం 6.46 కోట్ల మంది ప్యాసింజర్లలో 57 శాతం మంది నాన్-స్టాప్ ఫ్లయిట్స్‌నే ఎంచుకున్నారు. 2019లో ఇది 53 శాతంగా ఉంది.

పశ్చిమాసియా హబ్‌లకు తగ్గిన ప్రయాణికులు

అమెరికా, యూరప్‌లకు వెళ్లే ఫ్లయిట్స్ కోసం భారతీయులు ఎక్కువగా పశ్చిమాసియా హబ్‌ల వైపు మొగ్గు చూపే ధోరణి తగ్గింది. ఓఏజీ గణాంకాల ప్రకారం 2019–2023 మధ్య కాలంలో పశ్చిమాసియా హబ్‌లకు ప్యాసింజర్ల సంఖ్య 10 లక్షల మేర తగ్గింది. ఆ నాలుగేళ్ల వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా ఇతర హబ్‌లకు కూడా ప్రయాణికుల సంఖ్య 28 లక్షల మేర తగ్గింది. మరోవైపు, కొత్తగా 52 అంతర్జాతీయ రూట్లను జోడించడంతో ఇన్‌డైరెక్ట్ ఫ్లయిట్ ప్యాసింజర్లకు సంబంధించి దేశీ హబ్‌లలో ప్రయాణికుల సంఖ్య 10 లక్షల మేర పెరిగింది. ఓఏజీ విశ్లేషణ ప్రకారం గల్ఫ్ దేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరిగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో (యూఏఈ) 36 లక్షల మంది, సౌదీ అరేబియాలో 26 లక్షల మంది ఉన్నారు. ఇంటర్నేషనల్ రూట్లలో భారతీయులను గమ్యస్థానాలకు చేరవేయడంలో పశ్చిమాసియా దేశాల ఎయిర్‌లైన్స్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈ విషయంలో దశాబ్దం క్రితం గల్ఫ్ దేశాల ఎయిర్‌లైన్స్ వాటా 48 శాతంగా ఉండగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇది 50 శాతానికి పెరిగింది.





పెట్టుబడి సాధనాలుగా యులిప్స్‌ను ప్రచారం చేయొద్దు

ఐఆర్‌డీఏఐ సర్క్యులర్

న్యూఢిల్లీ: యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీలను (యులిప్స్) 'పెట్టుబడి సాధనాలు'గా ప్రచారం చేయొద్దని బీమా సంస్థలను ఆదేశిస్తూ బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ మాస్టర్ సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం యులిప్‌లనేవి సంప్రదాయ ఎండోమెంట్ పాలసీలకు భిన్నమైనవని, ఇవి మార్కెట్ ఆధారిత బీమా పథకాలని, వీటిలో రిస్కులు ఉంటాయనేది బీమా సంస్థలు నిర్దిష్టంగా పేర్కొనాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
22-6-2024	
విశాఖ	515-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్

- ఫార్మా సర్వీసెస్‌లో ఉజ్వల భవిష్యత్
- సప్తగిర్ గ్రూప్ ఎండీ శిల్పా రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా సర్వీసెస్ రంగంలో చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయని సీఐఐ తెలంగాణ ఫార్మా, లైఫ్ సైన్సెస్ కన్వీనర్, సప్తగిర్ గ్రూప్ ఎండీ శిల్పా రెడ్డి శుక్రవారమిక్కడ తెలిపారు. చైనాతోపాటు మరో దేశంలోని కాంట్రాక్ట్ రిసర్చ్, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలతో చేతులు కలపాలన్న అభివృద్ధి చెందిన దేశాల వ్యూహం భారత్‌కు కలిసి వస్తుందన్నారు. దేశంలో ఐటీ సేవలను మించి ఫార్మా సర్వీసెస్ రంగం దూసుకు వెళ్లేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఇదే జరిగితే కెమికల్ సైంటిస్టులకు డిమాండ్ ఉంటుందని శిల్పా రెడ్డి అన్నారు.



ప్రస్తుతం భారత ఫార్మా సర్వీసెస్ మార్కెట్ విలువ 2 బిలియన్ డాలర్లు ఉందని వివరించారు.

అసోసియేషన్‌కు కార్యరూపం..: ఫార్మా సర్వీసెస్ కంపెనీలను ఏకతాటిపైకి తీసుకువస్తూ సంఘం ఏర్పాటు చేయనున్నట్టు ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈవో మణి కంటిపూడి వెల్లడించారు. దేశంలో సుమారు 25,000 మంది సైంటిస్టులు ఈ రంగంలో ఉన్నారని చెప్పారు. పదేళ్లలో ఈ సంఖ్య లక్షకు చేరుకుంటుందని, 10 బిలియన్ డాలర్లకు పరిశ్రమ వృద్ధి చెందుతుందని అంచనాగా చెప్పారు. ఫార్మా సర్వీసెస్ పరిశ్రమల కోసం ప్రత్యేక పార్క్/క్లస్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బీ న్యూ స్టోర్లలో షావోమీ 14 సివి స్మార్ట్‌ఫోన్లు



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ తన స్టోర్లలో షావోమి 14 సివి స్మార్ట్ ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్ మాదాపూర్‌లోని బీన్యూ స్టోర్‌లో నటి అమ్రితా అయ్యర్ ఈ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేశారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నితేష్‌తో పాటు ఎంఐ సంస్థ సీనియర్ డైరెక్టర్ కునాల్ అగర్వాల్, డిప్యూటీ హెడ్ చానెల్ సేల్స్ బీవీ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

జేకే టైర్ నుంచి 4 ఉత్పత్తులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టైర్ల తయారీ దిగ్గజం జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ కొత్తగా నాలుగు ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. టిప్పర్లు, ట్రైలర్లు, బస్సులు మొదలైన వాహనాల కోసం ఇవి ఉపయోగపడతాయి. జెట్‌వే జేయూఎం ఎక్స్‌ఎం, జేయూసీ ఎక్స్‌ఎం, జెట్‌స్టీల్ జేడీసీ ఎక్స్‌డీతో పాటు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ బస్సుల కోసం జెట్‌వే జేయూ ఎక్స్‌ఈ పేరిట టైర్లను ప్రవేశపెట్టినట్లు కంపెనీ ప్రెసిడెంట్ (ఇండియా) అనుజ్ కథూరియా తెలిపారు.




ఇన్‌ఫ్రా, మైనింగ్ రంగాల వాహనాలకు సంబంధించి ఇంధనం, నిర్వహణ ఖర్చులు ఆదా చేసే విధంగాను, దీర్ఘకాలం మన్నే విధంగాను వీటిని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ రెండు రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థలు తెలంగాణ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో ఇది తమకు అత్యంత కీలకమైన మార్కెట్లలో ఒకటిగా ఉంటోందని కథూరియా వివరించారు. రాష్ట్రంలో తమకు 380 మందికి పైగా డీలర్లు ఉన్నారని, 4–5% మార్కెట్ వాటా ఉందన్నారు.

బుల్ రికార్డులకు బ్రేక్

- గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ
- ఇంట్రాడేలో నిఫ్టీ కొత్త రికార్డు

ముంబై: సెన్సెక్స్ ఆరు రోజుల రికార్డు ర్యాలీకి శుక్రవారం అడ్డుకట్ట పడింది. గరిష్ట స్థాయిల వద్ద ఆయిల్‌అండ్‌గ్యాస్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్‌ఎంసీజీ స్టాక్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 269 పాయింట్లు నష్టపోయి 77,210 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 677 పాయింట్లు క్షీణించి 76,802 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఇంట్రాడేలో నిఫ్టీ 100 పాయింట్లు పెరిగి 23,667 తాజా గరిష్టాన్ని నమోదు చేసింది. కానీ ఆద్యంతం అదే దూకుడును కొనసాగించలేకపోయింది. చివరకు 66 పాయింట్ల పతనంతో 23,501 వద్ద స్థిరపడింది. అధిక వెయిటేజీ భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు (1%–0.50%) రాణించి నష్టాలను పరిమితం చేశాయి. ఐటీ, టెలికం, మెటల్, పవర్, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.



- చివరి రోజు నాటికి డీఈఈ డెవలప్‌మెంట్ ఇంజినీర్స్ ఐపీఓ 99.56 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 1.49 కోట్ల ఈక్విటీలు జారీ చేయగా 148.78 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- ఆక్మే ఫిన్‌ట్రేడ్ పబ్లిక్ ఇష్యూ 55.12 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది. రూ.132 కోట్ల విలువైన 78.65 లక్షల షేర్లను అమ్మకానికి ఉంచగా, 43.35 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి.
- విద్యా సంబంధ రుణాలందించే ఎన్‌బీఎఫ్‌సీ.. అవాన్స్ ఫైనాన్షియల్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. దీనికోసం క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 3,500 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. కంపెనీలో అనుబంధ సంస్థ ఆలివ్ వైన్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఇన్వెస్ట్ చేసింది.



ఐటీఎఫ్ టోర్నీ సెమీస్‌లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికాలోని కన్సాస్ రాష్ట్రంలోని విచిటా సిటీలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 6-1, 6-1తో ఒలీవియా లిన్సెర్ (పోలాండ్)పై విజయం సాధించింది. గంటా 44 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ప్రత్యర్థి సర్విస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

బోపన్న జోడీ ఓటమి



సించ్ చాంపియన్‌షిప్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-7 (1/7), 6-7 (3/7)తో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)-ఖచనోవ్ (రష్యా) జంట చేతిలో ఓడిపోయింది. బోపన్న-ఎబ్డెన్‌లకు 18,690 పౌండ్ల (రూ. 19 లక్షల 75 వేలు) ప్రైజ్‌మనీ, 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సెల్ఫ్ గోల్‌తో ఓడిన ఇటలీ



గెల్‌సెన్‌కిర్చెన్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ జట్టుకు చుక్కెదురైంది. మాజీ విజేత స్పెయిన్‌తో శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఇటలీ 0–1 గోల్ తేడాతో ఓడిపోయింది. వరుసగా రెండో విజయంతో స్పెయిన్ జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది. ఆట 55వ నిమిషంలో స్పెయిన్ ఫార్వర్డ్ అల్వారో మొరాటో హెడర్ షాట్‌ను ఇటలీ గోల్‌కీపర్ గియాన్లుగి డొనారుమా నిలువరించాడు. అయితే ఇటలీ గోల్‌కీపర్ నిలువరించిన బంతి ఇటలీ డిఫెండర్ రికార్డో కాలాఫియోరి కాలికి తగిలి తిరిగి గోల్‌పోస్ట్‌లోకి వెళ్లింది. దాంతో ఇటలీ సెల్ఫ్ గోల్‌తో స్పెయిన్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లి చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంది. ఇతర మ్యాచ్‌ల్లో ఆస్ట్రియా 3–1తో పోలాండ్ జట్టుపై, ఉక్రెయిన్ 2–1తో స్లొవేకియాపై గెలిచాయి.

అర్జెంటీనా బోణీ



అల్వారెజ్

అట్లాంటా: కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా జట్టు శుభారంభం చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా 2–0 గోల్స్ తేడాతో కెనడా జట్టును ఓడించింది. అర్జెంటీనా తరఫున జూలియన్ అల్వారెజ్ (49వ ని.లో), లాటారో మార్టినెజ్ (88వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మెస్సీ అందించిన పాస్‌లతో ఈ రెండు గోల్స్ నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మెస్సీ వందేళ్లకంటే ఎక్కువ చరిత్ర ఉన్న కోపా అమెరికా కప్‌లో అత్యధికంగా 35 మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు చిలీకి చెందిన సెర్జియో లివింగ్‌స్టోన్ (1941 నుంచి 1953 వరకు; 34 మ్యాచ్‌లు) పేరిట ఉంది. ఈనెల 26న జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో మాజీ చాంపియన్ చిలీతో అర్జెంటీనా ఆడుతుంది.

సెమీఫైనల్ లక్ష్యంగా...

నేడు సూపర్-8లో భారత్ రెండో మ్యాచ్

- బంగ్లాదేశ్‌తో టీమిండియా పోరు
- రాత్రి గం.8 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): టి20 వరల్డ్ కప్‌లో ఓటమి లేకుండా అజేయంగా సాగుతున్న భారత్ సెమీఫైనల్ వేటలో మరో కీలక సమరానికి సిద్ధమైంది. సూపర్-8 దశలో భాగంగా గ్రూప్-1లో నేడు జరిగే పోరులో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై అలవోకగా నెగ్గిన టీమిండియా అమితోత్సాహంతో ఉండగా... తమ మొదటి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన బంగ్లాదేశ్ తీవ్ర ఒత్తిడి మధ్య మరో మ్యాచ్ బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడం దాదాపు ఖాయమవుతుంది. మరోవైపు ఈ మ్యాచ్‌లోనూ ఓడితే బంగ్లాదేశ్ సెమీస్ ఆశలు గల్లంతవుతాయి. బలాబలాలు, ఫామ్‌ను బట్టి చూస్తే మరో సందేహం లేకుండా భారత జట్టే ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

రోహిత్, కోహ్లి రాణిస్తే...

టోర్నీలో భారత్ ఆడిన నాలుగు మ్యాచ్‌లను బట్టి చూస్తే ఓపెనర్లు రోహిత్, కోహ్లిల బ్యాటింగ్‌పై మాత్రమే కాస్త ఆందోళన కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై రోహిత్ అర్ధ సెంచరీ చేసినా, తర్వాతి మూడు మ్యాచ్‌లలో విఫలమయ్యాడు. తొలి మూడు మ్యాచ్‌లలో విఫలమైన కోహ్లి...అఫ్గాన్‌పై 24 పరుగులు చేసినా అది అతని స్థాయికి తగిన ఇన్నింగ్స్ కాదు. ఈ నేపథ్యంలో బంగ్లాపై వీరిద్దరు చెలరేగాలని జట్టు కోరుకుంటోంది. శివమ్ దూబే కూడా ఆశించిన రీతిలో ఆడటం లేదు. మిడిలార్డర్‌లో లెఫ్ట్ హ్యాండర్‌గా ఏకైక ప్రత్యామ్నాయం కావడంతో అతనికి మరో అవకాశం దక్కవచ్చు. ఇది మినహా ఇతర అంశాల్లో జట్టు పటిష్టంగా ఉంది. సూర్యకుమార్, పంత్‌ల బ్యాటింగ్‌తో పాటు పాండ్యా కూడా దూకుడుగా ఆడటం భారత్‌కు సానుకూలాంశం. బౌలింగ్‌లో అఫ్గాన్‌పై కుల్దీప్ ఆకట్టుకున్న నేపథ్యంలో తుది జట్టులో ఎలాంటి మార్పూ ఉండకపోవచ్చు.

అన్నింటా తడబాటు...

సూపర్-8కు చేరినా లీగ్ దశలోనూ బంగ్లాదేశ్ ఆట అంతంతమాత్రమే. ఆసీస్‌తో పోరులో కూడా అది కనిపించింది. టాపార్డర్‌లో ఒక్క దూకుడైన బ్యాటర్ కూడా లేకపోవడం జట్టు ప్రధాన బలహీనత. తౌహీద్ ఫర్వాలేదనిపించడం మినహా ప్రధాన బ్యాటర్లు తన్‌జీద్, దాస్, కెప్టెన్ నజ్ముల్ వరుసగా విఫలమయ్యారు. సీనియర్ మహ్ముదుల్లా కూడా ప్రభావం చూపలేదు. రికార్డు స్థాయిలో 9వ టి20 వరల్డ్ కప్ ఆడుతున్న షకీబ్ ఒక్క మ్యాచ్ మినహా బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలమయ్యాడు. 4 ఇన్నింగ్స్‌లలో కలిపి 2 వికెట్లు తీశాడు. భారత్‌పై అతను ఏమైనా ఆకట్టుకోగలడా అనేది చూడాలి. బౌలర్లు ముస్తఫిజుర్, తన్‌జీమ్, తస్కీన్ నిలకడగా రాణించడం వల్లే బంగ్లా ఇక్కడి వరకు వచ్చింది. వీరు టీమిండియా స్టార్ బ్యాటర్లను ఎంత వరకు నిలువరిస్తారనేది ఆసక్తికరం.

టి20 ప్రపంచకప్‌లో నేడు
వెస్టిండీస్ X అమెరికా
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; ఉదయం గం. 6 నుంచి
భారత్ X బంగ్లాదేశ్
వేదిక: నార్త్‌సౌండ్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

దక్షిణాఫ్రికా సూపర్...

- ఇంగ్లండ్‌పై 7 పరుగులతో విజయం
- చెలరేగిన డికాక్, రాణించిన బౌలర్లు



డికాక్

గ్రాస్ ఐలెట్: టి20 వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా దాదాపు సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ తో శుక్రవారం చివరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో దక్షిణాఫ్రికా 7 పరుగుల తేడాతో నెగ్గింది. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఇప్పటికే అమెరికాను ఓడించింది. ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. ముందుగా దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డికాక్ (38 బంతుల్లో 65; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా, మిల్లర్ (28 బంతుల్లో 43; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. డికాక్ దూకుడుతో పవర్‌ప్లేలోనే 63 పరుగులు చేసిన సఫారీ టీమ్ ఆ తర్వాత తడబడింది. ఇంగ్లండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో తర్వాతి 84 బంతుల్లో 100 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆర్చర్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులే చేయగలిగింది. హ్యారీ బ్రూక్ (37 బంతుల్లో 53; 7 ఫోర్లు), లివింగ్‌స్టోన్ (17 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా లాభం లేకపోయింది. వీరిద్దరు ఐదో వికెట్‌కు 42 బంతుల్లోనే 78 పరుగులు జోడించారు. 4 ఓవర్లలో ఇంగ్లండ్ 46 పరుగులు చేయాల్సి ఉండగా... బార్త్‌మన్ ఓవర్లో ఏకంగా 21 పరుగులు వచ్చాయి. దాంతో సమీకరణం 18 బంతుల్లో 25గా మారింది. బ్రూక్, లివింగ్‌స్టోన్ క్రీజ్‌లో ఉండటంతో పాటు చేతిలో ఆరు వికెట్లు ఉండటంతో ఇంగ్లండ్ గెలిచే స్థితిలో నిలిచింది. అయితే దక్షిణాఫ్రికా బౌలర్లు రబాడ, జాన్సెన్, నోర్జే ఒక్కసారిగా ఆటను మార్చేశారు. తర్వాతి 3 ఓవర్లలో రెండు వికెట్లు తీసి 17 పరుగులే ఇచ్చారు. దాంతో ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది.

ఆసీస్ అదరహో

- 28 పరుగులతో బంగ్లాదేశ్‌పై గెలుపు
- ప్యాట్ కమిన్స్ 'హ్యాట్రిక్'



కమిన్స్

నార్త్ సౌండ్ (ఆంటిగ్వా): టి20 వరల్డ్ కప్ సూపర్-8 తొలి మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా చెలరేగింది. అన్ని విభాగాల్లో రాణించి బంగ్లాదేశ్‌ను ఓడించింది. శుక్రవారం జరిగిన గ్రూప్-2 పోరులో ఆసీస్ 28 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ (36 బంతుల్లో 41; 5 ఫోర్లు, 1 సిక్స్), తౌహీద్ హృదయ్ (28 బంతుల్లో 40; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. చివర్లో కమిన్స్ 'హ్యాట్రిక్'తో టీమ్ సాధారణ స్కోరుకు పరిమితమైంది. ఇన్నింగ్స్ 18వ ఓవర్లో ఐదో బంతికి మహ్ముదుల్లా (2), చివరి బంతికి మెహదీ హసన్ (0)లను అవుట్ చేసిన కమిన్స్... ఆ తర్వాత 20వ ఓవర్ తొలి బంతికి తౌహీద్‌ను వెనక్కి పంపి 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు. అనంతరం ఆస్ట్రేలియాకు వార్నర్ (35 బంతుల్లో 53 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెడ్ (21 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడైన ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 41 బంతుల్లోనే 65 పరుగులు జోడించారు. అనంతరం రిషాద్ తన వరుస ఓవర్లలో హెడ్, మార్ష్ (1)లను అవుట్ చేయగా...11.2 ఓవర్లు ముగిసేసరికి ఆసీస్ 2 వికెట్లు కోల్పోయి 100 పరుగులు సాధించింది. ఈ దశలో భారీ వర్షం కురిసింది. వాన ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను ఆ స్థితిలో ముగిస్తున్నట్లు ప్రకటించారు. డక్‌వర్త్ నిబంధనల ప్రకారం ఆ సమయానికి ఆసీస్ 72 పరుగులు చేస్తే సరిపోతుంది. కానీ అప్పటికే 28 పరుగులు ముందంజలో ఉన్న కంగారూ టీమ్ విజేతగా నిలిచింది.

7 టి20 ప్రపంచకప్ చరిత్రలో నమోదైన హ్యాట్రిక్‌ల సంఖ్య. బ్రెట్‌లీ (2007) తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆస్ట్రేలియా బౌలర్‌గా కమిన్స్ నిలవగా... గతంలో కర్టిస్ కాంఫర్ (ఐర్లాండ్), హసరంగ (శ్రీలంక), రబాడ (దక్షిణాఫ్రికా), కార్తీక్ మెయప్పన్ (యూఏఈ), జోష్ లిటిల్ (ఐర్లాండ్) ఈ ఘనతను నమోదు చేశారు.

రెండు పతకాలపై ధీరజ్ గురి

వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో ముందంజ

అంటాల్యా (టర్కీ): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-3 టోర్నీ పురుషుల రికర్వ్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ రెండు పతకాల రేసులో నిలిచాడు. రికర్వ్ మిక్స్‌డ్ విభాగంలో భజన్ కౌర్‌తో కలిసి ధీరజ్ ఆదివారం కాంస్య పతకం కోసం పోటీపడనున్నాడు. దాంతోపాటు పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలోనూ ధీరజ్ సెమీఫైనల్ చేరుకున్నాడు. వ్యక్తిగత విభాగం క్వార్టర్ ఫైనల్లో ధీరజ్ 7-3 (28-29, 28-27, 29-29, 28-27, 30-27)తో వెటెర్ (జర్మనీ)పై గెలిచాడు. మిక్స్‌డ్ విభాగం సెమీఫైనల్లో ధీరజ్-భజన్ కౌర్ ద్వయం 3-5 (37-34, 36-38, 37-37, 36-38)తో జెన్ హన్‌యంగ్-లీ వూసియోక్ (కొరియా) జంట చేతిలో ఓడింది.



నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో భారత్ పర్యటన

జొహన్నెస్‌బర్గ్: ఈ ఏడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో భారత పురుషుల క్రికెట్ జట్టు పర్యటించనుంది. ఈ పర్యటనలో భారత జట్టు దక్షిణాఫ్రికాతో నాలుగు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను ఆడుతుంది. నవంబర్ 8న డర్బన్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది. ఆ తర్వాత పోర్ట్ ఎలిజబెత్‌లో 10న రెండో టి20, 13న సెంచూరియన్‌లో మూడో టి20, 15న జొహన్నెస్‌బర్గ్‌లో జరిగే చివరిదైన నాలుగో టి20తో పర్యటన ముగుస్తుంది.



శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబారి హెచ్.ఈ.చాంగ్ జే-బోక్ బృందం.

మహిళాశక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలి

సచివాలయంలో ప్రారంభించిన మంత్రి సీతక్క



సచివాలయంలో మహిళాశక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క. చిత్రంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో 151 మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారని, మహిళాశక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సచివాలయంలో గ్రౌండ్ ఫ్లోర్, థర్డ్‌ఫ్లోర్‌లో మహిళాశక్తి క్యాంటీన్లను సీఎస్ శాంతికుమారితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ క్యాంటీన్లు కార్పొరేట్ క్యాంటీన్లను తలపిస్తున్నాయన్నారు. మహిళాశక్తి క్యాంటీన్లు ప్రతి ఇంటి అమ్మచేతి వంటలా నాణ్యతకు మారుపేరుగా నిలవాలని చెప్పారు. పల్లెరుచులు, ఇప్పపువ్వు లడ్డూలు, నన్నారి వంటి వాటిని పట్టణాలకు పరిచయం చేయాలన్నారు. రానున్న ఐదేళ్లలో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందిస్తామన్నారు.

జిల్లా ఆస్పత్రుల్లోనూ....

మహిళా శక్తి క్యాంటీన్లకు సచివాలయంలో మొదటి అడుగు పడిందని, 20 రోజుల్లో జిల్లా ఆస్పత్రుల్లో మహిళా శక్తి కాంటీన్లు ప్రారంభించే పనులను వేగవంతం చేయాలని అధికారులను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. తెలంగాణ మహిళాసంఘాలు దేశానికే ఆదర్శంగా ఎదుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పీఆర్ అండ్ ఆర్ డీ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయ, సీఎం కార్యాలయ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావు, అధికారులు నర్సింహారెడ్డి, సునీతరెడ్డి, రజిత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల టీచర్ల ధ్రువపత్రాల పరిశీలన 24 నుంచి..

సాక్షి, హైదరాబాద్: గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలనకు బీసీ గురుకుల సొసైటీ ఉపక్రమించింది. ఈనెల 24 నుంచి 30 వరకు బంజారాహిల్స్‌లోని సంత్ సేవాలాల్ బంజారా భవన్‌లో ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు నిర్వహించనున్నట్లు బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గురుకుల సొసైటీల్లో 8 వేలకు పైగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు పూర్తి చేసింది. కొందరికి నియామక పత్రాలు ఇవ్వనప్పటికీ.. ఇప్పటికే నియామక పత్రాలను అందుకున్న వారి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగించాలని బీసీ గురుకుల సొసైటీ నిర్ణయిస్తూ షెడ్యూల్ జారీ చేసింది. ఈనెల 24న లైబ్రేరియన్ (స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలు), ఫిజికల్ డైరెక్టర్, (జూనియర్, డిగ్రీ కళాశాలలు), డిగ్రీ లెక్చరర్స్ అభ్యర్థులు హాజరు కావాలని, 25న జూనియర్ లెక్చరర్ (ఆంగ్లం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, హిస్టరీ), 26న జూనియర్ లెక్చరర్ (హిందీ, తెలుగు, గణితం), పీజీటీ (తెలుగు, హిందీ), 27న పీజీటీ (ఆంగ్లం, మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, సోషల్) ఫిజికల్ డైరెక్టర్ గ్రేడ్-ఐఐ, 28న టీజీటీ (హిందీ, బయలాజికల్ సైన్స్, సోషల్) 29న టీజీటీ (ఆంగ్లం, ఫిజికల్ సైన్స్) 30న టీజీటీ (తెలుగు, గణితం) అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. నిర్దేశించిన తేదీల్లోనే అభ్యర్థులు హాజరు కావాలని బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు స్పష్టం చేశారు. ఇప్పటికే అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేసినట్లు వివరించారు. అన్ని రకాల ఒరిజినల్ ధ్రువపత్రాలతో అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ప్రస్తుతం బీసీ గురుకుల సొసైటీ మాత్రమే పరిశీలన తేదీలను ప్రకటించగా.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, జనరల్ గురుకుల సొసైటీలు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

రాష్ట్రంలో పప్పుదినుసుల బోర్డు ఏర్పాటు చేయండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల వినతి
- 10 రాష్ట్రాల మంత్రులతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: దేశంలో పప్పుదినుసుల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా రాష్ట్రాల వ్యవసాయ మంత్రులను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కోరారు. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా దేశంలో పప్పుదినుసుల సాగును పెంచాల్సి ఉందని, దానికి తగినట్లుగా కేంద్ర ప్రభుత్వ విధివిధానాలు రూపొందిస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం 10 రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో శివరాజ్‌సింగ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ తెలంగాణలో పండించే తాండూరు కందిపప్పుకు ప్రపంచంలోనే విశిష్ట స్థానముందని, కేవలం అక్కడ ఉన్న మార్కెట్‌కే ఏటా 4 లక్షల క్వింటాళ్ల కందిపప్పు వస్తుందని తెలిపారు. తాండూరు కందిపప్పుకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ వచ్చిందన్నారు. రాష్ట్రంలో పప్పుదినుసుల బోర్డు ఏర్పాటు ద్వారా ఇక్కడ రైతులందరినీ మరింత ప్రోత్సహించేందుకు వీలు కలుగుతుందని, ఆ దిశలో తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. పప్పు దినుసుల సేకరణపై విధించిన 25 శాతం పరిమితిని ఎత్తేయాలని విజ్ఞప్తి చేశారు. పప్పుదినుసులు సాగు చేసే రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఇచ్చే సబ్సిడీని పెంచాలని మంత్రి తుమ్మల.. శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు.

- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు అంటూ ఊదరగొట్టే యాడ్స్‌ను చూసి చాలా మంది అమాయకులు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. ఇటీవల కాలంలో ఈ ఫేస్‌బుక్ యాడ్స్‌లో ఉన్నవన్నీ నిజాలనుకుని మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. స్టాక్‌మార్కెట్‌లో తక్కువ కాలంలోనే ఎన్నో రెట్ల లాభాలు పొందవచ్చని సైబర్ నేరగాళ్లు మోసపూరిత యాడ్స్‌ను పెడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రకటనల్లోని నంబర్లు, లింక్‌లను నమ్మవద్దని వారు వారించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.